
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 36
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



సురేఖకు 3 స్వర్ణాలు

వరల్డ్ కప్ స్టేజ్ 1 ఆర్చరీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతిసురేఖ 3 పసిడి పతకాలతో మెరిసింది. చైనాలోని షాంఘైలో జరిగిన కాంపౌండ్ ఈవెంట్‌లో వ్యక్తిగత, మిక్స్‌డ్, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు గెలుచుకుంది. - 14లో



60 ఏళ్ల వయసులో అందాల కిరీటం

అర్జెంటీనాకు చెందిన అలెహంద్రా మారిసా రోడ్రిగెజ్ మిస్ యూనివర్స్ బ్యూనస్ ఎయిర్స్‌గా ఎంపికయ్యారు. మరో టైటిల్ గెలిస్తే ఆమె 'మిస్ యూనివర్స్' పోటీలో నిలుస్తారు. - 6లో

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

ఆర్‌ఎస్‌ఎస్ మనువాద విధానాన్ని అమలు చేస్తున్న బీజేపీ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

- 2025 నాటికి దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనేది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం
- రిజర్వేషన్లను మొత్తంగా ఎత్తి వేయాలనేది వారి సిద్ధాంతం
- అదే జరిగితే కార్పొరేట్ల ముందు దళితులు, గిరిజనులు, ఓబీసీలు కట్టు బానిసలే..
- ఆ దిశగానే ప్రధాని మోదీ, అమిత్ షా విచక్షణా రహిత వ్యాఖ్యలు
- కాంగ్రెస్ గెలిస్తే పుస్తెలు అమ్మేస్తారంటూ దిగజారి మాట్లాడుతున్నారు
- కేసీఆర్ బీజేపీతో కుమ్మక్కయ్యారు.. ఐదు ఎంపీ సీట్లను తాకట్టు పెట్టారు
- దేశంలో రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ గెలవాలని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేసి.. రిజర్వేషన్లు లేని దేశంగా మార్చేందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుట్రలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను కార్పొరేట్ శక్తులతో కలసి అమలు చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌పై మోదీ, అమిత్ షా విష ప్రచారం చేస్తున్నారని.. పుస్తెలు అమ్మేస్తారంటూ మిగతా 2వ పేజీలో ▶



ఎమ్మెల్సీ పదవిస్తాం.. 'భువనగిరి' నుంచి తప్పుకోండి
సీపీఎం బృందానికి సీఎం విజ్ఞప్తి.. ఆలోచించి చెబుతామన్న తమ్మినేని
- వివరాలు 2లో



జగన్ ఇస్తున్న మాట

ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ

వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో-2024 విడుదల చేసిన ఏపీ సీఎం వైఎస్ జగన్

- అమ్మ ఒడి రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంపు
- రైతు భరోసా రూ.13,500 నుంచి రూ.16 వేలకు పెంపు
- వృద్ధాప్య పెన్షన్ రూ.3 వేల నుంచి రెండు విడతల్లో రూ.3,500లకు..

- వివరాలు 11లో

పాదయాత్ర స్ఫూర్తితో పాలన

- ఒక హీరోలా ప్రజల వద్దకు వెళుతున్నా: సీఎం జగన్

- వివరాలు 11లో



రైతుకు మళ్లీ గోస ఎందుకు?

మళ్లీ బోర్లు, నీళ్ల ట్యాంకులు, బిందెలు ఎందుకు వచ్చాయి?

కోతలు పూర్తయి 20 రోజులైనా ధాన్యం కొనే దిక్కులేదు: కేసీఆర్

- భోజనం చేస్తున్నంత సేపట్లో రెండు సార్లు కరెంట్ పోయింది
- ఈ బాధలన్నీ ఎందుకు వచ్చాయి?
- మీ తరఫున నిలబడి, ప్రభుత్వం మెడలు వంచేలా బలం ఇవ్వండి
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఫైర్
- నాగర్‌కర్నూల్ రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో మాజీ సీఎం కేసీఆర్

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ''రాష్ట్రం ఇప్పుడు భగ్గుమంటోంది. నా బస్సును కదలనివ్వనంత జనం.. వారి పూల స్వాగతమే చెప్తున్నాయి భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దేనని.. కాంగ్రెస్ బలుపు దించాలి'' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర ఐదో రోజు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మిగతా 2వ పేజీలో ▶


జై తెలంగాణ నినాదాలు చేస్తున్న కేసీఆర్, ప్రవీణ్‌కుమార్



ఎన్నికల ముందు అభయహస్తం.. ఎన్నికలయ్యాక భస్మాసుర హస్తం

- తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిట్‌చాట్
- సీఎం రేవంత్‌కు మాట నిలుపుకొన్న చరిత్ర లేదు
- గతంలో కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం అన్నారు.. ఏమైంది?
- సొంత జిల్లాలో గెలవలేమనే.. ఇన్‌చార్జి బాధ్యత నుంచి రేవంత్ తప్పుకొన్నారు... ఎన్నికలయ్యాక ఆయన బీజేపీలో చేరడం ఖాయం
- ఏపీలో జగన్ మళ్లీ గెలుస్తున్నారన్న సమాచారం తమకు ఉందని వెల్లడి

5లో

కాంగ్రెస్‌కు 14 సీట్లు వస్తే రాజకీయ సన్యాసం

సీఎం ఇచ్చిన హామీలన్నీ ఆగస్టు 15లోగా అమలు చేస్తే నేను రాజీనామా చేస్తా: ఏలేటి 15లో

అలాగైతే పోటీ నుంచే తప్పుకుంటా

ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లు నిరూపిస్తారా?: బండి
- వివరాలు 10లో


సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

వంద శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయ వ్యవస్థ

- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వెల్లడి
- నల్లగొండలో కోర్టుల భవన సముదాయం ప్రారంభం

- వివరాలు 3లో



నాగోల్‌లో రెండు మెట్రో స్టేషన్లు

- కొత్తగా నిర్మించనున్న ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్
- రెండు స్టేషన్‌ల మధ్య విశాలమైన స్కైవాక్
- నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు స్టేషన్‌ల అలైన్‌మెంట్
- కాలినడకన వెళ్లి పరిశీలించిన మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

- వివరాలు 16లో





రైతుకు మళ్లీ గోస ఎందుకు?

▶ మొదటి పేజీ తరువాయి
రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఏప్రిల్ 27.. ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి శంకుస్థాపన జరిగిన రోజు. 23 ఏళ్ల కింద తెలంగాణ సాధన కోసం పిడికెడు మందితో ఉక్కు సంకల్పంతో యుద్ధం ప్రారంభించిన రోజు.. బీఆర్ఎస్ పుట్టినరోజు. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని చెప్పి ఆమరణ దీక్ష చేపట్టినప్పుడు మీరు ఇచ్చిన మద్దతు.. అప్పటి ఘటనలు యాది చేసుకుంటే.. అదో ఉప్పెన, బ్రహ్మాండమైన సన్నివేశం. నేను మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ సాధించుకున్నాం. ఈ గౌరవం చరిత్రలో ఎప్పటికీ ఉంటుంది.

రైతులకు మళ్లీ కష్టాలు వచ్చాయి

అడ్డగోలు హామీలిచ్చి, దుష్ప్రచారం చేసి కేవలం 1.5 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు వచ్చాయి. పంటలు ఎండిపోయాయి. మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి 20 రోజులైనా కొనే దిక్కులేదు. మేం రెప్పపాటు కరెంటు పోకుండా 24 గంటల పాటు అందించాం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ రాత్రిపూట కరెంటు కోసం తిప్పలు, బావుల వెంట పరుగులు, కరెంటు షాకులు, తేళ్లు, పాములు.. ఈ బాధలు మళ్లీ ఎందుకు వచ్చాయి? రోజు సీఎం, మంత్రులు మీటింగ్‌లు పెట్టి 24 గంటల కరెంటు ఇస్తున్నామని అంటున్నారు. మరి ఈ రోజు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో నేను భోజనం చేస్తుంటే రెండు సార్లు కరెంటు పోయింది. రోజుకు పది సార్లు ఇలానే పోతోందని చెప్తున్నారు. మళ్లీ బోర్లు, నీళ్ల ట్యాంకులు, బిందెలు ఎందుకు వచ్చాయో ఆలోచించండి.

ప్రభుత్వ మెడలు వంచే బలం ఇవ్వండి

గ్రామాల్లో పాలోళ్ల మధ్య పంచాయితీ జరిగితే పంచులను


నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

ఎన్నుకుంటారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న పంచాయితీలో ప్రజల తరఫున యుద్ధం చేసే పంచు ఈ కేసీఆర్. ప్రాణం పోయినా తెలంగాణ తెస్తానని మాట ఇచ్చి.. తెచ్చి చూపించా. ఇప్పుడు మీ తరఫున వాదన వినిపించడానికి, ప్రభుత్వం మెడలు వంచడానికి మీరే బలం ఇవ్వాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బీజేపీయే గెలుస్తుంది. అప్పుడేం లాభం ఉండదు. ఈ రోజు ఉదయమే రిపోర్టు వచ్చింది. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్‌లలో బీఆర్ఎస్‌దే గెలుపు.

రేవంత్‌రెడ్డివి సంస్కారం లేని మాటలు

సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నరు. నా గుడ్లు పీకి గోటీలు ఆడుతడట. పేగులు తీసి మెడలో వేసుకుంటాడట. పదిహేనేళ్ల పోరాటం చేసిన తెలంగాణ సాధించిన వ్యక్తిని, తెలంగాణను పదేళ్లలో తెల్లగ చేసిన, ప్రజల కష్టాలను చూసి తండ్లాడిన వ్యక్తిని అలా అనొచ్చా. ఇది న్యాయమా ప్రజలే చెప్పాలి. మీ ఓటు ద్వారా ధర్మాన్ని గెలిపించండి..'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగం జనార్దనరెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు కావాలా.. మోదీ గత్తర కావాలా?

బీజేపీ అక్కరకు రాని చుట్టం. మోదీ ఇచ్చిన వంద నినాదాల్లో ఒక్కటైనా నిజం అయిందా? మొన్న నాగర్ కర్నూల్‌కు గుజరాత్ సీఎం వచ్చారట. 1,500 మంది కూడా రాలే. మనకు గుజరాత్ నుంచి సీఎంలు రావాలా? మోదీ మోటార్లకు మీటర్లు పెట్టాలంటే.. నా తల తెగిపడ్డా పెట్టబోనని చెప్పిన. నేను రైతును.. నాకు వారి బాధలు తెలుసు. ఇప్పుడు మీరు బీజేపీకి ఒక్క ఓటు వేసినా.. మోదీ వచ్చి మీటర్లు పెడతా అంటడు. పచ్చని పంటలు కావాలా? మోదీ గత్తర కావాలా? ఆలోచించండి.

ఆర్ఎస్పీ లాంటి వాళ్లు మళ్లీ దొరకరు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అల్లాటప్పా వ్యక్తి కాదు. మాజీ ఐపీఎస్ అధికారి. అలంపూర్ బిడ్డ. నేను సీఎం అయ్యాక గురుకుల పాఠశాలలకు ఎంత బడ్జెట్ కావాలో తీసుకోవాలని చెప్పిన. నేడు తెలంగాణ గురుకుల పాఠశాలలు ఇంటర్నేషనల్ స్కూళ్లతో సమానం. ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లు, పైలట్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారు. ఎవరెస్ట్ ఎక్కిన బిడ్డలను గురుకులాల నుంచి పంపినది ప్రవీణ్‌కుమారే. రాష్ట్రానికి మేలు చేయాలనే ఆలోచన ఉన్న వ్యక్తి. ఇలాంటి వారు మళ్లీ దొరకరు. చదువుకున్నోళ్లు వచ్చినప్పుడు గెలిపించుకోవడం మన బాధ్యత.


KCR
@KCRBRSPresident
Follow

తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి గారు, మరియు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది.

ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు.

నాతోపాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు.

రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది?

రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి.

జై తెలంగాణ

'ఎక్స్'లో అడుగుపెట్టిన కేసీఆర్

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్త ఖాతా ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ శనివారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్ (ట్విటర్)'లో తన అధికారిక ఖాతాను ప్రారంభించారు. '@కేసీఆర్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్' పేరిట ఏర్పాటు చేసిన ఈ ఖాతాలో తొలి రోజున పలు అంశాలపై పోస్టులు పెట్టారు. తొలి రోజే సుమారు 23 వేల మంది ఆయన అకౌంటును ఫాలో అయ్యారు. ''బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు''అనే సందేశంతో తొలి ట్వీట్ చేశారు. ''బస్సు యాత్రను దిగ్విజయం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అభినందనలు, ధన్యవాదాలు. ఇదే ఊపుతో బస్సుయాత్రను ముందుకు కొనసాగిద్దాం. పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప విజయం సాధిద్దాం''అంటూ రెండో పోస్ట్‌లో పేర్కొన్నారు. మూడో ట్వీట్‌లో రాజకీయ విమర్శలను ఎక్కుపెట్టారు. ''తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతు న్నాయి. నేను గంట క్రితం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది. ప్రతిరోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు. నాతోపాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి. జై తెలంగాణ..''అని పేర్కొన్నారు.


సార్! ఇక్కడ రెబెల్సందరూ 'కూటమి'గా ఏర్పడ్డార్సార్!

ఎమ్మెల్సీ ఇస్తాం.. 'భువనగిరి' నుంచి తప్పుకోండి

- సీపీఎం బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అన్ని లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తే జెడ్పీ చైర్మన్, కార్పొరేషన్ పదవులకూ ఆఫర్
- తన నివాసంలో దాదాపు గంటన్నరపాటు తమ్మినేని, ఇతర నేతలతో భేటీ
- కేరళ సీఎం విజయన్‌పై చేసిన వ్యాఖ్యల గురించి రేవంత్ వివరణ
- భువనగిరి మినహా మిగతా 16 స్థానాల్లో మద్దతిస్తామన్న తమ్మినేని
- ఆ ఒక్క స్థానంపై మాత్రం ఆలోచించి చెబుతామని వెల్లడి


చెరుపల్లి సీతారాములు, వీరయ్య, తమ్మినేని, జూలకంటి తదితరులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భువనగిరి సహా అన్ని పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే సీపీఎంకు ఒక ఎమ్మెల్సీ, ఒక జెడ్పీ చైర్మన్, రెండు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్యతో శనివారం తన నివాసంలో సమావేశమయ్యారు. దాదాపు గంటన్నరపాటు వారు చర్చలు జరిపారు. దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాత్రపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా భువనగిరి స్థానం నుంచి అభ్యర్థిని ఉపసంహరించుకోవాలని కోరారు. అయితే ఆ సీట్లో తమకే మద్దతు ఇవ్వాలని తమ్మినేని కోరగా ఇప్పుడున్న పరిస్థితుల్లో అక్కడ సీపీఎం పోటీ చేస్తే చాలా ఇబ్బందులు వస్తాయని.. కాబట్టి తప్పుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన తమ్మినేని.. భువనగిరి స్థానం విషయంపై తాము కేంద్ర కమిటీకి విన్నవిస్తామని తెలిపారు. మిగిలిన 16 సీట్లలో కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతిస్తామని హామీ ఇచ్చారు. అయితే సీపీఎం వర్గాలు మాత్రం భువనగిరి స్థానం నుంచి తమ అభ్యర్థిని ఉపసంహరించుకొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ నాటికి దీనిపై ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

కేరళ కాంగ్రెస్ ఇచ్చిన స్క్రిప్ట్‌నే చదివా: సీఎం

కేరళ పర్యటన సందర్భంగా తాను అక్కడి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారమే నడుచుకున్నానని, ఆ ప్రకారమే అక్కడ మాట్లాడాల్సి వచ్చిందని సీఎం రేవంత్ సీపీఎం బృందానికి వివరణ ఇచ్చారు. కేరళ సీఎం పిన్నరయి విజయన్‌ను విమర్శించిన విషయాన్ని సీపీఎం నేతలు సీఎం దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. వారిచ్చిన ప్రసంగం కాపీ ప్రకారమే నడుచుకున్నా తప్ప మరొకటి కాదని... ఆ స్పీచ్ కాపీని కాదని మరోటి మాట్లాడే అవకాశం తనకు ఉండదని ఆయన సీపీఎం బృందానికి వివరణ ఇచ్చారు. ఈ విషయంలో తనకు ఎలాంటి వ్యక్తిగత రాగద్వేషాలు లేవని పేర్కొన్నారు. రుణమాఫీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తానని సీఎం వారికి స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు కాగానే వెంటనే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని... పైగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉందని, దాన్ని గాడిన పెడతానని చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని రేవంత్ అన్నారు. కేంద్రంలో బీజేపీ వచ్చే అవకాశం లేనేలేదని.. ఉత్తరాదిలో ఆ పార్టీ పెద్ద ఎత్తున సీట్లు కోల్పోతుందని జోస్యం చెప్పారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి
విచక్షణారహిత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బస్సుయాత్రలో కేసీఆర్ చేస్తున్న విమర్శలను ఉద్దేశిస్తూ.. ''కేసీఆర్‌కు ఇంత అసహనం ఎందుకు? అధికారం లేకపోతే ఊపిరి ఆగిపోతుందా?''అని మండిపడ్డారు. శనివారం రేవంత్‌రెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''దేశంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించిన పార్టీ కాంగ్రెస్. ఓబీసీ రిజర్వేషన్లపై 1978లోనే బీపీ మండల్ కమిషన్ వేసింది. 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదిక అమలుకు శ్రీకారం చుట్టింది. కమిషన్ బీసీలకు 27శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సూచిస్తే.. ఆనాడు ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు దానిని వ్యతిరేకించాయి. సుప్రీం కోర్టు మండల్ కమిషన్ నివేదికను సమర్థించి, రిజర్వేషన్లను 50శాతానికి మించకుండా అమలు చేయాలని సూచించింది. తదనుగుణంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీకి ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. దీంతో బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కుల గణన ద్వారా 50 శాతం రిజర్వేషన్ల విధానానికి స్వస్తి పలికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచవచ్చు. కానీ దీనికి భిన్నంగా దేశంలో రిజర్వేషన్లు లేకుండా చేయాలని బీజేపీ కంకణం కట్టుకుంది. దేశ మూలవాసులైన దళితులు, గిరిజనులు, ఓబీసీలపై సర్జికల్ స్ట్రైక్స్ చేస్తోంది. దీన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. దేశంలో రిజర్వేషన్లు అమలు కావాలంటే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావాలి.

ప్రధాని హోదాలో ఉండి అలాంటి వ్యాఖ్యలా?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మెడలోని పుస్తెలు అమ్మేస్తుందంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విచక్షణా రహితంగా, దిగజారి మాట్లాడుతున్నారు. ఎక్కడైనా ఎవరి కష్టార్జితం వాళ్లదే.. ఎవరి సంపాదన వారిదే. భార్య ఆస్తిని కూడా అనుమతి లేకుండా భర్త తీసుకోవడానికి హక్కు లేదని న్యాయస్థానాలు చెప్తున్నాయి. కానీ బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టించే వికృత రాజకీయ క్రీడకు తెర లేపింది. ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని చూస్తోంది. దేశాన్ని రిజర్వేషన్ రహితంగా మార్చేందుకు పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ లెక్కన 400 ఎంపీ సీట్లు కోరుకుంటోంది. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే దేశాన్ని వందేళ్లలో హిందూ రాజ్యంగా మార్చాలని ప్రతిజ్ఞ చేశారు. దానిని 2025 నాటికి అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగానే రిజర్వేషన్లను రద్దు చేసి, కులాలతో సంబంధం లేకుండా హిందూ సమాజాన్ని ఒకటిగా చూపాలని ఆర్ఎస్ఎస్ ప్రణాళికలు వేసింది. దాన్ని బీజేపీ అమలు చేస్తోంది. ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్, యూనిఫామ్ సివిల్ కోడ్, సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్.. ఇలా కొన్ని నెలలుగా ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేసుకుంటూ వస్తున్నారు. రిజర్వేషన్లను రద్దు చేసి దళితులు, గిరిజనులు, ఓబీసీలను కార్పొరేట్ల ముందు కట్టుబానిసలుగా నిలబెట్టాలని చూస్తున్నారు. ఆనాటి ఈస్టిండియా కంపెనీలా బీజేపీ వ్యవహరిస్తోంది.

ఈటల అప్పుడు మాట్లాడలేదేం?

గతంలో మల్కాజిగిరి ఎంపీగా నన్ను ఓడించేందుకు 31 సమావేశాలు పెట్టిన కేటీఆర్.. ఈసారి ఎన్నికల్లో ఇప్పటివరకు ఒకే ఒక్క సమావేశం పెట్టారు. ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా కేటీఆర్ గానీ.. కేసీఆర్, కేటీఆర్‌లకు వ్యతిరేకంగా ఈటల గానీ మాట్లాడటం లేదు. పైగా భూములు అమ్ముకుండా రుణమాఫీ చేయాలని నాపై విమర్శలు చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ భూములు అమ్మినప్పుడు ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు కదా? అప్పుడు భూములు అమ్మవద్దని గుర్తుకు రాలేదా?''

''అమెరికా నుంచి అమలాపురం వరకు, చంద్ర మండలం నుంచి చింతమడక వరకు అన్నీ మాట్లాడే కేసీఆర్.. బీజేపీ చేసే కుట్ర గురించి మాత్రం మాట్లాడటం లేదేం? గతంలో కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మార్చేయాలన్నారు. ఇదంతా ముందస్తు ప్రణాళికలో భాగమే. వంద రోజుల మా ప్రభుత్వాన్ని దిగిపొమ్మంటూ బస్సుయాత్ర చేస్తున్న కేసీఆర్.. రాజ్యాంగాన్ని దెబ్బతీసే మోదీపై కార్యాచరణ చేపట్టడం లేదేం? మీ టార్గెట్ వంద రోజుల మా ప్రభుత్వమా? పదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న మోదీయా చెప్పాలి. రిజర్వేషన్లను రద్దు చేయాలన్న బీజేపీ విధానంపై బీఆర్ఎస్ వైఖరేంటో కేసీఆర్ చెప్పాలి. బిడ్డ బెయిల్ కోసం కేసీఆర్ బీజేపీతో ఒప్పందం చేసుకున్నారు. బీఆర్ఎస్ ఐదు ఎంపీ స్థానాలను బీజేపీకి తాకట్టు పెట్టింది. మల్కాజిగిరి ఎంపీ సీట్లో బీజేపీ గెలుస్తుందని మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనం. బీజేపీ గెలుస్తుందని బహిరంగంగా చెప్పిన ఎమ్మెల్యేను కేటీఆర్ సమర్థించడం దేనికి సూచన? బీఆర్ఎస్‌కు నిజంగా బీజేపీతో వైరముంటే మల్లారెడ్డిని పార్టీలో నుంచి సస్పెండ్ చేయాలి. అమాయకంగానో, అత్యుత్సాహంతోనో మేడ్చల్ ఎమ్మెల్యే కుండ బద్దలు కొట్టారు. ఇక కేసీఆర్, కేటీఆర్‌ల గుండు పగలగొట్టడమే మిగిలింది.

కేసీఆర్, బీజేపీతో ఒప్పందంలో భాగంగానే..

రిజర్వేషన్లను రద్దు చేయబోమని బీజేపీ వాళ్లు ఎందుకు అనట్లేదు?

ఇన్ని ఆరోపణలు వస్తున్నా.. దేశంలో రిజర్వేషన్లను రద్దు చేయబోమని మోదీ, అమిత్ షా ఎప్పుడూ, ఎక్కడా చెప్పడం లేదెందుకు? ఇక్కడ బండి సంజయ్, కిషన్‌రెడ్డి మాత్రమే కాదు.. లెఫ్ట్ భావజాలం అని చెప్పుకొనే ఈటల రాజేందర్ కూడా దీనిపై ఎందుకు మాట్లాడటం లేదు? బీజేపీ విధానమేంటో వారికి స్పష్టంగా తెలుసు కాబట్టే మాట్లాడటం లేదు. దేశంలో రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలి''అని రేవంత్ పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, పార్టీ నేతలు బెల్లయ్య నాయక్, సామ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


కేజీబీవీ విద్యార్థులను అభినందిస్తున్న కేసీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

నీళ్లు, కరెంటు సమస్యలను లేవనెత్తండి

బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం

కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని.. దీన్ని అనుకూలంగా మలుచుకోవాలని సూచన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: హామీల అమల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని.. ఈ పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించిన కేసీఆర్.. శుక్రవారం రాత్రి అక్కడే మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో బస చేశారు. అప్పటి నుంచి శనివారం సాయంత్రం వరకు శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఇతర నేతలతో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. తాగు, సాగు నీరు, విద్యుత్ సమస్యలను ఎత్తి చూపుతూ ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ సూచించినట్టు సమాచారం. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌కు బీజేపీతోనే పోటీ అని.. అంతా కలిసికట్టుగా కృషి చేస్తే మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని పేర్కొన్నట్టు తెలిసింది.

కేసీఆర్‌ను కలసిన ప్రభుత్వ గురుకుల కాలేజీ విద్యార్థినులు

ప్రభుత్వ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివి రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను కేసీఆర్ అభినందించారు. శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌస్‌లో బస చేసిన కేసీఆర్‌ను శనివారం కొడంగల్ కేజీబీవీలో చదివి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన అనూష, ఇతర గురుకుల విద్యార్థినులు కలిశారు. వారిని ఆప్యాయంగా పలకరించిన కేసీఆర్.. ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆశీర్వదించారు.

శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో
కరెంటు కోత అవాస్తవం

- కేసీఆర్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- అబద్ధాలతో ప్రజల దృష్టిని మళ్లించే యత్నం
- అసత్య ప్రచారాలను చట్ట ప్రకారం ఎదుర్కొంటాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండుసార్లు కరెంటు పోయిందని మాజీ సీఎం కేసీఆర్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఆయన ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ప్రకటనపై స్పందించి విద్యుత్ శాఖ ఎస్ఈను విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారు. ఎస్ఈ స్థానిక అధికారులతో విచారణ జరిపించి కేసీఆర్ ఆరోపణల్లో వాస్తవం లేదని నిర్ధారణకు వచ్చినట్టు తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఇంటికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందని, ఆ ఇంటి పరిసరాల్లోని ఇతర ఇళ్ల యజమానులను తమ సిబ్బంది విచారించగా ఎటువంటి కోతలు లేవని వారు నిర్ధారించినట్లు భట్టి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఇంటి సబ్ స్టేషన్ ట్రాన్స్ ఫార్మర్‌లో నమోదు చేసిన రీడింగ్‌లోనూ కరెంటు సరఫరాలో అంతరాయం జరిగినట్టు రికార్డు కాలేదని వివరించారు. ప్రతిపక్షనేత కేసీఆర్ విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఎటువంటి నిర్ధారణ చేసుకోకుండా ప్రకటనలు చేయడం విచారకరమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేసీఆర్ చేసే అసత్య ప్రచారాలు, ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలను చట్ట ప్రకారం ఎదుర్కొంటామని భట్టి ఆ ప్రకటనలో వెల్లడించారు.

నిద్రలేచింది మొదలు అవాస్తవాలతోనే..

మాజీ ముఖ్యమంత్రి నిద్ర లేచింది మొదలు అవాస్తవాలు, అభూత కల్పనలతో కాలం గడిపేస్తున్నారని భట్టి విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల సూర్యాపేట పట్టణంలో సైతం ఇదే తరహాలో విద్యుత్ శాఖను అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నించి అభాసు పాలయ్యారని గుర్తు చేశారు. అధికారం చేజారి, బీఆర్ఎస్ పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారడంతో అబద్ధాలతో, అసత్య ప్రచారాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని భట్టి ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి చిన్న చిన్న విషయాల్లో రాజకీయాలు చేస్తూ దొరికిపోవడం చూస్తుంటే తనకు జాలి కలుగుతోందని భట్టి వ్యాఖ్యానించారు

కేసీఆర్ ఇచ్చిన వారసత్వం కరువు

- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య
- కరువును అధిగమించడానికి ఏం చేయాలో అన్నీ చేస్తున్నాం
- కరెంట్ కోతలు అంటూ కేసీఆర్ తప్పుడు ప్రచారం
- కాంగ్రెస్ సర్కారును బద్నాం చేసే ప్రయత్నాలు
- పంట నష్ట పరిహారం తప్పకుండా ఇస్తామని వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దానం, సంపత్

సాక్షి, హైదరాబాద్: ''కేసీఆర్ నాకు ఇచ్చిపోయిన వారసత్వం కరువు. నీటి సమస్యను ఇచ్చి వెళ్లినదే ఆయన. ఈ కరువును అధిగమించడానికి ఏం చేయాలో అన్నీ చేస్తున్నా.. వంద రోజుల్లో వంద శాతం మంచి పరిపాలన అందించా..''అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. వివిధ అంశాలపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. తాను ఇప్పటికీ వారి ఆధిపత్యంపై యుద్ధం చేస్తున్నానని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారం..

''గత సంవత్సరం కంటే ఈసారి భూగర్భ జలాలు తగ్గాయి. నీటి వినియోగం పెరిగింది. తాగునీటి అవసరాలను జూలై వరకు లెక్కేసుకుని, డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని తెచ్చుకొని వాడుకోవడానికి ప్లాన్ చేస్తున్నాం..''అని రేవంత్ చెప్పారు. రాష్ట్రంలో కరెంటు కోతలేమీ లేవని.. కేవలం మెయింటెనెన్స్ వల్ల వచ్చే అంతరాయాలు మాత్రమే ఉన్నాయని వివరించారు. కానీ కరెంటు కోతలు అంటూ కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ''అన్నం తినేంత వరకు వరకు కూడా కరెంటు ఉంటలేదు అని కేసీఆర్ అంటున్నారు. ఆయనేమైనా కుంభకర్ణుడా అన్ని గంటలు తినడానికి..''అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చనిపోయిన రైతులు, బీమా గురించి కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ విమర్శించారు. తాను అధికారం చేపట్టిన నాటి నుంచి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు అమలు చేసినవి ఏవైనా ఫెయిలయ్యాయా? అని ప్రశ్నించారు. పంట నష్టం తప్పకుండా ఇస్తామని, అధికారులు ఆ విషయాన్ని పరిశీలిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై ఈ 4 నెలల్లోనే రూ.24 వేల కోట్లు వడ్డీ కట్టామన్నారు. మేం అడిగే వాటికి సమాధానం చెప్పలేక, ఇరుక్కుంటాననే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 14 సీట్లు తప్పకుండా గెలుస్తామన్నారు.

వంద శాతం పరిష్కారం దిశగా..

కేసులపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే వెల్లడి

- నల్లగొండలో కోర్టుల భవన సముదాయం ప్రారంభం



ఐదు కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో హైకోర్టు జడ్జీలు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జిల్లా జడ్జి నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి తదితరులు

రామగిరి (నల్లగొండ): తెలంగాణలో వంద శాతం కేసులను పరిష్కరించే దిశగా న్యాయవ్యవస్థ ముందుకు సాగుతోందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐదు అధునాతన కోర్టుల భవన సముదాయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ అరాధే మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా కోర్టులో నూతనంగా నిర్మించిన భవనంలో డిజిటలైజేషన్‌తోపాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ప్రత్యేకించి లైబ్రరీ, రిక్రియేషన్ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. కోర్టుల డిజిటలైజేషన్‌లో నల్లగొండ రెండోదని, పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాల కల్పనతో న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు మంచి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కోర్టులను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. చాలామంది పౌరులకు న్యాయవ్యవస్థతో సంబంధం ఉంటుందని, ఎప్పటికప్పుడు వచ్చే మార్పులకు అనుగుణంగా న్యాయవ్యవస్థ పనిచేసినట్లయితే చట్టాలను సమర్థవంతంగా అమలు చేయొచ్చన్నారు. అలాగే, మౌలిక సదుపాయాలు, అన్ని రకాల సౌకర్యాల కల్పనతోపాటు అడ్వొకేట్లు, న్యాయాధికారులకు ఎప్పటికప్పుడు సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని, సుప్రీంకోర్టు సైతం సామర్థ్యం పెంపుదలకు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. న్యాయం కోసం వచ్చే ప్రజలకు నల్లగొండ బార్ అసోసియేషన్, బెంచ్ సమన్వయంతో పనిచేసి సత్వర న్యాయం అందించాలని చీఫ్ జస్టిస్ కోరారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జీలు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, పలువురు జడ్జీలు పాల్గొన్నారు.

80 ఏళ్ల భూవివాదానికి హైకోర్టు పరిష్కారం

- ‘ఫక్రుముల్క్’ భూముల కేసులో విచారణ ముగించిన సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: నిజాం కాలంలోని జాగిర్దార్ ఫక్రుముల్క్ వారసుల మధ్య నెలకొన్న దాదాపు 80 ఏళ్ల నాటి భూవివాదాన్ని హైకోర్టు పరిష్కరించింది. 1945 నుంచి వారసుల మధ్య వివాదం నెలకొంది. 1951లో ఈ ఆస్తుల వివాదంపై ప్రాథమిక డిక్రీ జారీ అయింది. ఆ తర్వాత ఈ కేసుల వివాదం హైకోర్టుకు చేరింది. దాదాపు 75 ఏళ్ల పాటు విచారణ జరిపిన హైకోర్టు.. తాజాగా తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్ కుమార్ ధర్మాసనం కేసులో ఉత్తర్వులు జారీ చేసింది. ‘మొత్తం తొమ్మిది ఆస్తులపై వివాదం నెలకొనగా, ఎర్రమంజిల్ సహా వీటిలో చాలావరకు ప్రభుత్వ అధీనంలోకి వెళ్లాయి. దీనికి గాను వారసులకు నాటి ప్రభుత్వాలు నగదు చెల్లించాయి. ఒక్క అమీర్‌పేట్ ముస్లిం శ్మశాన వాటిక ఉన్నా.. అది పంచటం కుదరదు. సివిల్ సూట్ దాఖలయ్యే నాటికి బ్యాంకులో జమ చేసిన డిపాజిట్ నగదు విలువ ప్రస్తుతం రూ.1.18 కోట్లకు చేరింది. ఈ మొత్తాన్ని క్లెయిమ్ చేయడం కోసం ఎవరైనా పూర్తి ఆధారాలతో కోర్టును ఆశ్రయిస్తే.. విచారణ చేపట్టి పరిష్కరిస్తాం’ అని ధర్మాసనం స్పష్టం చేసింది.

పాలీసెట్ 2024 ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

- ఈ నెల 28 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా... రూ.100 ఫైన్‌తో 30 వరకు
- మే 20 వరకు 300 పెనాల్టీతో దరఖాస్తుకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: పాలీసెట్ 2024 దరఖాస్తు ఫీజు చెల్లింపు గడువు పొడిగించినట్లు హైదరాబాద్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ మాసబ్ ట్యాంక్ ప్రిన్సిపల్ డా.ఎస్.రాజేశ్వరిదేవి శనివారం వెల్లడించారు. ఈ నెల 28 వరకు ఎట్టి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చునని, రూ.100 ఆలస్య రుసుంతో ఈ నెల 30 వరకు, రూ.300 ఆలస్య రుసుంతో మే 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు https://polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్ చూడొచ్చు.



ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

- వేరే రిజర్వేషన్ల జోలికి పోం.. రాజ్యాంగాన్ని మార్చం
- రాహుల్, రేవంత్ చరిత్ర తెలుసుకోవాలి
- కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వొద్దన్నదే రాజీవ్‌గాంధీ: డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ మళ్లీ అధికారంలోకి రాగానే ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలులో ఉన్న ముస్లిం రిజర్వేషన్లను తప్పకుండా రద్దు చేస్తామని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ముస్లిం రిజర్వేషన్లు తప్ప.. మరే రిజర్వేషన్లు రద్దు చేయబోమని, అలాగే రాజ్యాంగాన్ని కూడా మార్చేది లేదని ఆయన వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు మినహా.. కుల, మతం పేరిట రిజర్వేషన్లు ఇవ్వడానికి తాము వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. కులాల ప్రతిపాదికన రిజర్వేషన్లు ఇవ్వొద్దన్నదే రాజీవ్‌గాంధీ అని గుర్తు చేశారు. రంగనాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయని కాంగ్రెస్.. మండల్ కమిషన్‌ను కూడా రాజీవ్‌గాంధీ వ్యతిరేకించారన్న విషయాన్ని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలని డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. ముస్లిం సంతుష్టీకరణ పేరిట హిందూ సమాజంపై విషం చిమ్ముతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో లక్ష్మణ్ పార్టీ నాయకులు ప్రకాశ్‌రెడ్డి, సుభాష్ రవి కిషోర్‌తో కలిసి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ముస్లింలను సంతృప్తిపర్చేందుకు కాంగ్రెస్ విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తోందని, బీసీల రిజర్వేషన్లను తగ్గించి ముస్లింలకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ దేవుళ్లను అడ్డంపెట్టుకుని రాజకీయం చేస్తోందంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎక్కడకు వెళ్తే అక్కడ దేవుళ్లపై ఒట్లు పెడుతూ.. అదే దేవుళ్లను రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారని ఆయన ప్రశ్నించారు.

కులగణనకు మేం వ్యతిరేకం కాదు కానీ..

కుల గణనకు తాము వ్యతిరేకం కాదని, అయితే అది శాస్త్రీయంగా, పరిశోధనాత్మకంగా జరగాల్సిన అవసరం ఉందని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తే.. ఈ కూటమి తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ తెస్తామంటున్నారని, సీఏఏపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ అధికారంలోకి వస్తే తప్పనిసరిగా సీఏఏను అమలు చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము వికసిత్ భారత్ అంటుంటే.. కాంగ్రెస్ విభజించు భారత్ అంటూ విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. అక్షింతలు, కాషాయంతో తిండి లభిస్తుందా అన్న కేసీఆర్ వ్యాఖ్యలపై లక్ష్మణ్ స్పందిస్తూ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చర్మాన్ని ప్రజలు వొలిచిన విషయం గుర్తుంచుకోవాలని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

నేడు బీసీ గురుకుల జూనియర్, డిగ్రీ ప్రవేశ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం అర్హత పరీక్షలు నిర్వహించనుంది. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సొసైటీ కార్యదర్శి సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.







నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచిన వాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు, కృపాసమాధానములు మీకు కలుగునుగాక.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** బ.చవితి ఉ.6.20 వరకు తదుపరి పంచమి, **నక్షత్రం:** మూల రా.2.56 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.56 నుండి 12.26 వరకు, తదుపరి రా.1.22 నుండి 2.58 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.37 నుండి 5.25 వరకు, **అమృతఘడియలు:** రా.8.23 నుండి 10.42 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.14
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జైరాం రమేష్ (కాంగ్రెస్ నేత)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

డెడ్ అయి, మూలన పడి ఉన్న ల్యాండ్ లైన్ ఫోన్ సడెన్‌గా రింగ్ అయితే ఎంతటి వారైనా ఒక్కసారిగా ఉలిక్కిపడతారు.

శామ్ పిట్రోడాకు కూడా అలా హఠాత్తుగా ఉలికిపాటుకు గురి చేసే అలవాటు ఉంది. దురదృష్టం ఏమిటంటే... సాధారణంగా ఆయన తన సొంత కాంగ్రెస్ పార్టీనే ఉలిక్కిపడేలా చేస్తుంటారు!

ఒడిశాలో పుట్టిన గుజరాత్ సంతతి ప్రవాస భారతీయుడు శామ్ పిట్రోడా. 1984లో ఒకసారి భారత ప్రధాని ఇందిరా గాంధీ పిలిస్తే ఇండియా వచ్చారు. 1987లో ఇంకోసారి భారత ప్రధాని రాజీవ్ గాంధీ పిలిస్తే ఇండియా వచ్చారు. తిరిగి 2004లో భారత ప్రధాని మన్మోహన్ సింగ్ పిలిస్తే ఇండియా వచ్చారు. అదీ ఆయన కమ్యూనికేషన్ రేంజ్. ఆయనలోని టెలికమ్యూనికేషన్ ఇంజినీరును ఒడిసి పట్టుకుంది ఆ ముగ్గురు ప్రధానులే!

"జైరాం జీ! మీరొకసారి శామ్ పిట్రోడాకు ఫోన్ చేసి, ఇలా హఠాత్తుగా ఉలికిపాటుకు గురి చేసే తన అలవాటును ఈ ఎన్నికలు



అయ్యేవరకైనా మార్చుకోవటానికి వీలవుతుందేమో అడగ్గలరా?" అని సోనియాజీ నన్ను అభ్యర్థించే సమయానికి... సరిగ్గా నేను పార్టీ ఆఫీస్‌లో నా ఎదురుగా గోడకు ఉన్న ఇందిర, రాజీవ్, మన్మోహన్‌జీల ఫొటోలను చూస్తూ ఉన్నాను.

"జైరాం జీ! మిమ్మల్నే... పిట్రోడాను కొన్ని రోజుల పాటు మాట్లాడకుండా ఉండమని చెప్పగలరా ప్లీజ్?" అన్నారు మళ్లీ సోనియాజీ.

"అదే ఆలోచిస్తున్నాను మేడమ్‌జీ! శామ్ పిట్రోడాకు మనం ఖర్గేజీ చేత చెప్పించడం బాగుంటుందేమో కదా..." అన్నాను.

ఖర్గేజీ ఆలిండియా కాంగ్రెస్ అధ్యక్షుడు అయితే పిట్రోడా ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు. ఒక అధ్యక్షుడికి ఇంకో అధ్యక్షుడి చేత చెప్పిస్తే గౌరవంగా ఉంటుందని నా ఆలోచన. కానీ మేడమ్‌జీ ఆలోచన వేరుగా ఉన్నట్లుంది!

"జైరాం జీ! శామ్ పిట్రోడా కమ్యూనికేషన్స్ ఎక్స్‌పర్ట్. మీరు పార్టీ కమ్యూనికేషన్స్ జనరల్ సెక్రెటరీ. కనుక ఆయనకు మీరు చెప్పటమే కరెక్టు" అన్నారు సోనియాజీ.

"అలాగే మేడమ్‌జీ" అని వెంటనే పిట్రోడాకి ఫోన్ చేశాను. ఒక్క రింగుకే కనెక్ట్ అయ్యారు పిట్రోడా!

"హల్లో జైరాం జీ! మేడమ్ నా మీద కోపంగా ఉన్నారా?!" అని అడిగారు పిట్రోడా.

నవ్వాను నేను.

"అలాంటిదేమీ లేదు పిట్రోడా జీ. కోప్పడితే మేడమ్ మిమ్మల్ని ... 'రాముడేమైనా ఉద్యోగాలిస్తాడా?' అన్నప్పుడే కోప్పడి ఉండాలి. 'అయితే ఇప్పుడేంటి?!' అని సిక్కులపై దాడుల గురించి మీరు అన్నప్పుడే కోప్పడి ఉండాలి. 'కంటికి కన్ను సిద్ధాంతం పైన నాకు నమ్మకం లేదు' అని సర్జికల్ స్ట్రయిక్స్ గురించి మీరు అన్నప్పుడే కోప్పడి ఉండాలి. 'అంబేడ్కర్ కన్నా నెహ్రూ గొప్ప' అన్నప్పుడే కోప్పడి ఉండాలి. 'మధ్యతరగతి వాళ్లు త్యాగాలు చెయ్యాలి' అన్నప్పుడైనా కోప్పడి ఉండాలి. ఎప్పుడూ కోప్పడని మేడమ్‌జీ ఇప్పుడు మాత్రం మిమ్మల్ని ఎందుకు కోప్పడతారు! ఎంత మీరు 'ఉన్నోళ్ల వారసత్వ ఆస్తిని లేనోళ్లకు పంచాలి...' అని అంటే మాత్రం?" అన్నాను.

"జైరాం జీ అవన్నీ నేను అలా అనలేదు. బీజేపీ నా మాటల్ని వక్రీకరించింది" అన్నారు పిట్రోడా.

"మేడమ్ కూడా అదే అంటున్నారు పిట్రోడాజీ. మనం ఏం మాట్లాడినా మోదీజీ ఆ మాటల్ని అటు తిప్పి, ఇటు తిప్పి కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని..." అన్నాను.

"అయితే ఇప్పుడేం చేద్దామంటారు?" అని అడిగారు పిట్రోడా!

"అక్కడ మీరు అమెరికాలోని 'వారసత్వ పన్ను' గొప్పతనం గురించి చెప్పటం మాని, భారతదేశంలో కాంగ్రెస్ వారసత్వ ఘనతను చాటండి" అన్నాను... మేడమ్ వైపు చూస్తూ.

'వెల్‌డన్' అన్నట్లు నా వైపు చూస్తూ బొటన వేలెత్తారు సోనియాజీ.

గోడ పైన ఉన్న ఆ ముగ్గురు కూడా బొటన వేళ్లు ఎత్తినట్లుగా నాకు అనిపించింది.

ఆ పేరే... ఒక నమ్మకం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



నలభై రెండు డిగ్రీలు దాటిన ఎండల్లో నడిరోడ్లపై గంటల తరబడి వేలాదిమంది ప్రజలు ఒక నాయకుడి కోసం ఎదురు చూస్తున్నారంటే అర్థం ఏమిటి? వయోభేదం లేదు. కులమతాల పరిధులు లేవు. ఆడామగా తేడా లేదు. ఆబాల గోపాల జన తరంగం ఆ నాయకుడు కనిపించగానే కేరింతలు కొట్టడం దేనికి సంకేతం? ఆ నిరీక్షణలకు అర్థం అక్కడో ప్రభంజనం వీస్తున్నదని! ఒక వేవ్ పుట్టిందనడానికి సంకేతాలే అక్కడ కనిపించే పరవశాల కేరింతలు. 'మేమంతా సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 27 రోజులపాటు సాగించిన బస్సు యాత్ర సందర్భంగా అటువంటి ఒక ప్రభంజనం పెల్లుబికింది.

నాన్నల భుజాల మీద నిలబడి నాయకుడు కనిపించగానే సంభ్రమంతో 'జగన్ మామా' అని ఎలుగెత్తే చిన్నారులు. ఓ చేత్తో చంటిబిడ్డనెత్తుకొని మరో చేత్తో మొబైల్ ఫోన్ ఎక్కుపెట్టి దగ్గరగా జగనన్న ఫోటోను తీసుకోవడానికి ఆరాటపడుతున్న ఆడపడుచులు. దూరంగా బస్సు కనిపించగానే 'అదిగో నా కొడుకొస్తున్నాడ'ని బోసినవ్వుతో భావప్రకటన చేసే అవ్వాతాతలు. నాయకుని వాహనం ముందూవెనుకా ఉరకలెత్తుతున్న యువ్వనోత్తేజాలు. రోడ్డు పక్కనున్న స్తంభాలను అధిరోహించి, చెట్ల కొమ్మలనాక్రమించి జయ జయధ్వానాలు చేసే చిట్టి తమ్ముళ్లు. ముఖాల మీద భద్రతా భావాన్ని, భరోసాను వేలాడదీసుకొని రోడ్డు పక్క భవనాల మీద నిలబడి ఎదురు చూస్తున్న నడివయసు అన్నలూ అక్కలూ!

ఆనందోద్వేగాల వ్యక్తీకరణలో ఎన్ని ఛాయలుంటాయి? అభినందనాభివ్యక్తిని ఎన్ని రంగుల్లో ప్రకటించవచ్చును? కృతజ్ఞతాపూర్వక అరుపుల్లో, కంటి మెరుపుల్లో కనిపించే సందేశ కావ్యాల్లో ఎన్ని రకాలుంటాయి? బస్సు యాత్రలో పాల్గొన్న జనప్రవాహం దృశ్యాలను ఫ్రేములుగా విడదీసి ఒక్కొక్కటే గమనించండి. లెక్కించలేనన్ని ఛాయలు. ఊహలకందని రంగులు. చదవలేనన్ని సందేశాలు కనిపిస్తాయి. ఒక నాయకుడు లక్షలాది మంది ప్రజలతో విడివిడిగా ముఖాముఖి సంబంధం ఏర్పరుచుకుంటే తప్ప ఇన్ని భావోద్వేగాలు ఉదయించవు. ఒక సూర్యుడు సమస్త జీవులకు తాను ఒక్కొక్కడిగా కనిపిస్తాడట! జన సమ్మోహన నాయకుడు కూడా అంతే! నాయకుడి మీద ప్రజలకు బలమైన నమ్మకం ఏర్పడినప్పుడే ఈ ఆత్మీయ బంధం అల్లుకుంటుంది.

డెబ్బయ్యో దశకంలో ఇందిరాగాంధీ దగ్గర ఈ మ్యాజిక్ ఉండేది. కోట్లాదిమంది భారతీయులు ఆమెను 'అమ్మ'గా పిలుచుకునేవారు. ఎనభయ్యో దశకంలో ఎమ్‌జీ రామచంద్రన్, ఎన్టీరామారావు వారి రాష్ట్రాల్లోని ప్రజలతో ఆత్మీయ స్పర్శను అనుభవించగలిగారు. పేదల జీవితాల్లో మార్పులు తెస్తాడన్న నమ్మకంతో ఎమ్‌జీఆర్‌ను 'పురట్చి తలైవర్' (విప్లవ నాయకుడు)గా తమిళ ప్రజలు పిలుచుకున్నారు. పేదవాడి అన్నం గిన్నెగా మారిన ఎన్టీఆర్‌ను తెలుగు ప్రజలు 'అన్న'గా సంబోధించారు. ఐదు పదుల వయసున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పదవీ కాలంలో పేదల బతుకుల్లో విప్లవాత్మక మార్పులకు పునాదులు వేయడంతోపాటు కోట్లాది మంది నోట ఆప్యాయంగా 'అన్నా' అని పిలుచుకోగలుగుతున్నారు.

ఎమ్‌జీఆర్, ఎన్టీఆర్‌ల సంగతి వేరు. వారు రాజకీయాల్లోకి రాకముందే అఖండ ప్రజాదరణ కలిగిన సినీ హీరోలు. సినిమాల్లో వారు ఎక్కువగా పోషించినవి కూడా ఉదాత్తమైన పాత్రలు. అందువల్ల వారి రాజకీయ ప్రవేశం తమకు మేలు చేస్తుందని ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. ప్రజల నమ్మకాన్ని వారు కూడా వమ్ము చేయలేదు. వారి సంగతి సరే! మరి జగన్‌మోహన్‌రెడ్డికి ఇంతటి జనాకర్షణ ఏర్పడటానికి కారణమేమిటి? ప్రజలు ఆయన్ను ఇంతగా గుండెల్లో ఎందుకు పెట్టుకున్నారు? ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఆరేళ్లు పనిచేసిన అనంతరం 1989లో ఎన్నికలకు వెళ్లినప్పుడు పూర్వపు ఆదరణ కనిపించలేదు. ఆయన ప్రచార రథం వెంట జనం పరుగులు తీయలేదు. ఆయన రాక కోసం గంటల తరబడి నిరీక్షించడం కనిపించలేదు.

జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన తర్వాత మొన్నటి

డెబ్బయ్యో దశకంలో ఇందిరాగాంధీ దగ్గర ఈ మ్యాజిక్ ఉండేది. కోట్లాదిమంది భారతీయులు ఆమెను 'అమ్మ'గా పిలుచుకునేవారు. ఎనభయ్యో దశకంలో ఎమ్‌జీ రామచంద్రన్, ఎన్టీరామారావు వారి రాష్ట్రాల్లోని ప్రజలతో ఆత్మీయ స్పర్శను అనుభవించగలిగారు. పేదల జీవితాల్లో మార్పులు తెస్తాడన్న నమ్మకంతో ఎమ్‌జీఆర్‌ను 'పురట్చి తలైవర్' (విప్లవ నాయకుడు)గా తమిళ ప్రజలు పిలుచుకున్నారు. పేదవాడి అన్నం గిన్నెగా మారిన ఎన్టీఆర్‌ను తెలుగు ప్రజలు 'అన్న'గా సంబోధించారు. ఐదు పదుల వయసున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పదవీ కాలంలో పేదల బతుకుల్లో విప్లవాత్మక మార్పులకు పునాదులు వేయడంతో పాటు కోట్లాదిమంది నోట ఆప్యాయంగా 'అన్నా' అని పిలుచుకోగలుగుతున్నారు.

ఎమ్‌జీఆర్, ఎన్టీఆర్‌ల సంగతి వేరు. వారు రాజకీయాల్లోకి రాకముందే అఖండ ప్రజాదరణ కలిగిన సినీ హీరోలు. సినిమాల్లో వారు ఎక్కువగా పోషించినవి కూడా ఉదాత్తమైన పాత్రలు. అందువల్ల వారి రాజకీయ ప్రవేశం తమకు మేలు చేస్తుందని ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. ప్రజల నమ్మకాన్ని వారు కూడా వమ్ము చేయలేదు. వారి సంగతి సరే! మరి జగన్‌మోహన్‌రెడ్డికి ఇంతటి జనాకర్షణ ఏర్పడటానికి కారణమేమిటి? ప్రజలు ఆయన్ను ఇంతగా గుండెల్లో ఎందుకు పెట్టుకున్నారు?

బస్సు యాత్ర సందర్భంగా కనిపించిన దృశ్యాలు వేరు. ఎన్టీఆర్ తొలిరోజుల్లో సభావేదిక నెక్కి 'నేల ఈనిందా... ఆకాశం చిల్లులు పడిందా' అనగానే జన సముద్ర ఘోష దద్దరిల్లేది. 'నా రక్తంలో రక్తమైన నా సోదరులారా' అని ఎమ్‌జీఆర్ ప్రసంగం ప్రారంభించగానే ఝంఝామారుతంలా హర్షధ్వానాలు మార్మోగేవి. కానీ ఐదేళ్ల పాలన తర్వాత కూడా జగన్‌మోహన్‌రెడ్డికి అదే స్పందన. ప్రసంగానికి ముందు చేతిలోకి మైకు తీసుకుని వేళ్లతో దాని మీద తాళం వేయగానే వేల గొంతుకల్లో ఆ ప్రతిధ్వని మార్మోగుతున్నది. మాట మాటకూ చప్పట్ల కోరస్. మంత్రం వేసినట్టుగా ఆయన మాటతో మాట కలుపుతున్నారు. జనానికీ, జగన్‌కూ మధ్య ఏర్పడిన ఈ కమ్యూనికేషన్ ఓ అధ్యయనాంశం.

జగన్‌మోహన్‌రెడ్డి సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించుకొని పదమూడేళ్లయింది. ఐదేళ్లు ప్రతిపక్ష నేతగా, ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి మరోసారి అధికారం కోసం జనం ముందుకు వెళ్తున్నారు. మళ్లీ భారీ ఆధిక్యతతో అధికారంలోకి వస్తారని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రజలతో ఆయన సంబంధం రోజురోజుకూ బలపడుతున్నది. పధ్నాలుగేళ్లు ముఖ్య మంత్రిగా, పదిహేనేళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేసిన సీనియర్ మోస్ట్ రాజకీయవేత్త ప్రజాదరణలో జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లోకి కూడా రాలేకపోతున్నారు. కారణం ఏమై ఉంటుంది?

కారణం... ఆయన క్యారెక్టర్. మాట తప్పని, మడమ తిప్పని నైజం. ఎట్టి పరిస్థితుల్లో నోటి వెంట ఒక్క అబద్ధం కూడా చెప్పని తత్వం. పేదలకు, అసహాయులకు, రోగగ్రస్థులకు ప్రేమను పంచే స్వభావం. ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలన్న పొలిటికల్ ఫిలాసఫీ. అంబేడ్కర్, అబ్రహాం లింకన్‌ల ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఈ లక్షణాలన్నీ ఆయన్ను వర్తమాన రాజకీయ నేతల మధ్య ప్రత్యేకంగా నిలబెట్టాయి. ఆయన స్వభావానికీ, ఫిలాసఫీకీ పూర్తి భిన్నమైన చిత్రీకరణతో ఆయన ఎదుర్కొన్నంత దుష్ప్రచారాన్ని దేశ రాజకీయ నాయకుల్లో ఎవరూ ఎదుర్కోలేదు. ఆయన మీద జరిగినన్ని కుట్రలు ఎవరి మీదా జరగలేదు. అయినా శిలాసదృశంగా నిలబడగలిగారంటే అందుకు కారణం ఆయన క్యారెక్టర్. నిజాయితీ. ఇదిగో ఈ నిజాయితీ జనంలోకి డైరెక్ట్‌గా కమ్యూనికేట్ అయింది. గోబెల్స్ గొలుసుల్ని తెంచుకొని, మీడియా గోడల్ని బద్దలు కొట్టుకొని మరీ ఆయన క్యారెక్టర్ జనం గుండెల్లోకి వెళ్లిపోయింది.

జగన్‌మోహన్‌రెడ్డి మీద జరిగిన కుట్రల కమామిషు, ఆయన నాయకుడుగా ఎదిగిన కథాక్రమం తెలుగు ప్రజలు ఎరిగిన సంగతులే. చర్విత చర్వణం అనవసరం. ప్రజలిచ్చిన అధికారాన్ని అయిదేళ్లపాటు ప్రజా సాధికారత కోసమే ఆయన ఖర్చు చేశారు. అంతకు ముందు పది శాతమున్న పేదరికాన్ని నవరత్న పథకాల సాయంతో నాలుగు శాతానికి తగ్గించగలిగారు. వచ్చే ఐదేళ్ల లోపల పేదరికాన్ని నిశ్శేషం చేయడం కోసం ఆ రత్నాలకు మరింత మెరుగుదిద్దినట్టు శనివారం ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోలో వెల్లడైంది. మేనిఫెస్టో విడుదల సందర్భంగా చేసిన ప్రసంగం జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీకి అద్దం పట్టింది. ఆయన విజన్‌ను, తాత్వికతను మేనిఫెస్టో ఆవిష్కరించింది. ఒకపక్క ఆయన ప్రత్యర్థి అలవికాని వాగ్దానాలతో చెలరేగిపోతున్నారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపెడుతున్నారు. బొందితో కైలాసానికి తీసుకెళ్తానన్న స్థాయిలో వాగ్దానాలు కురిపిస్తున్నారు. సూపర్ సిక్స్‌లు కొడతానంటున్నారు. ప్రత్యర్థి చేస్తున్న ఈ ఊకదంపుడు... ముఖ్యమంత్రిపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఎందుకంటే, ఆయన పేరే ఒక నమ్మకంగా ప్రజల గుండెల్లో స్థిరపడిపోయింది.

చంద్రబాబు బోగస్ హామీలను పూర్వపక్షం చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన తీరు లైవ్‌లో చూస్తున్న లక్షలాది మంది టీవీ వీక్షకులను ఆకట్టుకున్నది. సంపద సృష్టించి హామీలు అమలుచేస్తానని చెబుతున్న చంద్రబాబు వాదనలోని

జగన్‌మోహన్‌రెడ్డి మీద జరిగిన కుట్రల కమామిషు, ఆయన నాయకుడుగా ఎదిగిన కథాక్రమం తెలుగు ప్రజలు ఎరిగిన సంగతులే. చర్విత చర్వణం అనవసరం. ప్రజలిచ్చిన అధికారాన్ని అయిదేళ్లపాటు ప్రజా సాధికారత కోసమే ఆయన ఖర్చు చేశారు. అంతకు ముందు పది శాతమున్న పేదరికాన్ని నవరత్న పథకాల సాయంతో నాలుగు శాతానికి తగ్గించగలిగారు. వచ్చే ఐదేళ్ల లోపల పేదరికాన్ని నిశ్శేషం చేయడం కోసం ఆ రత్నాలకు మరింత మెరుగుదిద్దినట్టు శనివారం ఆయన విడుదల చేసిన మేనిఫెస్టోలో వెల్లడైంది. మేనిఫెస్టో విడుదల సందర్భంగా చేసిన ప్రసంగం జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీకి అద్దం పట్టింది. ఆయన విజన్‌ను, తాత్వికతను మేనిఫెస్టో ఆవిష్కరించింది. ఒకపక్క ఆయన ప్రత్యర్థి అలవికాని వాగ్దానాలతో చెలరేగిపోతున్నారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపెడుతున్నారు. బొందితో కైలాసానికి తీసుకెళ్తానన్న స్థాయిలో వాగ్దానాలు కురిపిస్తున్నారు. సూపర్ సిక్స్‌లు కొడతానంటున్నారు. ప్రత్యర్థి చేస్తున్న ఈ ఊకదంపుడు... ముఖ్యమంత్రిపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది. ఎందుకంటే, ఆయన పేరే ఒక నమ్మకంగా ప్రజల గుండెల్లో స్థిరపడిపోయింది.

చంద్రబాబు బోగస్ హామీలను పూర్వపక్షం చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడిన తీరు లైవ్‌లో చూస్తున్న లక్షలాదిమంది టీవీ వీక్షకులను ఆకట్టుకున్నది. సంపద సృష్టించి హామీలు అమలుచేస్తానని చెబుతున్న చంద్రబాబు వాదనలోని డొల్లతనాన్ని ఆయన బయట పెట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన పధ్నాలుగేళ్లూ ప్రతిపాదించిన బడ్జెట్‌లన్నీ రెవెన్యూ లోటునే చూపెట్టాయనీ, ఇక సంపద సృష్టించిందెక్కడని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. పేదల సంక్షేమం సాధికారతల పట్ల తనకంటే చిత్తశుద్ధి ఉన్న వారెవరూ లేరని చెబుతూ ప్రజలకు ఎంత గరిష్ఠంగా మేలు చేయగలమో ఆ మేరకే హామీలివ్వగలం తప్ప అబద్ధాలు చెప్పలేనని ఆయన స్పష్టం చేశారు.

డొల్లతనాన్ని ఆయన బయటపెట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన పధ్నాలుగేళ్లూ ప్రతిపాదించిన బడ్జెట్‌లన్నీ రెవెన్యూ లోటునే చూపెట్టాయనీ, ఇక సంపద సృష్టించిందెక్కడనీ ముఖ్యమంత్రి ప్రశ్నించారు. పేదల సంక్షేమం సాధికారతల పట్ల తనకంటే చిత్తశుద్ధి ఉన్న వారెవరూ లేరని చెబుతూ ప్రజలకు ఎంత గరిష్ఠంగా మేలు చేయగలమో ఆ మేరకే హామీలివ్వగలం తప్ప అబద్ధాలు చెప్పలేనని ఆయన స్పష్టం చేశారు.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు బాటలు పరుస్తూ, బలహీనవర్గాలు – మహిళల సాధికారత కోసం అడుగులు వేస్తూ సాగిన ఐదేళ్ల పాలన కొనసాగింపుగానే మరో ఐదేళ్ల పాలనకు సంబంధించిన మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఇది విప్లవ కర్తవ్యాల కొనసాగింపు. విద్యారంగంలో తాను ప్రవేశపెడుతున్న మార్పులు మరో పదిహేనేళ్లు కొనసాగితే పేదరికం ఆనవాళ్లు కూడా రాష్ట్రంలో కనిపించవని ఆయన నమ్ముతున్నారు. పేద విద్యార్థులందరూ సంపన్నుల బిడ్డలతో సమానంగా నాణ్యమైన విద్యను అభ్యసించగల పరిస్థితులను ప్రజలంతా స్వాగతించాలి. ప్రతి ఇంటినీ ఓ ఫ్యామిలీ డాక్టర్ సందర్శించగల అత్యున్నత స్థాయి వైద్య సేవల సమాజాన్ని నిండు మనసుతో ఆహ్వానించాలి. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో తరతరాలుగా వెనుకబడిన సమూహాలను, మహిళలను ముందడుగు వేయించే ప్రయత్నాలకు ప్రజలందరూ భుజం కాయాలి. ఉన్నతస్థాయి సమాజ నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నాల వెన్నంటి నడవాలి. పేదల విముక్తికి అడ్డుగోడలా నిలబడుతున్న పెత్తందారీ శక్తులనూ, వారి రాజకీయ శిబిరాలనూ ఓడించాలి. లాంగ్ లివ్ ది రివల్యూషన్! ఇంక్విలాబ్ జిందాబాద్!!

vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఎన్నికల పోరులో ఇదేం భాషా?

అభిప్రాయం



డా॥ యు. రుక్సానా

ఈ సృష్టిలో మాట్లాడగలిగే మహద్భాగ్యం మనిషికే ఉంది. ఆ మాటను సవ్యంగా ఉపయోగిస్తే మాటే మంత్రమై గొప్ప గొప్ప పనులు నెరవేరుస్తుంది. లేదంటే ఆ మాటే కార్చిచ్చు అవుతుంది. నేటి ఎన్నికల సమరాంగణంలో భాషా ప్రయోగం ఎలా ఉంది? దాని పాత్ర ఏంటో చూద్దాం.

భాష అంటే మనసులో ఉన్న భావాన్ని మాటల రూపంలో వ్యక్తం చేసే సాధనం. ప్రస్తుత ఎన్నికల వ్యవహారం చూస్తుంటే అమ్మ భాషకు తూట్లు పొడుస్తున్నట్లుంది. ఎన్నికల్లో పోటీచేసే ప్రతీపార్టీ ప్రతినిధులూ ఓటరు వద్దకు వెళ్లి, ఓటు కోసం అభ్యర్థించడం సర్వసాధారణమైన అంశం. అభ్యర్థించడం అంటేనే ఒక విన్నపం. విన్నపం అంటేనే వినయంగా అడిగేది. కానీ పార్టీ ప్రచార సభల్లో నాయకులు తమ తమ విద్యాస్థాయులు, హోదాలు మరచి వ్యక్తిగత దూషణలకు పాల్పడటం శోచనీయం.

నేటి ఎన్నికల ప్రచార సభల్లో కొన్ని రాజకీయ పార్టీల నాయకులు వారి అజెండా ఏమిటి? అధికారంలోకి వస్తే ఎలాంటి పాలన అందిస్తారు? వారి భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి? అనే అంశాలను పూర్తిగా పక్కన పెట్టేసి, ఇతర పార్టీ నాయకులను దుయ్యబట్టడమే అజెండాగా కనిపిస్తోంది. 'నీ తోలు తీస్తా, నీ పళ్లు రాలగొడతా, చెప్పుతో కొడతా, చిప్పకూడు తినిపిస్తా...' వంటి అప్రజాస్వామిక భాషను వాడడం ఎంతవరకు సబబు? కొంతమంది నేతలు, వేరే నాయకులను దూషిస్తూ, కించపరుస్తూ, కొన్ని వర్గాల వారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. 'నిన్ను పాతాళానికి తొక్కేస్తా' అంటారొకరు. ఒక వ్యక్తిని అధికార పీఠం ఎక్కించాలా, దించాలా, పాతాళానికి తొక్కేయాలా అనేది నిర్ణయించేది వీళ్లు కాదు, కేవలం ఓటరు మాత్రమే. రాజకీయ నాయకులు ఒకరినొకరు పాతాళానికి తొక్కెయ్యడం వల్ల ఓటరుకు ఒరిగేదేముంది? ఒకరు మరొక నాయకుడిని 'నీ అంతు చూస్తా' అంటాడు. ప్రజాస్వామ్య పాలనలో ఎవరి అంతుచూడాలన్నది 'ఓటరన్న'కే సాధ్యం అనే గ్రహింపు కలిగి ఉండాలి. ప్రజా సమస్యలను తుంగలో తొక్కేసి, పర నింద, పరుష నింద వల్ల ఒరిగేదేమిటో వారికే ఎరుక!



మరో నాయకుడు 'ప్రతి అవ్వకు, ప్రతి తాతకు' అంటూ బంధుత్వాన్ని కలుపుతారు. ఈ మాటలు ఆ నాయకుడికీ, ఓటరుకీ మధ్య ఒక మనోబంధాన్ని ఏర్పరుస్తాయి. తద్వారా ప్రజలకు ఆ నాయకుడిపై ఒక నమ్మకం, ఒక భరోసా కలిగిస్తాయి.

పార్టీ అజెండా ప్రజలకు అర్థమయ్యే భాషలో, అర్థమయ్యే విధంగా వివరించాలి. గతకాలంలో చేసిన వాగ్దానాలు, వాటి నెరవేర్పు ఏమేరకు జరిగింది, వాటి మధ్య ఉన్న అంతరమెంత, ఆ అంతరాన్ని పూరించడానికి ఈ సారి అధికారంలోకొస్తే ఎలాంటి కార్యాచరణ చేస్తారు అనే అంశాలను విశదీకరించాలి. అంతే కాని, మన మాటలు మన వ్యక్తిత్వాన్ని దిగజార్చేవిగా, లేదా ఇతరులను దిగజార్చేదిగా ఉండకూడదు. మన నైతికత మనకు సిబిల్ స్కోర్ లాంటిది. అది ఎంత ఎక్కువైతే అంత లాభిస్తుంది. అది ఎంత తక్కువైతే అంత పరోక్ష నష్టం వాటిల్లుతుంది.

ఇటీవల కాలంలో ఒక పార్లమెంట్ సభ్యుడిపై, ఆయన ప్రత్యర్థులు అతనిని 'హంతకుడి'గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆయన తమ ప్రతివాదులను తిరిగి ఒక్క పరుషమైన మాట మాట్లాడక పోవడం చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇది ఆయన సంస్కార స్థాయిని వ్యక్తపరుస్తుంది. ఇలాంటి వ్యక్తిత్వం కలిగినవారు రాజకీయాల్లో అరుదుగా కనిపిస్తారు. రాజకీయ నాయకులు వాడే అవాంఛనీయ భాష పార్టీల మధ్య కంటే, సామాన్య ప్రజల మధ్య చిచ్చు పెట్టేదిగా ఉంది. ఇలాంటి సందర్భాల్లో సామాన్యుడు జాగ్రత్తగా ఉండడం ఎంతైనా అవసరం. అలాగే నాయకులు భాషను భ్రష్టు పట్టించకుండా ఉండాలి. అదే భాషా ప్రేమికుల ఆశ. మాతృ దేవోభవ, పితృ దేవోభవ అనే సంస్కృతిలో పుట్టి పెరిగిన మనం అలాంటి మాటలు మాట్లాడుతున్నామంటే మన సంస్కారం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

భాషను మనం సునిశితంగా పరిశీలించినట్లయితే, భాషలో పబ్లిక్ భాష, ప్రైవేట్ భాష, తక్కువ స్థాయి భాష, ఎక్కువ స్థాయి భాష, ప్రజాస్వామ్య భాష అనే రకాలున్నాయి. ప్రజల్లో మాట్లాడేటప్పుడు ప్రజాస్వామిక భాష మాట్లాడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. భాష అనేది రెండు అంచులు గల కత్తి లాంటిది. మనం మంచిగా భాషను వాడితే సత్ఫలితాలనిస్తుంది. లేదంటే దుష్ఫలితాలనిస్తుంది. నాయకులు తమ నాయకత్వాన్ని వర్ధిల్ల చేసుకోవాలంటే, మంచి 'భాషా శైలి' ముఖ్యం అనే అంశాన్ని గ్రహించాలి.

వ్యాసకర్త తెలుగు అధ్యాపకురాలు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, నూజివీడు

కోరికలకు దూరంగా...

కోరికలు లేని మనిషి ఉండడు. కోరిన ప్రతిదీ దైవం తీరుస్తాడన్న భరోసా లేకపోయినప్పటికీ మనిషి కోరికలను మాత్రం త్యజించడు. నాణేనికి బొమ్మ, బొరుసు వలెనే మనిషిలోని కోరికకు తీరడం, తీరకపోవడం అన్న రెండు సంభవాలకూ ఆస్కారం ఉంటుంది. దైవ నిర్ణయం కొన్ని సందర్భాలలో సంతోషాన్ని పండిస్తే, మరికొన్ని సందర్భాలలో దుఃఖాన్ని తెచ్చి పెడుతుంది. సుఖం సంగతి పక్కన ఉంచి, ఈ దుఃఖాన్ని దృష్టిలో ఉంచుకుని– తీరడానికి అవకాశం లేని కోరికలతో మనసును నింపి చివరికి భంగపాటుకు గురికావద్దని విజ్ఞులు చెప్పారు. కేవలం దైవ నిర్ణయంగా దక్కిన సుఖాలను మాత్రమే అనుభవించి తృప్తిపడమన్నారు. ఈ ఆధ్యాత్మిక చింతనను 'కవిరాజ మనోరంజనం' కావ్యంలోని ప్రథమాశ్వాసంలో కనుపర్తి అబ్బయామాత్యుడు ఒక ఉత్పలమాల పద్యంగా మలిచి ఇలా చెప్పాడు.

జ్యోతిర్మయం

కోరకు మేవదార్థమును గోరిన వచ్చునె రాని వస్తువుల్
గోరకయున్న రావె తనకున్ లభియింపగ నున్న యర్థముల్
గోరినరానిచో గలిగి కోల్పడుచో వెతగాన సజ్జనుల్
గోర రనాప్త ప్రాప్తములు గొందరు కుందరు వస్తుహానికిన్.

'ఏదీ కోరవద్దు. దేనినీ ఆశించవద్దు. కోరుకున్నంత మాత్రాన ప్రాప్తంలో లేనివి దక్కుతాయా? కోరుకోనంత మాత్రాన ప్రాప్తంగా రాసిపెట్టి ఉన్నవి దక్కకుండా పోతాయా? అదలావుండగా, కాలం బాగుండక ఒక్కొక్కసారి ఏదో ఆశించి కోరుకున్నప్పుడు, కోరుకున్నది దక్కకపోగా, ప్రారబ్ధాన్ని బట్టి ఉన్నది కూడా పోయి, ఊహించని బాధలలోకి నెట్టేసే పరిస్థితి కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి, సజ్జనులు దేనినీ తమంతగా ఆశించరు' అని స్పష్టంచేశాడు అబ్బయామాత్యుడు. 'అనాప్త ప్రాప్తములు'– అనగా ఒక వ్యక్తి తనంత తానుగా ఏ ప్రయత్నమూ చేయకున్నా లభించే సుఖాలు లేదా దుఃఖాలు... వాటిని మాత్రమే ప్రాప్తంగా స్వీకరించే వాడే 'సజ్జనుడు' అనిచెబుతూ, పోయిన వస్తువులకు కూడా బాధపడనివాడుగా ఉంటాడు 'సజ్జనుడు' అని అదనంగా మరో మాట కూడా చేర్చి చెప్పాడు అందులోనే!

'కవిరాజ మనోరంజనం' కావ్యానికి 'పురూరవశ్చరిత్రము' అనే పేరు కూడా ఉంది. పురూరవుడికి దేవఋషి అయిన నారదునికి మధ్య ఒక సందర్భంలో ఆధ్యాత్మిక విషయాలను గురించి జరిగిన సంభాషణలో, నారదుడు పురూరవుడితో చెప్పిన మాటలు పై పద్యంలోనివి. చిత్తశాంతిని అభిలషించే వ్యక్తులు అర్థం చేసుకుని ఆచరణలో పెట్టదగినవి.

– భట్టు వెంకటరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

అధిక ఉష్ణోగ్రత... ఆపై ఉక్కపోత!

రాష్ట్రంలో మండుతున్న ఎండలు.. ప్రజల ఉక్కిరిబిక్కిరి.. పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు దాటిన గరిష్ట ఉష్ణోగ్రత

మరో 3 రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణ శాఖ.. ఈ నెల 30 వరకు 9 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

శనివారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

కేంద్రం	ఉష్ణోగ్రత
మహబూబ్‌నగర్	43.5
నిజామాబాద్	43.0
భద్రాచలం	42.6
ఆదిలాబాద్	42.3
రామగుండం	42.4
ఖమ్మం	42.0
మెదక్	42.0
నల్లగొండ	41.5
హనుమకొండ	41.0
హైదరాబాద్	40.9
విజయవాడ	42.0
విశాఖపట్నం	39.0



సాక్షి, హైదరాబాద్: ఒకవైపు మాడుపగిలే ఎండ, వడగాడ్పులు... మరోవైపు చెమటలు కారేలా ఉక్కపోత. ఇదీ శనివారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణ పరిస్థితి. రాష్ట్రంలో ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. ఈ సీజన్‌లో ప్రస్తుతం నమోదు కావాల్సిన సాధారణ సగటు ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి.

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్..

➤ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటింది. రానున్న మూడు రోజులు ఇదే తరహాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఈ నెల 28 నుంచి 30 వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో వడగాడ్పులు వీస్తాయని తెలిపింది.



ప్రచండ భానుడు..

రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాల ప్రకారం చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగానే నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 45.4, నల్లగొండ జిల్లా మాడుగులపల్లిలో 45.3, ములుగు జిల్లా మల్లూరులో 45.2 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే మహబూబ్‌నగర్‌లో 43.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు మించి నమోదయ్యాయి. మహబూబ్‌నగర్‌లో సాధారణం కంటే 3.3 డిగ్రీల సెల్సియస్, ఖమ్మంలో 3.2 డిగ్రీల సెల్సియస్ అధికంగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా మిగతా ప్రాంతాల్లో ఒక డిగ్రీ సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పెద్దలు, పిల్లలు, దీర్ఘకాలిక సమస్యలున్నవారు బయటకు రాకపోవడమే మంచిదని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది.



ఆకు రాల్చిన అభయారణ్యం

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని పాకాల అభయారణ్యం వేలాది ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. అన్ని రకాల జంతువులు, పక్షులకు నిలయమిది. సరస్సు చుట్టూ ఉన్న అటవీ ప్రాంతం పచ్చదనంతో అన్ని రకాల పక్షుల అలజడితో చూడ ముచ్చటగా ఉండేది. వేసవిలో మండుతున్న ఎండలతో చెట్లన్నీ ఆకురాలడంతో అటవీ ప్రాంతమంతా బోసిపోయి ఇలా కనిపిస్తోంది. – నర్సంపేట

రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్



సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ యోచిస్తోందన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీసీ ప్రధాన మంత్రిగా ఉన్నారని, తాము అనని మాటలను మార్ఫింగ్ చేసి కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి రోజురోజుకూ నిరాశ నిస్పృహలతో మాట్లాడుతున్నారని, రిజర్వేషన్లు కొనసాగించాలి అనేదే బీజేపీ విధానమని చెప్పారు. సిద్దిపేటలో అమిత్‌షా మాట్లాడిన వీడియోని మార్ఫింగ్ చేసి తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడూ ఇలాగే మాట్లాడేవాడని, రేవంత్‌రెడ్డి అంతకంటే ఎక్కువగా బజార్ మాటలు మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. బీజేపీ ఉన్నంతవరకు రిజర్వేషన్లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి సైతం రేవంత్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

కేటీఆర్.. నీ ఎంపీ అభ్యర్థులు దమ్ములేని క్యాండిడేట్లు

కిషన్‌రెడ్డి ఓ స్క్రిప్ట్ లీడర్: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'కేటీఆర్.. నీ ఎంపీ అభ్యర్థులు దమ్ములేని క్యాండిడేట్లు.. మీరు ఇచ్చిన బీ ఫాంలు వెనక్కి ఇచ్చి వారు వెళ్లిపోతున్నారు' అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షానికి స్వేచ్ఛలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛతో ఇతర పార్టీల నేతలు ఏదైనా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఒక్కసారి ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి మహిళలు ఏమంటున్నారో తెలుసుకోవాలని హితవు పలికారు. కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డమ్మీ మాత్రమేనని, నడిపించేదంతా ప్రచారకేనన్నారు. బీజేపీ కార్యాలయంలో ప్రచారక్ ఏదీ రాసిస్తే కిషన్‌రెడ్డి అదే మాట్లాడుతున్నారని, అందుకే ఆయన ఓ స్క్రిప్ట్ లీడర్ అని ఎద్దేవా చేశారు. కులమతాలకు అతీతంగా పని చేస్తున్న సోనియా కుటుంబంపై కిషన్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు.

చేబదులంటూ కేసు నుంచి తప్పించుకోలేరు

- ఏసీబీ కోర్టు శిక్షను సమర్థించిన హైకోర్టు
- మాజీ ఏఈకి సంవత్సరం జైలు ఖరారు

సాక్షి, హైదరాబాద్: తాను రూ.20 వేలు చేబదులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారన్న తప్పుడు వాదనతో కేసు నుంచి తప్పించుకోలేరని ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మాజీ ఏఈకి హైకోర్టు స్పష్టం చేసింది. ప్రామిసరీ నోటు లాంటిది లేకుండా ఇలాంటి కట్టుకథలు చెప్పడం సరికాదని వ్యాఖ్యానించింది. ఏసీబీ కోర్టు విధించిన శిక్షను ఖరారు చేసింది. అయితే సంవత్సరం శిక్షలో అతను ఇప్పటికే ఈ కేసులో జైలులో గడిపిన కాలాన్ని మినహాయించాలని పోలీసులను ఆదేశించింది. ఓ రోడ్డు కాంట్రాక్టుకు సంబంధించి బిల్లులు మంజూరు చేసేందుకు ఖమ్మం జిల్లా అశ్వరావుపేట మండలం ఆర్అండ్‌బీలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సోమ రాఘవేందర్.. కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశారు. రూ.20 వేలన్నా ఇస్తేగాని పని జరగదని చెప్పారు. దీనిపై కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. రూ.20 వేలను తీసుకుంటుండగా రాఘవేందర్ ఏసీబీకి చిక్కారు. అధికారులు దీనిపై 2003లో కేసు నమోదు చేశారు. తాను రూ.20 వేలు రుణం తీసుకుంటుండగా పట్టుకున్నారన్నది రాఘవేందర్ వాదన. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వాదనలను వినిపించడంతో ఏసీబీ కోర్టు.. రాఘవేందర్‌కు ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను విధిస్తూ 2009లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రాఘవేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏసీబీ కోర్టు తీర్పును కొట్టివేయాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ విచారణ చేపట్టారు. పిటిషన్ తరఫున న్యాయవాది హరిప్రసాద్‌రెడ్డి, ఏసీబీ తరఫున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శ్రీధర్ చిక్యాల వాదనలు వినిపించారు.

ఎన్నికల ముందు అభయహస్తం.. ఎన్నికలయ్యాక భస్మాసుర హస్తం

తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిట్‌చాట్



- జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలోనూ మాట తప్పారు
- ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల కోసం ఆపద మొక్కులు, దేవుళ్లపై ఒట్లు
- అసెంబ్లీ ఎన్నికల నాటిలా ప్రజలు ఇప్పుడు మోసపోవద్దు
- బీజేపీని అడ్డుకునేది ప్రాంతీయ పార్టీలే.. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చేది లేదని వ్యాఖ్య
- ఏపీలో వైఎస్ జగన్ మళ్లీ గెలుస్తున్నారన్న సమాచారం తమకు ఉందని వెల్లడి

ప్రజలను మోసగించే ఎత్తుగడ

"రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తూ.. ఆగస్టు 15న రుణ మాఫీ చేస్తానంటూ.. ప్రజలను మరోసారి మోసగించే ఎత్తుగడ వేస్తున్నారు. అసలు రేవంత్‌రెడ్డికి మాట నిలుపుకొన్న చరిత్ర లేదు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం అన్నారు. ఏమైంది? జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా గెలుస్తామని చెప్పి ఓడిపోయిన తర్వాత మాట తప్పారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు ఆపద మొక్కులు మొక్కుతున్నారు. దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపోయిన ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి మోసపోవద్దు."
- కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే గెలవలేరని.. పరువు పోతుందనే పాలమూరు ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకొన్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభయ హస్తం అని కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేసిందని.. ఎన్నికలయ్యాక అది భస్మాసుర హస్తంగా మారిందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరడం ఖాయమన్నారు. ఈ విషయాన్ని తాను 20 సార్లు చెప్పినా రేవంత్ ఖండించలేదని గుర్తించాలన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక పెరిగిందని.. కరెంటు కోతలు, తాగునీటి కష్టాలు లేని కేసీఆర్ పాలనే తిరిగి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన పథకాలకు సంబంధించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా లబ్ధిదారుల ఖాతాలో చేరలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పార్టీ జెండాను ఎగురవేశారు. తర్వాత మీడియాతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రూ.4 వేల పెన్షన్, రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రైతు భరోసా, స్కూటీలు, నిరుద్యోగ భృతి, క్వింటల్ ధాన్యానికి రూ.500 బోనస్ వంటివేవీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని అటకెక్కిస్తారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు 250 రోజులైనా చేయడం లేదు. దీనిపై హరీశ్‌రావు చేసిన సవాల్‌కు రేవంత్ సమాధానం చెప్పాలి. మాదిగ సామాజిక వర్గంతోపాటు మంత్రి పదవి దక్కని ముదిరాజ్ సోదరులు, ఎంపీ సీటు దక్కని గౌడ, యాదవ సోదరులు కాంగ్రెస్‌ను ఓడించాలని భావిస్తున్నారు.

హైదరాబాద్ బీఆర్‌ఎస్‌కు పూర్తి మద్దతునిచ్చింది

గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నగరం పూర్తిగా బీఆర్‌ఎస్‌కు మద్దతునిచ్చింది. ఉద్యమకారులు గొప్ప పరిపాలకులు కాలేరని బీజేపీ దివంగత నేత అరుణ్ జైట్లీ అన్నారు. కానీ అది తప్పు అని కేసీఆర్ నిరూపించారు, 14 ఏళ్ల ఉద్యమ పార్టీని నడపడం, తర్వాత పదేళ్ల ప్రభుత్వంలో కొనసాగడం, ఒక పార్టీ 24 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం చిన్న విషయమేమీ కాదు. లోక్‌సభ ఎన్నికల్లో 10–12 సీట్లలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి పనులు చేయిస్తాం. రేవంత్‌కు మైనారిటీలను గౌరవించే సంస్కారం లేదు. ఒక్క మంత్రిపదవి కూడా ఇవ్వలేదు. రేవంత్ ఎవరి నాయకత్వంలో పనిచేస్తున్నారు? మోదీ నాయకత్వంలోనా? రాహుల్ గాంధీ నాయకత్వంలోనా?

చోటా భాయ్.. బడే భాయ్.. ఇద్దరూ మోసగాళ్లే..

చోటాభాయ్ సీఎం రేవంత్, బడే భాయ్ ప్రధాని మోదీ ఇద్దరూ మోసగాళ్లే. మోదీ తెలంగాణ ఏర్పాటునే తప్పుపడుతూ మాట్లాడారు. మోదీ, రేవంత్‌రెడ్డిల మోసాలను చూశాక ప్రజలు కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారు. ప్రధాని మోదీని ఉత్తర భారత ప్రజలు కూడా తిరస్కరిస్తున్నారు. బీజేపీని అడ్డుకునేవి ప్రాంతీయ పార్టీలే. కాంగ్రెస్ కాదు. తమిళనాడు సహా చాలా రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ ప్రాంతీయ పార్టీలే మోదీని అడ్డుకుంటున్నాయి. ఏపీలోనూ ప్రాంతీయ పార్టీలే గెలవాలని కోరుకుంటున్నాం. అక్కడ వైఎస్ జగన్ మరోసారి విజయం సాధించబోతున్నారని మాకు సమాచారముంది.

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలవకుండా బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు అయ్యాయి. రేవంత్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ బీజేపీకి సహకరించేందుకే కొన్నిచోట్ల డమ్మీ అభ్యర్థులను పెట్టింది. కొందరు కాంగ్రెస్ అభ్యర్థులకు ఆ నియోజకవర్గాలతో సంబంధమే లేదు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీల కుట్రలను తిప్పికొట్టాలి.

పార్టీకి పూర్వవైభవం తెస్తాం..

వరంగల్‌లో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఎవరు ప్రచారం చేసినా కడియం శ్రీహరి, ఆయన కూతురు మూడో స్థానానికి వెళ్లడం గ్యారంటీ. కేసీఆర్‌కు కడియం చేసిన ద్రోహం మామూలుది కాదు. మల్కాజిగిరిలో ఈటల గెలుస్తారని మాజీ మంత్రి మల్లారెడ్డి చేసినవి వ్యంగ్య వ్యాఖ్యలే. బీఆర్‌ఎస్ నుంచి కొందరు నాయకులు వెళ్లిపోయినా.. కార్యకర్తలు ఎక్కడికీ వెళ్లలేదు. పార్టీని విస్తరిస్తాం, పూర్వ వైభవం తేవడానికి ప్రయత్నిస్తాం..''అని కేటీఆర్ చెప్పారు.

ప్రతికూలతలను తట్టుకుని కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారు

బీఆర్‌ఎస్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం తెలంగాణ భవన్‌తో పాటు అన్ని జిల్లా కార్యాలయాల్లోనూ పార్టీ జెండాను ఎగురవేసి జరుపుకొన్నారు. తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2001లో శూన్యంలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ పార్టీని ఏర్పాటు చేసి.. ప్రతికూలతలను తట్టుకుని రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. శాంతియుతంగా ఉద్యమాన్ని నడిపించి, ప్రజాస్వామ్యయుతంగా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని దశాబ్దాల కలను సాకారం చేశారని తెలిపారు. ప్రజలందించిన సహకారంతోనే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. ఆనాడు సమైక్యవాదులు ఎన్ని రకాల కుట్రలు చేసినా ఛేదించుకుని విజయాన్ని చేరుకున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. అనంతరం తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు. తెలంగాణ సాధించిన ప్రగతిని దేశవ్యాప్తం చేయాలన్న ఉద్దేశంతోనే టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చినట్లు తెలిపారు. దీనికి మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశాల నుంచి అద్భుత స్పందన లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అపజయాలకు కుంగిపోయేది లేదని భవిష్యత్తులోనూ ప్రజల కోసం కొట్లాడుతూనే ఉంటామని అన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌కి ఓటమి భయం పట్టుకుంది

- ఆ అసహనంతోనే తిట్ల దండకాన్ని అందుకున్నారు
- నాడు ఓటుకు కోట్లు అయితే.. నేడు ఓటుకు ఒట్టు
- కొత్త జిల్లాల రద్దుకు సీఎం కుట్ర
- బీజేపీ, కాంగ్రెస్‌వి మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు
- హామీలు అమలయ్యే వరకు నిలదీస్తా
- మాజీమంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న హరీశ్‌రావు

కరీంనగర్, సిద్దిపేటజోన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే సీఎం పదవి నుంచి దింపేస్తారనే భయం రేవంత్‌రెడ్డికి పట్టుకుందని, అందుకే ఇచ్చిన హామీలు, పరిపాలనపై మాట్లాడాల్సిన ఆయన అసహనంతో తిట్ల దండకాన్ని అందుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శనివారం కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యాయని, ఆ రెండు పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు గమనించి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలతోపాటు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం జరిగిందని, అందుకే ప్రధాని మోదీని సీఎం బడేబాయి అంటున్నారని, రేవంత్‌రెడ్డి ఓ ఫైటర్ అని బండి సంజయ్ పొగుడుతున్నారని, రేవంత్‌రెడ్డి బీజేపీలోకి రావాలని ఎంపీ అర్వింద్ మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. ఇవన్నీ చూస్తుంటే ఎవరికి ఎవరు బీ టీమ్‌నో అర్థం అవుతోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ దోస్తీకు బోలెడు కారణాలు ఉన్నాయని, కరీంనగర్‌తోపాటు అనేక సీట్లలో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలిపి పరోక్షంగా బీజేపీ గెలుపునకు సహకరిస్తోందన్నారు.

నన్ను తిట్టినా ఫర్వాలేదు.. హామీలు అమలు చేయండి: హరీశ్

''నేను కొత్త డిమాండ్లను అమలు చేయమని అనలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అడుగుతున్నా. దానికి మీరు. మీ మంత్రులు నన్ను తిడుతున్నారు. నన్ను ఎంత తిట్టినా, ప్రజల కోసం భరించడానికి సిద్ధంగా ఉన్నా.. హామీలు అమలయ్యే వరకు అడుగడుగునా నిలదీస్తా''అని హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన సిద్దిపేటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎవరెన్ని కుట్రలు చేసినా ఆరు గ్యారంటీలు అమలయ్యేంత వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నాడు ఓటుకు నోటు అయితే.. నేడు ఓటుకు ఒట్టు అని ఎద్దేవా చేశారు. సీఎం సవాల్ మేరకు అమరవీరుల స్తూపం వద్దకు తాను రాజీనామాతో వస్తే రేవంత్ మొఖం చాటేశారని విమర్శించారు. రాజీనామా ఎలా చేయాలో తనకు తెలుసని, పదవులు ముఖ్యం కాదని, ప్రజా ఆకాంక్షలే ముఖ్యమని పేర్కొన్నారు. గతంలో వచ్చిన తెలంగాణను కేంద్రం వెనక్కి తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని కోరితే రేవంత్‌రెడ్డి జిరాక్స్ కాగితం ఇచ్చి మోసం చేసి పారిపోయారని విమర్శించారు. అప్పట్లో కిషన్‌రెడ్డి రాజీనామా చేయలేదని అలాంటి వారు ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు అని మండిపడ్డారు. కొత్త జిల్లాలను రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, లోక్‌సభ నియోజకవర్గానికి ఒక జిల్లా సరిపోతుందంటూ అందుకు కమిషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని హరీశ్ ఆరోపించారు.

ఈసీ బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోంది: దాసోజు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. శనివారం ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌ను బీఆర్‌ఎస్ నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దాసోజు మాట్లాడుతూ ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి నగేశ్ నామినేషన్ తిరస్కరించడానికి అన్ని ఆధారాలు చూపించినప్పటికీ రిటర్నింగ్ అధికారి తిరస్కరించలేదన్నారు. దేశంలోనే కాదు రాష్ట్రంలో కూడా ఎన్నికల అధికారులు బీజేపీకి సహకరిస్తున్నారని ఆరోపించారు.

మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

సాక్షి, హైదరాబాద్: మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయేందిర బోయి అన్నారు. తెలంగాణ సచివాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల పేరుతో.. మహాత్మా జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం వచ్చాకే ప్రజాపాలన

దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తీసుకురావాలి: రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల



ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం రూరల్: తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డాకే ప్రజాపాలన కొనసాగుతోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు కావాలి, ఇందిరమ్మ రాజ్యం రావాలన్న ఉద్దేశంతో ప్రజలు తమను గెలిపించారన్నారు. పార్టీ శ్రేణుల చలవతోనే రాష్ట్ర కేబినెట్‌లో జిల్లాకు మూడు పదవులు దక్కాయని తెలిపారు. అధికార మదం, అహంకారంతో ఉన్న గత పాలకులకు ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ సమాలోచనల అనంతరం కాంగ్రెస్ అధిష్టానం అందరికీ కావాల్సిన వ్యక్తి రఘురాంరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేసిందని తెలిపారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా అక్షింతలు, దీపాలతో కాలం వెళ్లబుచ్చిన బీజేపీని ఇంటికి పంపించి.. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు.

పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తేనే మళ్లీ పోటీ చేస్తా

ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


ఓడెడ్‌లో కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ తదితరులు

ముత్తారం (మంథని): పత్తిపాక రిజర్వాయర్ పూర్తి చేసి పెద్దపల్లి జిల్లాలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తానని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ముత్తారం మండలం ఓడెడ్‌లో కూలిన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల విషయంలో ట్రైలర్ 35 ఎంఎంకే భయపడితే ఎలా? ముస్ముందు 70 ఎంఎం సినిమాను ప్రత్యేకంగా మంథని నియోజకవర్గంలో చూపిస్తానని తెలిపారు. రూ.లక్షల కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, రూ.47.4 కోట్లతో నిర్మాణ దశలోనే ఓడెడ్ బ్రిడ్జి గాలిదుమారానికి కూలడానికి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు నైతిక బాధ్యత వహించాలని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. బ్రిడ్జి కూలడానికి కారకులైన ఇంజనీర్లు, కాంట్రాక్టర్, వారి వెనకున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖమంత్రి, సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగానే నాణ్యతతో ఓడెడ్ మానేరు బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామన్నారు.

FOOD CORPORATION OF INDIA | భారత ఆహార సంస్థ
ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, హాకా భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్ 500004
Regional Office, 3rd Floor, HACA Bhavan, Public Garden Road, Hyderabad 500004
తేదీ/Dt.:27.04.2024
GeM పోర్టల్ ద్వారా ఇ-టెండర్ల కొరకు పిలుపు
PWS తెలంగాణ వద్ద H&TC, PWS వద్ద HTC, FSD వద్ద ITC మరియు PWS వద్ద HTC నిమిత్తము FCI, RO, హైదరాబాద్ ... GeM పోర్టల్ (https://gem.gov.in) మరియు FCI వెబ్‌సైట్ (https://fci.gov.in) ...
జనరల్ మేనేజర్ (రీజియన్) తరఫున /for General Manager (Region)

తెలంగాణ ప్రభుత్వం
పర్యవేక్షక అభియంత కార్యాలయం, నీటిపారుదల వలయ సంఖ్య.3, మక్తల్, నారాయణపేట జిల్లా
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
క్రమ సంఖ్య.1: టెండరు నోటీసు సంఖ్య: 10/SE/IC3/MKL/2023-24, Dt: 10-02-2024, పని పేరు: కోరిజిండం: నీటి పారుదల శాఖ–కొడంగల్, లిఫ్ట్ నీటిపారుదల పథకం, కొడంగల్, నారాయణపేట మరియు మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల కరువు పీడిత ప్రాంతాలకు నీటిపారుదల సౌకర్యం అందించదానికి, పని విలువ (రూ.కోట్లు): 1894.00, టెండర్ స్వీకరించు చివరి తేది మరియు సమయం: 31.05.2024, చిరునామా మరియు ఫోన్ నంబర్: ఎల్.చక్రధరం, పర్యవేక్షక అభియంత, నీటిపారుదల వలయం నం.3, మక్తల్, నారాయణపేట జిల్లా ఫోన్: 9885367472. తదుపరి వివరాలకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ మార్కెట్ ప్లేస్ చూడగలరు. www.tender.telangana.gov.in.
సం/- పర్యవేక్షక అభియంత, నీటిపారుదల వలయం సంఖ్య 3, మక్తల్
DIPR RO No.12013-PP/CL/Advt/1/2024-25, Dt: 27.04.2024

CENTRAL INSTITUTE OF PETROCHEMICALS ENGINEERING & TECHNOLOGY (CIPET)
(Department of Chemicals & Petrochemicals, Ministry of Chemicals & Fertilizers, Govt. of India)
IDA, Phase-II, Cherlapally, Hyderabad – 500 051
Ph: 040 – 27263750 / 27264040 Email: hyderabad@cipet.gov.in Website : cipet.gov.in
CIPET Admission in Diploma Level Programs for the academic year 2024 – 25
CIPET ADMISSION TEST 2024
Apply Online: https://cipet24.onlineregistrationform.org/CIPET/

S.No.	Name of Course	Course Duration	Entry Qualification
1	Diploma in Plastics Mould Technology (DPMT)	3 Years	10th Std.
2	Diploma in Plastics Technology (DPT)	3 Years	10th Std.
3	Post Graduate Diploma in Plastics Processing &Testing (PGD-PPT)	2 Years	3 Years Degree in Science
4	Post Diploma in Plastics Mould Design with CAD / CAM (PD-PMD with CAD/CAM)	1½ Years	Diploma in Mechanical / Plastics / Polymer / Tool / Tool & Die Making / Production / Mechatronics / Automobile / Petrochemicals / Industrial / Instrumentation Engineering / Technology or DPMT / DPT or Equivalent

*Candidates appearing for the entry qualification examination are also eligible to apply for all the above courses
*Candidates who have passed Intermediate / ITI can join in Diploma 2nd year (Lateral Entry) directly
No Age Bar | Separate Hostel Accommodation for Boys & Girls

CIPET ADMISSION TEST (CAT)	
Date of opening for CAT Online application submission	26.03.2024
Date of closure for CAT application submission	31.05.2024
Date of CAT all over India	09.06.2024
Date of commencement of courses	1st Week of August 2024

Further Details Please contact
9618677011, 8374064444, 8093140230, 7731058232, 8712865080, 9494844571



కూటమికి బీఎస్పీ పోటు!

ముస్లింలకు భారీగా టికెట్లిచ్చిన మాయావతి ● యూపీలో కాంగ్రెస్, ఎస్పీలకు దెబ్బే!

లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీఎస్పీ ప్రదర్శన

ఎన్నికలు	సీట్లు	ఓట్ల శాతం
2004	19	5.33
2009	21	6.17
2014	0	4.19
2019	10	3.67

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరాదిలో బీజేపీ కోటను బద్దలు కొట్టాలన్న విపక్ష ఇండియా కూటమి ఆశలపై బీఎస్పీ అధినేత్రి మాయావతి నీళ్లు చల్లేలా కన్పిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలంటాలలో బీజేపీని నిలువరించేందుకు ఓట్ల సమీకరణకు కాంగ్రెస్ కిందా మీదా పడుతోంది. ఆ ప్రయత్నాలను వమ్ము చేసేలా బీఎస్పీ వ్యవహరిస్తోంది. ముఖ్యంగా యూపీలో ముస్లిం ఓట్ల సమీకరణతో బీజేపీ స్థానాలకు భారీగా గండి కొట్టాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయి. కానీ ముస్లిం ఓట్లను నిలువునా చీల్చేలా రాష్ట్రంలో బీఎస్పీ ముస్లింలకు ఎక్కువ టికెట్లిచ్చింది! అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే ప్రాభవం కోల్పోయిన బీఎస్పీ లోక్‌సభ ఎన్నికల్లోనైనా ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాలు ఇండియా కూటమికి ప్రాణ సంకటంగా పరిణమిస్తున్నాయి.

యూపీలో కూటమికి దెబ్బే!

అత్యంత కీలకమైన యూపీలో 80 స్థానాలకు గానూ బీజేపీ ఈసారి సొంతంగానే 70 సీట్లపై గురిపెట్టింది. పొత్తులో భాగంగా కట్టిన కాంగ్రెస్ 13, ఎస్పీ 67 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. యూపీలో 21 శాతమున్న యాదవ ఓట్లకు 19 శాతం ముస్లిం ఓట్లు కలిస్తే భారీగా ఓట్లు రాలుతాయని ఆశ పడుతున్నాయి. రాష్ట్రంలో ఏకంగా 18 జిల్లాల పరిధిలోని పలు లోక్‌సభ స్థానాల్లో ముస్లింలు నిర్ణాయక శక్తిగా ఉన్నారు. వీటిలో పలు జిల్లాలో ముస్లిం జనాభా ఏకంగా 30 శాతం పైగా ఉంది. వీరంతా కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీలకు సంప్రదాయ ఓటు బ్యాంకే. దాంతో ముస్లింల ఓట్లను సంఘటితంగా తమవైపు సమీకరించుకునేందుకు కాంగ్రెస్, ఎస్పీ వారికి 11 సీట్లు కేటాయించాయి. మాయా నిర్ణయాలు వాటి ప్రయత్నాలకు గండి కొట్టేలా ఉన్నాయి. బీఎస్పీ ఈసారి ఏకంగా 18 స్థానాల్లో ముస్లింలకే టికెట్లిచ్చింది! దాంతో ముస్లిం ఓట్లకు గండిపడి ఎస్పీ/కాంగ్రెస్ అభ్యర్థుల అవకాశాలకు గండిపడేలా కన్పిస్తోంది. ఇక దళిత ప్రాబల్య పశ్చిమ యూపీలో వాటి ఓట్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్/ఎస్పీ విశ్వప్రయత్నాలు చేస్తుంటే అక్కడా బీఎస్పీ ప్రచారాన్ని ఉధృతం చేసి కాంగ్రెస్‌పై ముప్పేట దాడి కొనసాగిస్తోంది. ఇది వాటికి మరో తలనొప్పిగా మారింది. రాజస్థాన్‌లోనూ బీఎస్పీ ఆరుచోట్ల ముస్లింలకు టికెటిచ్చింది! మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోనూ ఇదే పరిస్థితి!

ప్రభావం తగ్గలేదు

బహుజన నేత కాన్షీరాం వారసురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన మాయావతి నాలుగుసార్లు యూపీ ముఖ్యమంత్రిగా చేశారు. రాష్ట్రంలో 21 శాతమున్న ఎస్సీల్లో సగానికి పైగా జాతవ్‌లే. ఆ కులం నుంచి వచ్చిన మాయావతికి వారిపై పట్టు ఉంది. కానీ 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీలు పూర్తిగా బీజేపీ వైపు మొగ్గడంతో మాయా ప్రభను కోల్పోయారు. 2017లో బీఎస్పీకి 19 సీట్లు రాగా 2022లో ఒక్కటంటే ఒక్క సీటే వచ్చింది! కాకపోతే ఆ ఎన్నికల్లో బీఎస్పీ 12.88 శాతం ఓట్లు సాధించింది. ఇక 2004 లోక్‌సభ ఎన్నికల్లో 19, 2009లో 21 సీట్లు సాధించిన బీఎస్పీ, 2014లో మాత్రం ఖాతాయే తెరవలేకపోయింది. 2019లో ఎస్పీ, రాష్ట్రీయ లోక్‌దళ్‌తో పొత్తుల వల్ల 10 సీట్లు గెలుచుకుంది. కానీ వారిలో ఐదుగురు ఎంపీలు పార్టీని వీడారు. ఈ ఎన్నికల్లో మాయవతి ఒంటరిగా పోరాడుతున్నారు. యూపీలో 80 స్థానాలకు గానూ 64 చోట్ల అభ్యర్థులను నిలిపారు. అలాగే రాజస్థాన్‌లో 25, మధ్యప్రదేశ్‌లో 7, ఛత్తీస్‌గఢ్‌లో 8 స్థానాల్లోనూ బీఎస్పీ పోటీ చేస్తోంది. ఈసారి కూడా ముస్లిం-దళిత ఫార్ములాతోనే ఆమె బరిలో దిగారు. ఆమె ప్రచార సభలకు జనం భారీగా వస్తున్నారు. దాంతో మాయా దెబ్బకు మోదీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలుతుందని కాంగ్రెస్ తదితర విపక్షాలు భయపడుతున్నాయి.

అడవి రాముడు



ఎన్నికల విచిత్రం

పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెర్హంపూర్‌లో శనివారం ఎన్నికల ప్రచారంలో ఓ మహిళను ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆధిర్ రంజన్ చౌదరి

ఇండియా కూటమి గెలిస్తే

ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా
- మహారాష్ట్ర, గోవాలో ఎన్నికల ప్రచారం



మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కొల్హాపూర్/గోవా: కేంద్రంలో విపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాల్లో ఐదుగురు ప్రధానమంత్రులు కుర్చీ ఎక్కుతారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ఆ కూటమి గెలిచే అవకాశమే లేనప్పటికీ ఎవరెప్పుడు ప్రధాని కావాలన్న దానిపై ఇప్పటినుంచే మంతనాలు సాగిస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులను దేశం భరించబోదని అన్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌తోపాటు గోవాలో ఎన్నికల ప్రచారంలో మోదీ ప్రసంగించారు. కర్ణాటకలో ఓబీసీల జాబితాలో ముస్లింలను చేర్చారని తప్పుపట్టారు. దీంతో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు దక్కడం లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కర్ణాటక మోడల్ దేశమంతటా అమల్లోకి వస్తుందంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. సామాజిక న్యాయాన్ని హత్య చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమా? అని నిలదీశారు. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలే తప్ప ప్రజల సంక్షేమం పట్టడం లేదని దుయ్యబట్టారు. వారసత్వ పన్ను విధించి జనం ఆస్తులు లాక్కోవాలని చూస్తున్న పార్టీలను అధికారానికి ఆమడ దూరంలో ఉంచాలని ప్రజలకు నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తించడానికి ప్రయత్నించినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్నారు. ఈసారి ఎన్నికలు రెండు శిబిరాల మధ్య జరుగుతున్నాయని వివరించారు. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేస్తున్న ఎన్డీయే ఒకవైపు, సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతున్న 'ఇండియా' కూటమి మరోవైపు ఉందని పేర్కొన్నారు.

రెండో దశలో

66.7% పోలింగ్

2019తో పోలిస్తే తొలి రెండు దశల్లోనూ తక్కువ నమోదైన పోలింగ్

న్యూఢిల్లీ: శుక్రవారం 13 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తాజా గణాంకాల ప్రకారం పోలింగ్ 66.7 శాతానికి పెరిగిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ గణాంకాలను ఇంకా కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించలేదు. 2019లో రెండో దశలో 95 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 69.64 శాతం పోలింగ్ నమోదైంది. తొలి దశలో ఏప్రిల్ 19న 21 రాష్ట్రాల్లోని 101 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 65.5 శాతం పోలింగ్ నమోదవడం తెల్సిందే. 2019లో తొలి దశలో 91 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 69.43 శాతం పోలింగ్ నమోదవడం గమనార్హం. భరించలేని ఎండవేడిమి వల్లే ఈసారి ఓటర్లు పోలింగ్ కేంద్రం దాకా రావడానికి భయపడ్డారని విశ్లేషణలు వినిపించాయి.

'అర్బన్ నక్సల్స్'ను ఎన్నుకుని

పొరపాటు చేయొద్దు

- కాంగ్రెస్, ఆప్ చెప్పేవన్నీ అబద్ధాలే
- అమిత్ షా ఆరోపణలు



గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో మాట్లాడుతున్న అమిత్ షా

భరూఛ్: ఓటు వేసి అర్బన్ నక్సలైట్లను ఎన్నుకునే పొరపాటు ఎప్పుడూ చేయొద్దని గుజరాత్ ఓటర్లకు బీజేపీ అగ్రనేత అమిత్ షా హితవు పలికారు. గుజరాత్‌లోని భరూఛ్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంపీ మన్‌సుఖ్ వాసావా తరఫున శనివారం ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడారు. ''మన్‌సుఖ్‌లాంటి చక్కని ప్రజా ప్రతినిధి ఇంకొకరు మీకు దొరకదు. పొరపాటున వేరేవాళ్లకు ఓటేస్తే అర్బన్ నక్సలైట్లలో ఒకరు ఎంపీ సీటులో కూర్చుంటారు. ఈ గిరిజన ప్రాంతాన్ని నాశనం చేస్తారు. ప్రజలను లూటీచేసేందుకు ఆప్, కాంగ్రెస్ కలిసి వచ్చాయి. కాంగ్రెస్ గిరిజనుల వ్యతిరేక పార్టీ. ఓట్లకోసం ఆప్ గిరిజనులను గాలికొదిలేస్తుంది. 400 మెజారిటీతో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆప్, కాంగ్రెస్ చెప్పేవన్నీ అసత్యాలు. అబద్ధాలు ప్రచారం చేయడంలో కాంగ్రెస్ నైపుణ్యం సాధించింది. ఆప్ సర్దార్ స్థాయికి ఎదిగింది. నిజంగానే మేం రాజ్యాంగాన్ని మార్చేవారమే అయితే ఈ పదేళ్ల అధికారంలో ఉన్నపుడే మార్చేవాళ్లం కదా?' అని వ్యాఖ్యానించారు. ''ఆదివాసీలు, దళితులు, ఓబీసీల రిజర్వేషన్లను మేం ముట్టుకోబోం. ఎవరినీ ముట్టుకోనివ్వం కూడా. గిరిజనుల ప్రాథమిక హక్కులను ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) లాగేసుకుంటుందని ఆప్, కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. యూసీసీకి గిరిజనులకు సంబంధమే లేదు. భరూఛ్‌లో ఆప్ అభ్యర్థి చైతర్ వాసావా లేనిపోనివి ప్రచారంచేస్తున్నారు. ఆదివాసీలకు మోదీ ఎల్లప్పుడూ మిత్రుడే'' అని అమిత్ షా చెప్పారు.


ఎలక్షన్ బీట్

కశ్మీర్‌లోయ బరిలో 'బయటి వ్యక్తి'

ప్రజాప్రాతినిధ్య చట్టం-1957 జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల్లో స్థానికేతరులు పోటీ చేయడాన్ని నిషేధించింది. ఆగస్టు 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో ఈ కేంద్రపాలిత ప్రాంతంలో బయటి వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమం అయ్యింది. ప్రస్తుత ఎన్నికల్లో మొట్టమొదటిసారి రాష్ట్రేతర వ్యక్తి బరిలోకి దిగుతున్నారు. అక్కడ పోటీ చేస్తున్న మొట్టమొదటి నాన్‌లోకల్ వ్యక్తి పంజాబ్ వాసి బల్‌దేవ్ కుమార్. మొహాలీలోని నయాగావ్ ప్రాంతానికి చెందిన బల్‌దేవ్.. స్వతంత్ర అభ్యర్థిగా అనంతనాగ్-రాజౌరీ నియోజకవర్గం నుంచి పోటీ పడుతున్నారు.

బల్‌దేవ్ కుమార్.. 20 సంవత్సరాలుగా కశ్మీర్‌లో స్వచ్ఛంద సేవలందిస్తున్నారు. 2014 వరదల సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డారు. చాలా మంది విద్యార్థులకు విద్యకు ఆర్థిక సాయం అందించారు. కశ్మీర్ నుంచి వైద్యం కోసం పంజాబ్ వెళ్లిన వారికి వసతి, సౌకర్యాలు కల్పించారు. అయితే స్థానిక ప్రజల కోరిక మేరకే తాను పోటీ చేస్తున్నట్టు కుమార్ చెబుతున్నారు. రోగులకోసం పంజాబ్‌లో 'కశ్మీర్ భవన్' నిర్మించాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ తన స్వచ్ఛంద సంస్థ కోసం గుజరాత్ ప్రభుత్వం నుంచి 20 ఎకరాల భూమిని పొందారని, కశ్మీర్ భవన్ కోసం రెండు ఎకరాలు కూడా కేటాయించలేదని విమర్శిస్తున్నారు. అధికారం ఉంటే ఏదైనా చేయగలమని, అందుకే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. జమ్మూ కశ్మీర్ నివాస ధ్రువీకరణ పత్రం ఉందా? అని అడగ్గా.. తాను ఒక్క చోట ఉండనందున తనకు నివాసం లేదని చెప్పారు. – సాక్షి, నేషనల్ డెస్క్

చెంబు వర్సెస్ చిప్ప



బళ్లారి సభలో చెంబును చూపుతున్న రాహుల్

కర్ణాటకలో 'చెంబు వర్సెస్ చిప్ప' రాజకీయాలు నడుస్తున్నాయి. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఖాళీ చెంబు చేతికిచ్చిందని కాంగ్రెస్ విమర్శిస్తుంటే.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ఖాళీ చిప్పే గతి అయ్యిందని బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు.

ఎవరికైనా ఏదైనా అన్యాయం జరిగినప్పుడు 'చెంబు చేతికిచ్చారు' అని ఎద్దేవా చేస్తారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకకు అన్యాయం చేసిందని చెప్పేందుకు కాంగ్రెస్ ఈ 'చెంబు' సామెతను అందుకుంది. ఓ స్టీల్ చెంబు బొమ్మతో పత్రికలకు ఫుల్ పేజ్ యాడ్ కూడా ఇచ్చింది. ప్రతి ఒక్కరి అకౌంట్‌లో 15 లక్షలు వేస్తామని వేయలేదని, రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామని వాగ్దానం చేసిన బీజేపీ, జేడీఎస్‌కు చెందిన 27 మంది ఎంపీలు రాష్ట్రం చేతిలో చెంబు పెట్టారని, ఈ ఎన్నికల్లో ఓటర్లు బీజేపీ చేతికి చెంబు ఇవ్వాలని కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది.

రగిలిపోయిన కర్ణాటక బీజేపీ నేతలు ఖాళీ కొబ్బరి చిప్పతో కౌంటర్ ఇస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ఖాళీ చిప్ప మిగిలిందని ఎద్దేవా చేస్తున్నారు. ఎమ్మెల్సీ, మండలి చీఫ్ విప్ ఎన్.రవికుమార్.. చిప్ప ప్రచారాన్ని ప్రారంభించారు. రైతులకు కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్‌కు అదనంగా రూ.4వేలు ఇవ్వడం ఆపేసిందని, పాడి రైతులకు మద్దతు ధర, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు పెన్షన్లు అందడం లేదని బీజేపీ ఎద్దేవా చేస్తోంది. మొత్తానికి కర్ణాటక రాజకీయాల్లో చెంబు, చిప్ప హాట్ టాపిక్‌గా మారాయి. – సాక్షి, నేషనల్ డెస్క్

పూనమ్ మహాజన్ బదులు ఉజ్వల్ నికమ్

ముంబై నార్త్ సెంట్రల్ అభ్యర్థిని మార్చిన బీజేపీ



న్యూఢిల్లీ: ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ పూనమ్ మహాజన్‌ను బీజేపీ బరి నుంచి తప్పించింది. బదులుగా ప్రముఖ లాయర్ ఉజ్వల్ డియోరావ్ నికమ్‌ను రంగంలోకి దించింది. మాజీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయిన నికమ్ 1993 ముంబై పేలుళ్లు, 2008 ముంబైలో ఉగ్రదాడి, పూనమ్ తండ్రి ప్రమోద్ మహాజన్ హత్య, గుల్షన్ కుమార్ హత్య వంటి హై ప్రొఫైల్ కేసులను వాదించిన నికమ్ న్యాయవర్గాల్లో బాగా పరిచయమున్న వ్యక్తి. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న నికమ్ ముంబై వరుస పేలుళ్ల కేసులో పరిణామాలను వెల్లడించే క్రమంలో నిత్యం జాతీయ వార్తల్లో ప్రముఖంగా కనిపించేవారు. 2016లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఆయన రాజకీయ ప్రవేశం చేయనున్నారంటూ ఇటీవలి కాలంలో వార్తలు కూడా వస్తున్నాయి. కాగా, పూనమ్ 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందారు. బీజేపీ యువజన విభాగం అధ్యక్షురాలిగానూ ఉన్నారు. ఈసారి ఈమెను మార్చొచ్చంటూ గత కొన్ని రోజులుగా ఊహాగానాలు వస్తున్నాయి. సర్వేలు, సంస్థాగతంగా వెల్లడైన అభిప్రాయాల ఆధారంగానే పూనమ్‌ను ఎన్నికల బరి నుంచి తప్పిస్తూ అగ్ర నాయకత్వం నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు తెలిపాయి. సరైన అభ్యర్థిని వెదికే క్రమంలో కొంత సమయం పట్టిందని ఆ వర్గాలు వివరించాయి. ముంబైలో మే 20న ఐదో దశలో పోలింగ్ జరగనుంది. కాగా, ఉజ్వల్ నికమ్ ప్రధాన ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన వర్షా గైక్వాడ్‌తో తలపడాల్సి ఉంది.

షాజహాన్‌పూర్ అభ్యర్థిని మార్చిన ఎస్పీ

షాజహాన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి రాజేశ్ కశ్యప్‌ను సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మార్చివేసింది. ఆయన స్థానంలో జ్యోత్స్న గోండ్‌ను ప్రకటించింది. కశ్యప్ ఈ నెల 22వ తేదీన దాఖలు చేసిన నామినేషన్‌ను పరిశీలన అనంతరం అధికారులు తిరస్కరించడంతో 24వ తేదీన గోండ్‌తో నామినేషన్ వేయించినట్లు ఎస్పీ వర్గాలు తెలిపాయి. అయితే, సమాజ్‌వాదీ పార్టీ తనతో ఆటాడుకుందని కశ్యప్ ఆరోపించారు.

మిలిటెంట్ల దాడిలో

నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

ఇంఫాల్: మణిపూర్‌లోని విష్ణుపూర్ జిల్లాలో భద్రతా బలగాల క్యాంపుపై మిలిటెంట్లు దాడికి తెగబడ్డారు. ఘటనలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఇద్దరు జవాన్లు నేలకొరగ్గా మరో ఇద్దరు గాయపడ్డారు. మొయిరంగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసేనా ఇండియా రిజర్వ్ బెటాలియన్ క్యాంప్‌పై శనివారం వేకువజామున ఈ దాడి జరిగింది. బెటాలియన్ ఔట్‌పోస్ట్‌పైకి మిలిటెంట్లు బాంబులు విసిరారు. ఇరువర్గాల మధ్య దాదాపు రెండు గంటలపాటు కాల్పులు జరిగాయి. ఘటనలో ఇద్దరు జవాన్లు చనిపోగా మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను అస్సాంకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సర్కార్, బెంగాల్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అరూప్ సైనీగా గుర్తించారు. గాయపడిన ఇన్‌స్పెక్టర్ జాదవ్ దాస్, కానిస్టేబుల్ అఫ్తాబ్ దాస్‌లను ఇంఫాల్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

అబ్‌కీ బార్ ఆప్ కా సర్కార్

ప్రధాని మోదీ 'అబ్‌కీ బార్ చార్ సౌ బార్' నినాదాన్ని తిప్పికొట్టిన ప్రియాంక



ధరంపూర్/లాతూర్: అబ్‌కీ బార్ చార్‌సౌ బార్(ఈసారి 400కుపైగా లోక్‌సభ స్థానాలు) అంటూ ఈ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తిప్పికొట్టారు. తనదైన శైలిలో కొత్త నినాదం వినిపించారు. అబ్‌కీ బార్ ఆప్ కా సర్కారు... అబ్‌కీ బార్ జనతాకీ సర్కారు (ఈసారి మీ ప్రభుత్వం, ఈసారి ప్రజల ప్రభుత్వం) అని ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారని చెప్పారు. ప్రజల ఆలోచనల్లో మార్పు మొదలైందన్న సంగతి ప్రధాని మోదీ, ఆయన మంత్రులకు అర్థమైందని, అందుకే కొత్త నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వారి నాటకాలు ఇక సాగవని, అంతిమంగా సత్యమే జయిస్తుందని తేల్చిచెప్పారు. శనివారం గుజరాత్ రాష్ట్రం వల్సాద్ జిల్లాలోని ధరంపూర్, మహారాష్ట్రలో లాతూర్ జిల్లాలోని ఉద్గిర్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రియాంక గాంధీ మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాజ్యాంగంపై ప్రజలకు బీజేపీ మాయమాటలు చెబుతోందని, రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం లేనట్లు నమ్మబలుకుతోందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేయడం తథ్యమని చెప్పారు. బీజేపీ పెద్దలు చేయాలనుకున్నది ఎలాగైనా చేస్తారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతారని, ఇంకా బలహీనులుగా మారుతారని, వారి జీవితాల మరింత దుర్భరంగా తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార వేదికలపై సూపర్‌మ్యాన్‌గా పోజులిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ద్రవ్యోల్బణం పెంచిన వ్యక్తిగా గుర్తుపెట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని చిటికెలో ఆపేసే సత్తా మోదీకి ఉందని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారని, మోదీ అంత శక్తివంతమైన నాయకుడైతే మన దేశంలో పేదరికాన్ని ఎందుకు నిర్మూలించలేకపోతున్నారని నిలదీశారు.

ఆధిపత్య ధోరణితో

వ్యవహరిస్తున్న ఈడీ

అరవింద్ కేజ్రీవాల్ ఆరోపణ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తీరు పట్ల ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో తాను బెయిల్‌కు అర్హుడినేనని పేర్కొన్నారు. తనకు బెయిల్ రాకుండా ఈడీ ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. మనీ లాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు ఈడీ సమర్పించిన అఫిడవిట్‌పై కేజ్రీవాల్ స్పందించారు. కోర్టుకు శనివారం వివరణ ఇచ్చారు. ఈడీ ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. విచారణకు తాను పూర్తిగా సహకరించానని తెలిపారు. ఈడీ జారీ చేసిన అన్ని నోటీసులు, సమన్లకు స్పందించానని, సమాధానం ఇచ్చానని వివరించారు. ఈ కేసులో తనకు మంజూరు చేయాలని సుప్రీం కోర్టును కేజ్రీవాల్ అభ్యర్థించారు. మనీ లాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన తిహార్ జైలులో ఉన్నారు.

కాంబోడియాలో భారీ పేలుడు..

20 మంది సైనికులు మృతి

నాంఫెన్: కాంబోడియాలోని సైనిక కేంద్రంలో శనివారం సంభవించిన భారీ పేలుడులో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు సామగ్రిని నిల్వ ఉంచిన మూడు భవనాలు సహా మొత్తం నాలుగు భవనాలు ధ్వంసం కాగా పలు సైనిక వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. సమీప గ్రామంలోని కనీసం 25 ఇళ్లు ధ్వంసమైనట్లు ఆర్మీ చీఫ్ జనరల్ మావో సోఫాన్ చెప్పారు.



60 ఏళ్ల వయసులో

అందాల కిరీటం

- 'మిస్ యూనివర్స్ బ్యూనస్ ఎయిర్స్'గా ఎంపికైన అలెహాంద్రా మారిసా రోడ్రిగెజ్
- మరో టైటిల్ గెలిస్తే 'మిస్ యూనివర్స్' పోటీకి..

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనాకు చెందిన 60 ఏళ్ల అలెహాంద్రా మారిసా రోడ్రిగెజ్ సరికొత్త రికార్డు సృష్టించారు. లేటు వయసులో 'మిస్ యూనివర్స్ బ్యూనస్ ఎయిర్స్'గా కిరీటం దక్కించుకున్నారు. ఈ వయసులో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్రకెక్కారు. విశ్వ సుందరి పోటీకి అర్జెంటీనా నుంచి ప్రాతినిధ్యం వహించడానికి అడుగు దూరంలో నిలిచారు. ఈ నెల 24న జరిగిన 'మిస్ యూనివర్స్ బ్యూనస్ ఎయిర్స్' కాంపిటీషన్‌లో 35 మంది పాల్గొన్నారు. వీరిలో మారిసా విజేతగా నిలిచారు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ ప్రావిన్స్ రాజధాని లా ప్లాటాకు చెందిన మారిసా తొలుత జర్నలిస్టుగా పనిచేశారు. లా చదివి ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. వచ్చే నెలలో జరిగే 'మిస్ యూనివర్స్ అర్జెంటీనా' పోటీలో బ్యూనస్ ఎయిర్స్ నుంచి ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ఆ పోటీలో నెగ్గితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో మెక్సికోలో జరిగే 'మిస్ యూనివర్స్-2024' పోటీకి అర్జెంటీనా తరఫున హాజరవుతారు. విశ్వ సుందరి పోటీల్లో 18 ఏళ్ల నుంచి 28 ఏళ్లలోపు వయసున్నవారే పాల్గొనాలన్న నిబంధనను గత ఏడాది తొలగించారు. 18 నుంచి 73 ఏళ్లలోపు వారు మిస్ యూనివర్స్ టైటిల్ కోసం పోటీ పడొచ్చు. ఇదే ఇప్పుడు అలెహాంద్రాకు అనుకూలంగా మారింది. అదృష్టం కలిసివస్తే ఆమెకు విశ్వసుందరి కిరీటం దక్కినా దక్కొచ్చు.

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

ముగ్గురు భారతీయ మహిళలు మృతి

న్యూయార్క్: అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భారత సంతతికి చెందిన ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. గ్రీన్‌విల్లె కౌంటీలో ఇంటర్‌స్టేట్ 85 హైవేపై శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బొర్సాడ్ తాలూకా వాసులైన వీరు ప్రస్తుతం జార్జియాలోని అట్లాంటాలో నివసిస్తున్నారు. మృతులు రేఖా పటేల్, సంగీతా పటేల్, మనీషా పటేల్ ఒకే కుటుంబానికి చెందిన వారు. అత్యంత వేగంతో వెళ్తున్న వీరి ఎస్‌యూవీ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అంతే వేగంతో నాలుగు లైన్లు దాటి వంతెన మీదుగా 20 అడుగుల ఎత్తు నుంచి దూసుకెళ్లి దిగువనున్న చెట్లపై పడిపోయింది. ఈ దుర్ఘటనలో అందులోని ముగ్గురు మహిళలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బంధువైన మహిళా డ్రైవర్ మాత్రం గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు ఎస్‌యూవీ తునాతునకలైంది. వాహనం మితిమీరిన వేగంతో ప్రయాణించడానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు చెప్పారు. ఘటనకు మరే ఇతర వాహనంతోనూ సంబంధం లేదని స్పష్టం చేశారు.


హైదరాబాద్ విద్యార్థికి

16 ఏళ్ల జైలు శిక్ష

లండన్: లండన్‌లో మాజీ గర్ల్‌ఫ్రెండ్‌పై హత్యాయత్నం చేసిన హైదరాబాద్ యువకుడు శ్రీరాం అంబర్ల(23)కు కోర్టు 16 ఏళ్ల జైలు శిక్ష విధించింది. శ్రీరాంకు, కేరళకు చెందిన సోనా బిజు(23)తో హైదరాబాద్‌లోని కాలేజీలో చదువుకునే రోజుల్లో 2017 నుంచి పరిచయముంది. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండటంతో సోనా శ్రీరాంతో సంబంధం తెంచుకుంది. 2022లో ఫిబ్రవరిలో యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్‌లండన్‌లో ఇద్దరూ మాస్టర్స్ డిగ్రీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీరాం తెచ్చిన పెళ్లి ప్రతిపాదనను సోనా తిరస్కరించింది. పగ పెంచుకున్న శ్రీరాం 2022 మార్చి 5న సోనా పనిచేస్తున్న హైదరాబాద్ వాలా రెస్టారెంట్‌కు వెళ్లి వెంట తెచ్చుకున్న 10 అంగుళాల పొడవైన కత్తితో ఆమెను పొడిచాడు. నెల రోజులు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి సోనా చివరికి గెలిచింది. సీసీ టీవీ ఫుటేజీ తదితర ఆధారాలను పరిశీలించిన ఓల్డ్ బెయిలీ కోర్టు జడ్జి.. శ్రీరాంకు 16 ఏళ్ల జైలు శిక్ష, కత్తిని కలిగి ఉన్నందుకు మరో ఏడాది జైలు శిక్ష విధించారు.

కేజ్రీవాల్ సింహంలాంటి వ్యక్తి

తొలి రోడ్‌షోలో సునీతా కేజ్రీవాల్



న్యూఢిల్లీ: ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండటంతో పార్టీ ఎన్నికల ప్రచార బాధ్యతలను భుజాలకు ఎత్తుకున్న కేజ్రీవాల్ భార్య సునీత శనివారం ఢిల్లీలో తొలి లోక్‌సభ ఎన్నికల రోడ్‌షో నిర్వహించారు. ఈస్ట్ ఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌కే ఓటేయాలంటూ కుండలీ ప్రాంతంలో ఎన్నికల ప్రచార రోడ్ షోలో పాల్గొన్నారు. ఓపెన్‌టాప్ వాహనంలో నిలబడి పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు దారిపొడవునా అభివాదం చేశారు.

జైలులో ఆయనను చంపేస్తారా?

'' నెల రోజులుగా నా భర్త(కేజ్రీవాల్)ను జైలుకు పరిమితం చేశారు. ఇంతవరకు ఆయన దోషి అని ఏ కోర్టూ నిర్ధారించలేదు. కేసు విచారణ సుదీర్ఘంగా కొనసాగుతోంది. కేసు దర్యాప్తు ఇలాగే ఓ పదేళ్లపాటు కొనసాగితే అంతకాలం ఆయనను చెరసాలలోనే బంధిస్తారా? గతంలో దోషిగా తేలితేనే అరెస్ట్‌చేసి జైలులో పడేసేవాళ్లు. ఇప్పుడు ఏ నేరమూ నిర్ధారణ కాకముందే అరెస్ట్‌చేసి తీరిగ్గా దర్యాప్తు మొదలుపెడుతున్నారు. కేజ్రీవాల్ షుగర్‌తో బాధపడుతూ 12 సంవత్సరాలుగా ఇన్సులిన్ తీసుకుంటున్నారు. అలాంటి వ్యక్తికి జైలులో ఇన్సులిన్ ఇవ్వరా? చంపేస్తారా? ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ పాలనను ప్రేమిస్తారు. అది ఆయన తప్పా?'' అని మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారు. ''కేజ్రీవాల్ పాఠశాలలు నిర్మించడం, ఉచిత విద్యుత్ అందించడం, మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటుచేయడమే పాపమైపోయింది. అందుకే ఆయనను జైలులో మగ్గిపోయేలా చేస్తున్నారు. కేజ్రీవాల్ సింహంలాంటి వారు. ఆయనను ఎవ్వరూ ఏమీ చేయలేరు. సీఎం ఎవరికీ తలవంచరు'' అని అన్నారు.

సాక్షి కరీంనగర్

ఆదివారం | 28 | ఏప్రిల్ | 2024

మాటలు.. పాటలతో ఊపు



హుషారెత్తించే ఎలక్షన్ల పాటలు.. మాటల వెనుక ఎంతో కష్టం ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు కళాకారుల గొంతుకలు అన్ని పార్టీలకు పాట, మాటను అందిస్తూ ఉపాధి పొందుతున్నాయి.

- వివరాలు 8లో ▸



నగరంలోని ఎస్సారార్ మైదానంలో వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థిస్తున్న బండి సంజయ్

న్యూస్‌రీల్

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించండి



మాట్లాడుతున్న జి.తిరుపతయ్య

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్, మతోన్మాద బీజేపీని ఓడించాలని శనివారం ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా సదస్సులో తీర్మానం చేశారు. సదస్సు ప్రధానవక్త సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి ఎ.తిరుపతయ్య మాట్లాడుతూ మూడోసారి అధికారాన్ని పొందేందుకు బీజేపీ ఎన్నికలవేళ జిమ్మిక్కులు చేస్తోందని దుయ్యబట్టారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను నిర్లక్ష్యం చేసిందన్నారు. నిత్యవసర ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అతి కీలక సమస్యలను తీవ్రనిర్లక్ష్యం చేసిన బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్లను బీజేపీ తెచ్చిందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చి బీజేపీ మోసగించిందన్నారు. జన్‌ధన్ ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని మోదీ చేతులెత్తేశారని అన్నారు. కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో సీఐటీయూ శ్రేణులు ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జనగాం రాజమల్లు, గుడికందుల సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, మార్రెళ్ల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఏకాంతసేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 13రోజులుగా జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ఏకాంతసేవతో వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకుడు శేషం వంశీధరాచార్యులు ఆధ్వర్యంలో సప్తవర్ణాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, కదారి కుమారస్వామి, మోహన్, రాజయ్య, రవి, రమేశ్ పాల్గొన్నారు.

నేడూ ఆస్తిపన్ను స్వీకరణ

కరీంనగర్ కార్పొరేషన్: ఐదుశాతం రాయితీతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించే వారి కోసం ఆదివారం కూడా నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆస్తి పన్ను కౌంటర్లు తెరిచే ఉంటాయని నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు రోజైనా... కార్యాలయంలో ఆస్తిపన్ను కౌంటర్లు పనిచేస్తాయన్నారు. ఈ రాయితీకి మరో మూడు రోజులే గడువు ఉన్నందున, నగరవాసులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఆన్‌లైన్‌లోనూ చెల్లింపు చేయొచ్చని పేర్కొన్నారు.

కోచింగ్ సెంటర్లు అనుమతి తీసుకోవాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలు నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అనుమతులు ఉన్న కోచింగ్ సెంటర్లకు మాత్రమే తమ పిల్లలను పంపించాలని సూచించారు.

కులాల ఓట్లు.. నేతల పాట్లు



- పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే కీలకం
- వీటిపై అన్ని పార్టీల దృష్టి
- గంపగుత్తగా వేసుకునేందుకు ప్రణాళికలు
- సామాజిక వర్గాల వారీగా మంతనాలు
- కుల పెద్దలను సంప్రదిస్తున్న నాయకులు
- ముందస్తు హామీలు.. నజరానాలు

ఎలక్షన్ 2024

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం రోజురోజుకు ముమ్మరమవుతోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల అభ్యర్థుల ఖరారు, నామినేషన్ల ఘట్టం ముగియడంతో జిల్లాలో రాజకీయ వేడి రగులుకుంది. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అభ్యర్థులు అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కుస్తీ పడుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను సామాజిక వర్గాల వారీగా గుర్తించి ఆకట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేశారు.

ఎత్తుకు పై ఎత్తులు

ఎంపీ ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. నియోజక వర్గాల వారీగా ఉన్న మొత్తం ఓటర్లలో ఎక్కువ ప్రాబల్యం కలిగిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటూ ఆయా సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఏయే సామాజిక వర్గానికి సంబంధించి ఓట్లు ఎక్కువగా ఉన్నాయనే విషయంపై ఆరా తీస్తున్నారు. గెలుపోటములను నిర్ధారించే పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గెలుపుబాటలో పయనించాలంటే తీసుకోవాల్సిన చర్యలపై మంతనాలు ముమ్మరం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజిక వర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. ప్రతి నియోజకవర్గంలో 40 నుంచి 45 శాతం ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది. ఇప్పటికే పలు రాజకీయ పక్షాలకు అనుకూలంగా వ్యవహరించే ఓటర్లను మినహాయించి తటస్థంగా ఉన్నవారిపై దృష్టిసారిస్తున్నారు.

కులపెద్దలతో సంప్రదింపులు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో అనుచరగణం సహాయంతో సంప్రదింపులు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సామాజిక వర్గాలకు చెందిన పెద్దల ఫోన్‌నంబర్లను సేకరిస్తున్నారు. రోజూ సమయం దొరికినప్పుడు ఫోన్లలో వారిని ఆప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెనువెంటనే తొలి ప్రాధాన్యమిచ్చి పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. కాగా, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు భిన్న రూపం దాల్చడంతో ఎన్నికల సమయంలోనే సమస్యల పరిష్కారానికి పునాది రాయి పడాలనే ముందుచూపుతో అన్ని సామాజిక వర్గాలు వ్యవహరిస్తున్నాయి. పెద్దలను ముందు వరుసలో నిలబెట్టి ప్రచారానికి వచ్చే అభ్యర్థులను అది చేయాలి.. ఇది చేయాలి.. తమ ఇబ్బందులను తొలగించే వారికే ఓటేస్తామంటూ తెగేసి చెబుతున్న సందర్భాలు ఉంటున్నాయి. ప్రతీ ఎన్నికల్లో కొన్ని సామాజిక వర్గాలు అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి వర్గాన్ని గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రముఖులు కావడంతో గెలుపోటములను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మండుతున్న ఎండల్లో సైతం ప్రచార పర్వాన్ని ఉధృతం చేయడంతో పల్లెలు, పట్టణాల్లో రాజకీయాలు వేడెక్కాయి.

ఎండతో జాగ్రత్త



డీఎంహెచ్‌వో సుజాత

- వచ్చే నాలుగురోజులు మరింత పెరిగే అవకాశం
- వడదెబ్బ తగిలితే నిర్లక్ష్యం వద్దు
- వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

కరీంనగర్‌టౌన్: 'వచ్చే నాలుగు రోజులు ఎండలు మరింత పెరిగే అవకాశముంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎండలో బయటికి వెళ్లడం మంచిది కాదు. తప్పనిసరి అయితే తగు జాగ్రత్తలు పాటించాలి. ఒకవేళ ఎండదెబ్బ తగిలితే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లాలి. వైద్యుల సూచనలు తీసుకోవాలి' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. ఏప్రిల్‌లోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్న వేళ మే మాసంలో పరిస్థితి ఏంటని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో 43 డిగ్రీల కన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో నాలుగు రోజులు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

సాక్షి: ఎండల తీవ్రత ఎలా ఉంది?

డీఎంహెచ్‌వో: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గత రెండు వారాలుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. 'మే' మాసాన్ని తలపించేలా ఎండలు ప్రభావం చూపుతున్నాయి. మధ్యాహ్నం బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు.

సాక్షి: ఎవరు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది?

డీఎంహెచ్‌వో: పిల్లలు (శిశువులు, పసిబిడ్డలు), వృద్ధులు, ఎండలో అధిక శారీరక శ్రమచేసే వారు, గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారు, బీపీ ఔషధాలు, దగ్గు, జలుబు ఔషధాలు ఉపయోగించేవారిపై వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

సాక్షి: ఎండలో వెళ్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

డీఎంహెచ్‌వో: వడగాలులు వీస్తుండడంతో సాయంత్రం 7గంటల వరకు వేడి ఉంటోంది. తప్పనిసరిగా ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే రక్షణగా గొడుగు వెంట తీసుకెళ్లాలి. టవల్, టోపీలు, మహిళలైతే చీరకొంగులు తలపై చుట్టుకోవాలి. వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరినీళ్లు, మజ్జిగ, ఎక్కువగా మంచినీటిని తాగాలి.

సాక్షి: వడదెబ్బ లక్షణాలు ఏమిటి?

డీఎంహెచ్‌వో: శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, విపరీతమైన తలనొప్పి, నాడీ వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం తగ్గడం, పాక్షిక లేదా పూర్తిగా అపస్మారకస్థితిలోకి చేరుకోవడం, వాంతులు, విరోచనాలు అవడం వడదెబ్బ లక్షణాలు.

సాక్షి: ఎండదెబ్బ తగిలితే ఏం చేయాలి..?

డీఎంహెచ్‌వో: వడదెబ్బకు గురైన వ్యక్తిని నీడలోకి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన చల్లటి నీరు, కొబ్బరినీరు, నిమ్మరసం, గ్లూకోజ్ లేదా ఓఆర్ఎస్ నీటిని తాగించాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

సాక్షి: వేసవిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డీఎంహెచ్‌వో: ఇంట్లో చల్లగా ఉండేలా చూసుకోవాలి. శీతల పానియాలకు బదులు పండ్లరసాలు, మజ్జిగ తాగాలి. కొబ్బరి బోండాలు, కీరదోస, కర్బూజా వంటి పండ్లు తినాలి. రోజుకు ఐదులీటర్ల మంచినీరు తీసుకోవాలి. వదులుగా ఉండే తెల్లటివస్త్రాలు ధరించాలి. రోజుకు రెండుసార్లు స్నానం చేయాలి. పిల్లలు, వృద్ధులు ఎండలో బయటికి వెళ్లకపోవడం మంచిది.

సాక్షి: ప్రభుత్వాసుపత్రులలో చేపడుతున్న చర్యలు ఏమిటి?

డీఎంహెచ్‌వో: ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే వారికి వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ చికిత్స అందించేలా చూస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వడదెబ్బ తగిలితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకొస్తే తగిన చికిత్స అందిస్తాం.

ఫైటర్.. చీటర్స్, లూటర్స్‌కు మధ్య పోటీ

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్
- ఎస్సారార్ మైదానంలో ఎన్నికల ప్రచారం

కరీంనగర్‌టౌన్: చీటర్స్, లూటర్స్‌కు.. ప్రజల కోసం పోరాడే ఫైటర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఎన్నికలొచ్చినప్పుడు చుట్టపు చూపుగా వచ్చిపోయే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు, ప్రజల కోసం నిత్యం పోరాడే గళానికి మధ్య జరుగుతున్న పోటీలో ఎటువైపు ఉంటారో ఆలోచించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలుస్తూ బీజేపీకి ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముస్లిం ఓట్లను కొల్లగొట్టేందుకు తమది ముస్లింల పార్టీ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావే చెబుతున్నారంటే, ఎవరిది పాకిస్తాన్ జట్టో ప్రజలకు అర్థమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాన్‌లోకల్ అని ఆయన ఎందుకు పోటీ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్ఎస్‌కు మూడో స్థానమే అని, డిపాజిట్ రావడమే గొప్పఅని ఎద్దేవా చేశారు. అక్రమ సంపాదనను ఖర్చుచేసి గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పైసాతేని వ్యక్తికి ఎందుకు ఓటేయాలి?



జమ్మికుంటలో అల్పాహారం తింటున్న వినోద్‌కుమార్, కౌశిక్‌రెడ్డి తదితరులు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

జమ్మికుంట: కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లపాటు కొనసాగి, పైసా తీసుకురాని బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌కు ప్రజలు ఎందుకు ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఐదుగురు ఎంపీలతో 32పార్టీలను కలిసి తెలంగాణకు అనుకూలంగా సంతకాలు పెట్టించామని గుర్తు చేశారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ, రైల్వే లైన్, రైల్వే బ్రిడ్జిలు మంజూరు చేయించామని అన్నారు. కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా తేని బీజేపీ ఎంపీ అభ్యర్థికి ఎందుకు ఓటువేయాలో ప్రజలు ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ గారడీ మాటలు, అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందని, ఇచ్చిన హామీలు అమలుచేయడం లేదని ఆరోపించారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కేడీసీసీ వైస్‌చైర్మన్ పింగిళి రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, టంగుటూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

30న జమ్మికుంటకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ప్రణవ్‌బాబు

- బహిరంగ సభను విజయవంతం చేయండి
- పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్/జమ్మికుంట: జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 30న జరిగే కాంగ్రెస్ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారని, మధ్యాహ్నం 2గంటలకు జరిగే కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు పిలుపునిచ్చారు. హుజూరాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు ధర్మానికి– అధర్మానికి మధ్య జరుగుతున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మిగితా పార్టీల గురించి ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని, కాంగ్రెస్ 12 నుంచి 14ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. అనంతరం జమ్మికుంటకులో బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, దొంత రమేశ్, గూడూరి స్వామిరెడ్డి, వేముల పుష్పలత, పూదరి రేణుక, ఎర్ర శ్రీనివాస్, సొల్లుబాబు, రవీందర్, గూడపు సారంగపాణి, మొలుగురి సదానందం, బాలసాని రమేశ్, దేశిని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
న్యూరో & ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వ్యాధులు : మెదడులో రక్తనాళాలు బ్లాక్ అవ్వడం, కాళ్ళల్లో రక్తనాళాలు మెలిక పడటం, కాన్పు తరువాత గర్భాశయంలో అధిక రక్తస్రావం, దగ్గినపుడు రక్తం పడటం, డయాలసిస్ ఫిస్టులా బ్లాక్ అవ్వడం	డా॥ శ్రీహరిష్ వంజాయలపాటి MBBS, DNB, DM (Neuro & Interventional Radiology) MNAMS, EDiR (European diploma in radiology)	01-05-2024 1వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ అమిత్ రెడ్డి పి MBBS, PGD (Orthopedics), DNB (Orthopaedic Surgery), MNAMS (Orthopaedic Surgery)	
కండరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అన్నిరకముల ఎముకల వ్యాధులు	డా॥ బి. రాజేంద్ర వరప్రసాద్ MD, DM Rheumatology, APLAR Fellow, Former Associate Professor in Rheumatology, NIMS	02-05-2024 1వ గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
గ్యాస్ట్రో వ్యాధులు : జీర్ణకోశ, ఊబకాయం, అబ్డామినల్ క్యాన్సర్ మరియు ప్రేగులకు సంబంధించిన వ్యాధుల	డా॥ కిరణ్ పెద్ది	
కిడ్నీ వ్యాధులు : కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న, వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు	డా॥ అరుణ్ కుమార్ పొన్న MD, DM Nephrology (Osm) Fellowship in Clinical (Dialysis, Transplant) & Critical Care Nephrology	03-05-2024 1వ శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
క్యాన్సర్, హిమటాలజీ వ్యాధులు : అసాధారణ మచ్చలు, గడ్డలు, మానని పుండ్లు, రొమ్ములో నొప్పిలేని కణుతులు, దగ్గినప్పుడు రక్తం రావడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు	డా॥ రాజేష్ బొల్లం MBBS (Gold Medalist), DNB (General Medicine) DM (Medical Oncology (TMH)	
మెదడు, వెన్నెముక మరియు నరాల వ్యాధులకు: మెదడులో గడ్డలు, రక్త స్రావం, చీము గడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తల నొప్పి, పార్కిన్సన్, మరియు ఫిట్స్ వ్యాధులకు, వెన్నుపాము గడ్డలు, డిస్క్ సమస్యలు, ఫ్రాక్చర్ మరియు క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు	డా॥ కె.ఎస్. కిరణ్ MS (Gen Surgery), M.Ch (Neurosurgery) (OSM) Ex-Assistant Professor, NIMS	
రక్తనాళాల వ్యాధులు : రక్తప్రసరణ ఆగిపోవుట, పాదములు నల్లబడుట, రక్త నాళములు చిట్లి పోవుట, కాళ్ళ నరాలు ఉబ్బడం, రక్త నాళాల పునరుద్ధరణ	డా॥ దేవేందర్ సింగ్ MS, DNB (Vascular), FIVS (UK)	05-05-2024 1వ ఆదివారం ఉ॥ 10 గం॥ నుండి మ॥ 4 గం॥ వరకు
జాయింట్ రీప్లేస్‌మెంట్ : మోకాళ్ళు, తుంటి, మోచేయి, భుజం, కీళ్ళు వెన్నెముక నొప్పులు మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ మనోజ్ చక్రవర్తి MS (Ortho), M.Ch (Ortho)	

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

ప్రజల గొంతుక బీఆర్ఎస్



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కమలాకర్

కరీంనగర్: భూమి, నీరు, ఆకాశం ఉన్నంతసేపు తెలంగాణ గడ్డమీద కేసీఆర్ స్థాపించిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మర్చిపోరని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా శనివారం తీగలగుట్టపల్లెలోని తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఏర్పాటు చేసి నేటికి 23ఏళ్లు పూర్తి చేసుకున్నామని, కేసీఆర్ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. దేశమంతా పార్టీని విస్తరింపజేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, మనోభావాలు కాపాడడం కోసం బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలలోపే బీఆర్ఎస్ లేని లోటు కనిపిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో 'ఆకారపు' దీక్ష



ఎండలో దీక్ష చేస్తున్న ఆకారాపు భాస్కర్‌రెడ్డి

- బీజేపీ నేతల వ్యాఖ్యలకు నిరసన
- సొమ్మసిల్లి పడిపోవడంతో ఆందోళన

కరీంనగర్ కార్పొరేషన్: ప్రధాని నరేంద్ర మోదీ, ఎంపీ బండి సంజయ్‌లు మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి వినూత్న తరహాలో నిరసన దీక్ష చేపట్టారు. శనివారం డీసీసీ కార్యాలయం ఎదుట మండుటెండలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు దీక్ష కొనసాగించారు. ఈ క్రమంలో ఎండదెబ్బ తగిలి సొమ్మసిల్లిపోవడంతో పార్టీశ్రేణులు ప్రాథమిక చికిత్స అందించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల మంగళ సూత్రాలను కూడా ముస్లింలకు పంచుతారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు, ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా భాస్కర్‌రెడ్డి నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఒక ప్రధానిస్థాయిలో ఇంతగా దిగజారి మాట్లాడే నేతలు మోదీ తప్ప ఎవరూ ఉండరని ఈ సందర్భంగా ఆకారపు భాస్కర్‌రెడ్డి అన్నారు. దేశం కోసం సోనియా గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేశారని, అలాంటి మహిళపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సంజయ్‌కి తగదన్నారు. అనంతరం డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. నాయకులు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, మేనేని రోహిత్‌రావు, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షణికావేశం.. ప్రాణం తీసింది

- తమ్ముడిని హత్య చేసిన అన్న


వెంకటేశ్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: అన్నదమ్ముల మధ్య గొడవ తమ్ముడి ప్రాణం తీసింది. క్షణికావేశంలో ఓ వ్యక్తి తన తమ్ముడిని హత్య చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన కాల్వ రాయమల్లు–బాలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు. పెద్ద కొడుకు శ్రీనివాస్ హమాలీ పని చేస్తుండగా చిన్న కొడుకు వెంకటేశ్(28) ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. నిత్యం మద్యం తాగొచ్చి, తల్లిదండ్రులు, అన్నతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సోదరుల మధ్య వివాదం నెలకొంది. మాటామాట పెరగడంతో శ్రీనివాస్ క్షణికావేశంలో కత్తితో వెంకటేశ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఈ విషయాన్ని దాచేందుకు ప్రయత్నించగా స్థానికులు రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. కరీంనగర్ రూరల్ ఎస్సై శేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాజన్న సేవలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి



వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమి, తహసీల్దార్ మహేశ్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు ఉన్నారు. అలాగే, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాజన్నను దర్శించుకున్నారు.

కారు ఢీకొని జింక మృతి



కథలాపూర్(వేములవాడ): కారు ఢీకొన్న ఘటనలో ఓ జింక మృతిచెందింది. అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం.. కోరుట్ల–వేములవాడ దారిలో కథలాపూర్ మండలం దుంపేట శివారు వరద కాలువ వద్ద శనివారం ఉదయం జింక రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో కోరుట్ల నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింక తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అటవీశాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కథలాపూర్ పశు వైద్యశాలలో పశువైద్యాధికారి దివ్యశ్రీ జింక కళేబరానికి పోస్టుమార్టం చేశారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి


చిన్నరాజం మృతదేహం

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్‌కు చెందిన శనిగరపు చిన్నరాజం(60) చెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నరాజం శనివారం చింత చెట్టు ఎక్కాడు. చింతకాయలు దులుపుతుండగా కాలు జారి, కిందపడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాటలు, పాటలతో ఊపు

- ఎన్నిక ఏదైనా ప్రచారంలో ఉమ్మడి జిల్లా కళాకారులదే హవా
- రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు
- మిద్దె రాములు ఒగ్గుకథతో మొదలై, నేడు ఎందరికో ఉపాధి


ఒగ్గు కథ చెప్పుతున్న మిద్దె రాములు (ఫైల్)


స్టూడియోలో ఎన్నికల పాట రికార్డింగ్

విద్యానగర్(కరీంనగర్): మన యాసకు, భాషకు ప్రత్యేకత ఉంది. ఇవే ఎన్నికల ప్రచారానికి జీవం పోస్తున్నాయి. ఓ లచ్చక్కా... మళ్లీ ఎలచ్చన్లు వచ్చినాయే.. పార్టీలోళ్లు అన్నీ ఇత్తామని, ఓటేయ్యమని ఇంటింటికీ వత్తున్నరే అంటూ ఒక పల్లె మునలవ్వ గొంతు ఓ పార్టీ ప్రచారంలో వినిపిస్తే.. జెండలమ్మ జెండాలు అంటూ మరో గొంతు మైక్‌లో అదరగొడుతోంది. ఇటువంటి గొంతుకలు అన్ని పార్టీలకు పాట, మాటను అందిస్తూ తద్వారా ఉపాధి పొందుతున్నాయి. విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా, ఆలోచించుకునేలా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా కళాకారులకు ఇక్కడే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు, ఆదరణ లభిస్తోంది.

1978 అసెంబ్లీ ఎన్నికల నుంచి..

జాతీయ కాంగ్రెస్‌ను వీడి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత 1978లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కరీంనగర్ నుంచి ఇందిరా కాంగ్రెస్ తరఫున నలుమాచు కొండయ్య బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో తొలిసారి సభకు వచ్చే జనాలను కట్టిపడేసేందుకు స్టేజీలపై జన గొంతుకకు ప్రాధాన్యం ఇచ్చారు. మిద్దె రాములు పచ్చ పచ్చ గట్ల మీద నడిచినావే ఇందిరమ్మ.. మా ఓటు నీకే ఇత్తుమే ఇందిరమ్మ అంటూ.. నియోజకవర్గ పరిధిలో ఒగ్గుకథ ప్రదర్శనలు ఇచ్చారు. అలా ప్రారంభమైన జానపద ప్రచార సరళి ఆ తర్వాత కొత్త పుంతలు తొక్కుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనం పాటల గొంతుకలు ఎన్నికల సమయాల్లో ఆయా పార్టీల ప్రచారానికి ఊపు తీసుకువస్తున్నాయి.

3 ప్రధాన పార్టీలదీ ఇదే దారి..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీల జెండలే రామక్కా.. అంటూ బీఆర్‌ఎస్ పార్టీ, గుండె గుండె కొలువు మన కమలం పువ్వు.. గుడిసే గుడిసే నెలవు మన కమలం పువ్వు అంటూ బీజేపీ ప్రచారం చేశాయి. ఇంద్రవెల్లి కొండల్లో దండు పుట్టింది.. అంటూ జన గొంతుకలతో జానపద బాణీల్లో ప్రచారం సాగించిన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోరాటమన్నది కొత్తకాదే ఓ తల్లి లచ్చువమ్మ.. బాపు ఆరాటపడకుంటే రాష్ట్రమేదే నా తల్లి లచ్చువమ్మ అంటూ బీఆర్‌ఎస్, జై జై జెజ్జనక జాతర.. వెయ్ వెయ్ బండి సంజయన్న గెలుపు దండోరా మోగేలా, మళ్లీ కావాలి మన దేశానికి మోదీ.. తప్పక గెలవాలి కరీంనగర్‌లో బండి అంటూ బీజేపీ ప్రచారం సాగిస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోని మూడు రంగుల జెండా పట్టి సింగమోలే కదిలినాడు మన రేవంతన్న అనే పాటనే ప్రచారంలో వినియోగిస్తున్నారు.

జన గొంతుకలు..

కరీంనగర్‌లో జి.ప్రభు రికార్డింగ్ స్టూడియోతోపాటు కీబోర్డు వాయిద్యకారులుగా, ముమ్మాడి బ్రహ్మాచారి ఎంబీఏ పేరుతో రికార్డింగ్ స్టూడియో, జీఎం రికార్డింగ్ స్టూడియో, రత్నం స్టూడియో, కేబీ శర్మ గాయకుడిగా, కీబోర్డు వాయిద్యాకారుడిగా రాణిస్తూనే రికార్డింగ్ స్టూడియో నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన బుర్ర సతీశ్, గుండేటి రమేశ్, కందుకూరి శంకర్‌బాబు, గజ్జెల వినోద, సల్వాజీ సంధ్య, భవాని, జ్యోతి, మడుపు శ్రీనివాస్, తిప్పర్తి ప్రభు, హుస్నాబాద్‌కు చెందిన రాంసాగర్ లక్ష్మణ్, నక్క శ్రీకాంత్ తదితరులు ఈ రంగంలో రాణిస్తున్నారు.

2011లో తొలి ఎన్నికల పాట



కీబోర్డు ఆర్టిస్ట్‌గా, సౌండ్ ఇంజినీర్‌గా, రికార్డింగ్ స్టూడియో ద్వారా ఈ రంగంలోకి వచ్చి, 18 ఏళ్లు అవుతోంది. 2011లో తొలి ఎన్నికల పాట రికార్డు చేశాను. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పటివరకు 60 పాటలు రికార్డు చేశాను.– జి.ప్రభు, కీబోర్డు ఆర్టిస్ట్, జి.స్టూడియోస్, మైత్రినగర్, రేకుర్తి, కరీంనగర్

500 వరకు రాసి, పాడిన



దాదాపు 500 పాటలు రాసి, పాడిన. 2004లో మొదటిసారి విద్యాసాగర్‌రావుకు పార్లమెంట్ ఎన్నికల్లో నాగారంలో పుట్టిన సాగర్ జీ అంటూ రాసి, పాడాను. ప్రస్తుతం ప్రజా సైన్యమై కదిలిన మోదీని ఆపేదెవడు అంటూ బీజేపీకి పాట రాసి, పాడిన. – గుండేటి రమేశ్, పాటల రచయిత, గాయకుడు, కరీంనగర్

అనేక పార్టీలకు నా మాట



ఎన్నికల ప్రచార పాటల్లో అభ్యర్థులకు ఓటు వేయాలనే స్లోగన్స్ చెప్పాను. కార్పొరేషన్ మొదలుకొని పార్లమెంట్ ఎన్నికల వరకు అనేక పార్టీలకు నా మాట అందించాను.

– రాధిక, షార్ట్ ఫిల్మ్ యాక్టర్, కరీంనగర్

అన్ని పార్టీలకు పాడాను



నేను 15 ఏళ్లుగా జానపద పాటలు పాడుతున్నాను. తెలంగాణ, ఆంధ్రలోని అన్ని రాజకీయ పార్టీలకు పాడాను. జైజై ఈటల రాజేందరన్న అనే పాట ఎక్కువ పేరు తెచ్చింది.
– సల్వాజీ సంధ్య, గాయని, కరీంనగర్

ఉద్యమ సమయంలో గుర్తింపు



రాష్ట్ర ఉద్యమ సమయంలో భగభగమంటున్న తెలంగాణ పాటతో నాకు గుర్తింపు వచ్చింది. రాష్ట్రం వచ్చాక సుద్దాల అశోక్ తేజ ప్రోద్బలంతో తొలిసారి కెప్టెన్ లక్ష్మీకాంతారావుకు ఎన్నికల పాట పాడిన.
– గజ్జెల వినోద,గాయని,నగునూర్, కరీంనగర్

వేలాది పాటలు



జానపద గాయకుడిగా 1998 నుంచి ఇప్పటివరకు వేలాది పాటలు పాడిన. ప్రతీ ఎన్నికల్లో అన్ని పార్టీలకు నా పాట ఉంటుంది. – బుర్ర సతీశ్, జానపద గాయకుడు, కరీంనగర్

ప్రచారం కోసం స్లోగన్స్



2019 నుంచి ఏదో ఒక పార్టీకి ప్రచార స్లోగన్స్ ఇస్తున్నాను. అసెంబ్లీ, పార్లమెంట్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఇలా అన్ని ఎన్నికలకు పని చేస్తున్నాను. – భవాని, లఘుచిత్రాల నటి, తీగలగుట్టపల్లి, కరీంనగర్

రాజన్న సిరిసిల్ల జిల్లావాసులు..

సిరిసిల్ల టౌన్: ఎన్నికల ప్రచారంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సాంబారి రాజు, షేక్ ఖాజా తమ మాటతో ఆకట్టుకుంటున్నారు. సాంబారి కిరణ్ స్క్రిప్ట్ రైటర్‌గా, ఎండీ.సలీం ప్రచార ప్రకటనల్లో రాణిస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన సాంబారి నవీన్, కాయితోజు ప్రవీణ్, నాందేవ్, లావణ్య ఈ రంగంలో తమ ప్రతిభ చాటుతున్నారు.

వ్యాఖ్యాతగా సలీం అరంగేట్రం..

సిరిసిల్లకు చెందిన ఎండీ.సలీం 1974 నుంచి ప్రకటనల వ్యాఖ్యాతగా ఉంటున్నాడు. ఇతని గళం క్రమంగా జాతీయ స్థాయిలో వ్యాపార ప్రకటనలకు అరువిచ్చే స్థాయికి చేరింది. ఇందిరాగాంధీ నుంచి నేటి కేసీఆర్, కేటీఆర్, నర్సింగరావు, గొట్టి భూపతి తదితరులు.. నాయకులు ఎవరైనా, ఎన్నికలు ఎక్కడ జరిగినా సలీం స్వరం ప్రచారాస్త్రమైంది. హిందీ, ఉర్దూ, మరాఠీ భాషలు మాట్లాడే ప్రాంతాలకూ పరిచయమైంది. 1988లో ఆకాశవాణిలో 25 నిమిషాల ప్రత్యక్ష వ్యాఖ్యానంతో అలరించాడు. 1989లో స్వర్గీయ ఘంటసాల ఆలపించిన పాటలకు తన గొంతుతో వ్యాఖ్యానాన్ని ఇచ్చి, సిరిసిల్ల గడ్డ కీర్తిని పెంచారు. చాలా ఏళ్లు న్యూస్ రీడర్‌గానూ రాణించాడు. 1999లో దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ ఆయనను సన్మానించడం విశేషం.

గురువు స్ఫూర్తితో రాజు..

సిరిసిల్ల నేత కుటుంబానికి చెందిన సాంబారి రాజు గురువు సలీం స్ఫూర్తితో వ్యాఖ్యాత వృత్తినే ఎంచుకున్నాడు. చదివింది ఆరోతరగతి. ఉపాధి కోసం తన బాబాయ్ ప్రదీప్ ఆర్కెస్ట్రాలో చేరాడు. 15 ఏళ్ల క్రితం డబ్బింగ్ కళాకారుడుగా కెరీర్ ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, ప్రస్తుతం వ్యాపార ప్రకటనలతోపాటు ఎన్నికల ప్రచారానికి తన స్వరాన్ని అరువు ఇస్తున్నాడు. 20 ఏళ్లుగా 20 వేలకు పైగా వ్యాపార, ఎన్నికల ప్రకటనలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందాడు. మరో పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదిగాడు. కేసీఆర్, కేటీఆర్, ఈటల రాజేందర్, సుంకె రవిశంకర్, గంప గోవర్ధన్, షబ్బీర్ అలీలకు ప్రకటనలు చేసి, ఆకట్టుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ, జనసేన, టీడీపీలకు వ్యాఖ్యాతగా ఉన్నాడు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్డర్లతో బిజీగా ఉంటున్నాడు.

శ్రోతల ఆశీస్సులే బలం



ఐదు దశాబ్దాలుగా నా ప్రకటనలు వింటూ ఇస్తున్న శ్రోతల ఆశీస్సులే నాకు బలం. నా గొంతును ఎన్నికలు, వ్యాపార, వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వినిపిస్తున్నాను. ఎంతో మంది అభిమానాన్ని పొందిన నాకు రాజు, స్వాతి, శారద, రాజు, సురేశ్ ఇష్టమైన శిష్యులు. వారు కూడా ఇదే రంగంలో రాణిస్తుండటం సంతోషంగా ఉంది.
ఎండీ.సలీం

అన్ని భాషల యాసల్లో..



తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర భాషల యాసల్లోనూ వారు కోరినట్లు ప్రకటనలు చేస్తున్నాను. ఇందుకోసం లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్ వినియోగిస్తున్నాను. గురువుగారు సలీ సిరిసిల్లకు వరం. ఆయన స్ఫూర్తితో వ్యాఖ్యానంలో గుర్తింపు పొందాను. దేశంలో ఎక్కడికి వెళ్లినామన తెలుగు వాణి వినిపించాలి.
సాంబారి రాజు

గల్ఫ్ నకిలీ ఏజెంట్ల ముఠా గుట్టురట్టు

- సిరిసిల్ల యువకుడితో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు
- పని పేరిట అమాయకులను మోసం చేస్తున్న ముఠా
- ఎస్పీ అఖిల్ మహాజన్


నకిలీ ఏజెంట్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే యువకుల అవసరాలను ఆసరాగా చేసుకుని దేశవ్యాప్త సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును సిరిసిల్ల పోలీసులు రట్టు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన యువకుడితో సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలోని సభ్యుడు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్‌ను జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ముఠాలోని మిగతా సభ్యులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన సదాకత్, దుబాయికి చెందిన షాదాబ్‌లకు లుకౌట్ నోటీసులు, మహారాష్ట్రలోని పుణేకు చెందిన అబిద్ అన్సారీకి నోటీసులు జారీ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాలు. నాలుగు రోజుల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి ఠాణాకు వచ్చి తన కొడుకు అతికం శివప్రసాద్ జగిత్యాలకు చెందిన గల్ఫ్ ఏజెంట్ కంచర్ల సాయిప్రసాద్‌కు రూ.1.40 లక్షల చెల్లించి కంబోడియా దేశానికి వెళ్లాడని, అక్కడ ఇబ్బంది పడుతున్నాడని ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు శివప్రసాద్‌తో వాట్సాప్ నంబర్‌లో మాట్లాడగా.. వారి ముఠా చేయిస్తున్న సైబర్ నేరాలను పోలీసులకు తెలిపారు. కంబోడియాలో చైనీస్ కంపెనీకి సంబంధించిన కొంతమంది వ్యక్తులు ఇండియాకు చెందిన 500 నుంచి 600 మంది పాస్‌పోర్టులు తీసుకొని అక్కడి నుంచే కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించాడు. ఇండియాలో ఉన్న సదరు వ్యక్తులకు ఫోన్‌చేసి సైబర్ నేరాలు చేయిస్తున్నారని వివరించాడు. దీంతో సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఇండియన్ ఎంబసీని సంప్రదించగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, దుబాయికి చెందిన ముగ్గురు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వెంటనే జగిత్యాలకు చెందిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ కంచర్ల సాయిప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. తను రూ.10వేల కమీషన్ తీసుకొని మాల్దీవులలో ఉంటున్న లక్నోకు చెందిన సదాకత్‌కు పంపిస్తానని, అతను రూ.10వేల కమీషన్ తీసుకొని పుణేలోని అబిద్ అన్సారీకి పంపిస్తాడని వివరించారు. వీరి వెనుక ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న షాదాబ్‌కు పంపగా.. ఆయన కంబోడియా దేశానికి పంపుతాడని తెలిపారు. కంచర్ల సాయిప్రసాద్ అదుపులోకి తీసుకున్నామని, మిగతావారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ సహాయంతో ఈ కేసును చేధించినట్లు వివరించారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లే యువకులు లైసెన్స్ ఉన్న ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో ఎవరైతే ఏజెన్సీల లేదా ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారి కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ను 87126 56411లో ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్



పట్టుబడిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

- రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

గంగాధర(చొప్పదండి): గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు కరీంనగర్ జిల్లా గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శివారపు సురేశ్‌బాబు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ తిరుపతి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కొక్కుల రాజేశంకు కరీంనగర్‌లోని రేకుర్తిలో సర్వే నంబర్ 131లో 10 గుంటల భూమి ఉంది. అందులో 4 గుంటలను తన కుమారుడు అజయ్‌కుమార్‌కు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి గంగాధరలోని డాక్యుమెంట్ రైటర్ ఆకుల ఆంజనేయులును సంప్రదించాడు. రిజిస్ట్రేషన్‌కు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రూ.10 వేలు డిమాండ్ చేశారు. బతిమిలాడినా వినకపోవడంతో రాజేశం, ఆంజనేయులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన ప్రకారం లంచం ఇవ్వడానికి ఒప్పుకొని, అంజయ్య డబ్బులతో శనివారం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లాడు. ఆయన ఆఫీస్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్‌కు ఇవ్వాలని సూచించారు. నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 91543 88954 నంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్పీ సూచించారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో సోదాలు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ మంకమ్మతోటలోని గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సురేశ్‌బాబు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.12.30 లక్షలు, 350 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మనోళ్లు.. విద్యావంతులు, శ్రీమంతులు

- ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టభద్రులు, కోటీశ్వరులే..

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల వివరాలు

అభ్యర్థి	వయసు	విద్యార్హత	ఆస్తి (రూ.కోట్లలో)
వి.రాజేందర్‌రావు	62	బీఏ	26.58
బండి సంజయ్	52	ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)	1.12
బి.వినోద్‌కుమార్	64	బీఎస్సీ, ఎల్ఎల్‌బీ	13.91
జీవన్‌రెడ్డి	72	బీఏ, ఎల్ఎల్‌బీ	3.55
ధర్మపురి అర్వింద్	47	ఎంఏ (పొలిటికల్ సైన్స్)	109.90
బాజిరెడ్డి గోవర్ధన్	69	బీఏ	4.61
గడ్డం వంశీకృష్ణ	35	బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్	24.09
గోమాసె శ్రీనివాస్	56	ఎంఏ (పొలిటికల్ సైన్స్)	23.22
కొప్పుల ఈశ్వర్	64	బీఏ	5.22


రాజేందర్‌రావు

సంజయ్

వినోద్‌కుమార్

జీవన్‌రెడ్డి

అర్వింద్

గోవర్ధన్

వంశీకృష్ణ

శ్రీనివాస్

ఈశ్వర్

సాక్షి, పెద్దపల్లి: ఒకప్పుడు ఎన్నిక లంటే చాలామంది అత్తెసరు చదువులతో బరిలో దిగేవారు. కొందరైతే నిరక్షరాస్యులంటే అతిశయోక్తి కాదు. కానీ, కాలం మారింది. ఉద్యోగం కోసమే చదువు కాదు.. సమాజహితమే లక్ష్యంగా ఉన్నత విద్యావంతులు కూడా రాజకీయాలపై దృష్టిసారిస్తున్నారు. దీంతో ప్రతీ ఎన్నికల్లో పోటీచేసే విద్యాధికుల శాతం పెరుగుతోంది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎక్కువమంది పట్టభద్రులే ఉండగా, వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కోటీశ్వరులు కావడం గమనార్హం.

తక్కువ వయసు వంశీకృష్ణదే..

కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థుల్లో గడ్డం వంశీకృష్ణ (35)దే తక్కువ వయసు. 72 ఏళ్లతో అందరి కంటే సీనియర్‌గా జీవన్‌రెడ్డి ఉన్నారు. అలాగే, ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి బంగారం, వినోద్‌కుమార్‌కు స్థిరాస్తులు లేవు. కొప్పుల ఈశ్వర్‌పై కేసులు, గడ్డం వంశీకృష్ణ సొంత కారు లేవు. బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌కు రూ.64 లక్షల ఇంటి లోన్ ఉంది. అగ్రికల్చర్ ల్యాండ్ లేదు. రూ.19.17 కోట్ల బ్యాంకు అప్పు ఉంది. జీవన్‌రెడ్డికి 35 ఎకరాల సాగు భూమి, 4 కేసులు ఉన్నాయి. బాజిరెడ్డి గోవర్ధన్‌కు 50 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. మొత్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో రూ.1.12 కోట్లతో బండి సంజయ్ అతి తక్కువ, నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ 109.90 కోట్లతో ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా


ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మెడికో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ కంపెనీ శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. సుమారు 100 మంది హాజరుకాగా, 14 మంది ట్రెయినీ ఇన్ రెవెన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ అసోసియేట్‌గా ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన భాషా నైపుణ్యం, అర్థమెటిక్, రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండటం వల్లే విద్యార్థినులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని అభినందించారు. కంపెనీ ప్రతినిధులు సచిన్, అభిలాష్, నవీన్‌రెడ్డి, ఇందర్‌దీప్ సింగ్‌లతో కలిసి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న ద్విచక్రవాహనం

- రైతు పరిస్థితి విషమం
- 10 రోజుల్లో రెండు ప్రమాదాలు


గాయపడిన రాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొని, ఓ రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి నుంచి రాజన్నపేట వరకు రోడ్డుపై రైతులు వరి ధాన్యం ఆరబెడుతూ, కుప్పగా చేస్తున్నారు. దీంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి రాజన్నపేటకు చెందిన ఎర్పుల రాములు అనే రైతు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. చీకట్లో కనిపించక ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పది రోజుల క్రితం ఇలాగే గాయపడిన సుబ్బారావు కోమాలోకి వెళ్లగా.. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై ధాన్యం పోయకుండా చూడాలని కోరుతున్నారు.

రైతుపై క్రిమినల్ కేసు

రాజన్నపేట శివారులో రోడ్డుపై వరి ధాన్యం ఆరబెట్టి, ప్రమాదానికి కారణమైన రైతు కిష్టునాయక్ తండాకు చెందిన భూక్య నరేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రోడ్లపై ఎవరైనా ధాన్యం పోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడూరుకు చెందిన చెక్కపల్లి నర్సింలు(47) లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, భార్య రేణుకతో తరచూ గొడవ పడేవాడు. దీంతో నెల రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అతిగా మద్యం సేవించిన నర్సింలు నాలుగు రోజుల క్రితం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. శనివారం అతని ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా నర్సింలు ఆత్మహత్య చేసుకున్న విషయం బయటపడింది. మృతదేహానికి స్థానికంగానే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నర్సింలుకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు భరత్ దుబాయ్‌లో ఉండగా తండ్రి మరణవార్త తెలుసుకొని, స్వగ్రామానికి బయల్దేరినట్లు బంధువులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

బిల్డింగ్ అమ్మబడును

■ KNR, కోతిరాంపూర్ Govt స్కూల్ దగ్గర 40ft రోడ్డుకు S/E ఫేసింగ్‌తో 2సెటర్స్, 4రూములతో కలిపి బ్యాంక్ లోన్‌తో 214Sq యార్డ్స్ గల కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. సంప్ర॥ 9008683483/ 9032740752 [K-1185981]

PLOT FOR SALE

■ ప్లాట్స్ @ మంచిర్యాల 28న లాంచింగ్ ఆఫర్ Rs. 5999/- Per Sq.yd. & గోల్డ్ కాయిన్, నియర్ హైవే & కాలేజెస్, గేట్ & సెక్యూరిటీతో. Cont: 9951632516 [H-799840]

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 /8977639663 [H-799874]

■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ పెద్దపల్లి బ్రాంచ్‌లో డెవలప్మెంట్ (సేల్స్) మేనేజర్స్ కావలెను. జీతం: నెలకు రూ॥ 20,000/- పైబడి (అనుభవం ఆధారంగా) + ఇన్సెంటివ్స్. అర్హత: ఏదైనా డిగ్రీతో పాటు కనీసం 1సం॥ అనుభవం తప్పనిసరి. సంప్ర॥ సెల్: 8096633777 [K-1185995]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

మోడల్ ఈఏపీసెట్‌కు స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన మోడల్ ఈఏపీసెట్ పరీక్షకు స్పందన వచ్చిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 19 ఏళ్లుగా మోడల్ ఈఏపీసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిప్పారపు రోహిత్, ఆసంపల్లి వినయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఇషాక్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, రాజేందర్, నాయకులు రాకేశ్, సందీప్, మనోజ్, శివ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



బ్రెడ్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన పాదం రాజేశ్వరీ, సబ్బని లక్ష్మి, సాలవ్వ, ఐలవ్వకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. రోగులకు హంగర్ రిలీఫ్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ చైర్‌పర్సన్ చింతల కిషన్ పటేల్ పాలు, బ్రెడ్లు అందజేశారు. ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్, ట్రస్టు బోర్డు సభ్యుడు కోల అన్నారెడ్డిల సహకారంతో ఇప్పటివరకు 103 ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు కిషన్ తెలిపారు. ఉచిత ఆపరేషన్లకు సహకరించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ డివిజన్ అధ్యక్షుల నియామకం



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పలు డివిజన్‌లకు కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులను నియమించారు. 5వ డివిజన్ అధ్యక్షుడిగా సిరాజ్, 6వ డివిజన్ అధ్యక్షుడిగా ఆరిఫ్‌ఖాన్, 29వ డివిజన్ అధ్యక్షుడిగా మతిన్ హుస్సేన్, 40వ డివిజన్ అధ్యక్షుడిగా తన్వీర్ హుస్సేన్ నియమితలయ్యారు. అలాగే మైనార్టీ సెల్ నగర ఉపాధ్యక్షుడిగా ఆసిఫ్, కార్యదర్శిగా సలీం హుస్సేన్‌లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు హైమద్ అలీ తెలిపారు.

29న కార్నర్ మీటింగ్ విజయవంతం చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ఈనెల 29న నిర్వహించే కార్నర్ మీటింగ్ విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ఆరెపల్లి మోహన్ అన్నారు. నగరంలోని 10, 11, 12, 12, 35, 59 డివిజన్‌లకు సంబంధించి కార్పొరేటర్‌గా పోటీచేసిన నాయకులు, డివిజన్ ఇన్‌చార్జీలు, ముఖ్యనాయకులతో శనివారం డీసీసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో ఆయా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి '

కరీంనగర్‌కల్చరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన ఎండలు కొడుతున్నా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలనే ఆలోచన తప్ప వారికి పని వద్ద నీడ, మంచినీటి వసతి కల్పించడం లేదని తెలిపారు. ఉపాధి కూలీలకు మార్చి నెలలో 30 శాతం, ఏప్రిల్ నెలలో 35 శాతం, మే నెలలో 40శాతం సమ్మర్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తపల్లి: ఎలగందుల పంచాయతీ పరిధి 1168/1 సర్వే నంబర్‌లోని వ్యవసాయ బావిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, నలుపు రంగు ప్యాంటు వేసుకున్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

మైదానాల్లో క్రికెట్ జోష్

- సెలవుల్లో సందడిగా క్రికెట్
- నగరంలో కిక్కిరిసిపోతున్న మైదానాలు
- ఎంజాయ్ చేస్తున్న కుర్రకారు, చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్: వేసవి కాలం సందడి మొదలైంది.. ఎండలు ముదురుతున్నా తగ్గేదేలే అంటూ పిల్లలు తెల్లవారి లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు టీవీ, మొబైల్స్, ఆటలు, పాటలతో సందడి చేస్తున్నారు. ఇక మైదానాల సంగతి చెప్పనక్కరలేదు. ముగ్గురు నలుగురు కలిస్తే చాలూ క్రికెట్ క్రికెట్ అంటూ బ్యాట్, బాల్ పట్టుకోవడం గ్రౌండ్‌కు వెళ్లడం.. అక్కడ బండ రాళ్లను వికెట్లుగా పెట్టి క్రికెట్ ఆడటం కనిపిస్తోంది. దీంతో నగరంలోని మైదానాలు చిన్నారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఓవైపు ఐపీఎల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతుండటంతో క్రికెట్‌కు మరింత క్రేజీ పెరిగింది. మైదానాల్లో ఆడుతున్న పలువురు చిన్నారులను ఐపీఎల్ మ్యాచ్‌ల తీరుపై 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో క్రికెట్ ఆడేందుకు వచ్చిన చిన్నారులు



బండరాళ్లను వికెట్లుగా పెట్టి క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

హాలీడేస్‌లో ఎంజాయ్ చేస్తున్నాం



సన్ రైజర్స్ టీం అంటే చాలా ఇష్టం. రైజర్స్ ఆడే ప్రతీ మ్యాచ్ తప్పకుండా చూస్తా. క్రికెట్ అంటే చాలా ఇష్టం. బౌలింగ్ నేను బాగా చేస్తా. కమిన్స్ క్రికెటర్ అంటే ఇష్టం. ఫ్రెండ్స్ అందరం కలిసి రోజు వస్తున్నాం. హాలీడేస్‌లో క్రికెట్ ఎంజాయ్ చేస్తున్నాం. – రిషిక్

రోజూ క్రికెట్ ఆడుతాం



ఐపీఎల్‌లో ఎక్కువ సార్లు చాంపియన్‌గా నిలిచింది ముంబాయ్ ఇండియన్స్ జట్టే. నా ఫేవరేట్ టీం ముంబాయ్. రోహిత్ శర్మ కెప్టెన్సీ చాలా బాగుంటుంది. తను కూడా చాలా బాగా ఆడుతాడు. నా ఇష్టమైన క్రికెటర్ కూడా తనే. ఫ్రెండ్స్ అందరం కలిసి రోజు క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేస్తాం. – కృష్ణ

క్రికెట్ అంటే ఇష్టం



క్రికెట్ అంటే చాలా ఇష్టం. స్కూల్ హాలీడేస్ వచ్చి దంటే చాలు క్రికెట్ ఆడేస్తాం. ఇక సమ్మర్ హాలీడేస్ అయితే స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తాం. మంచి క్రికెటర్ కావాలని ఉంది. బ్యాటింగ్ బాగా చేస్తాను. బండ రాళ్లను స్టంప్స్‌గా పెట్టి క్రికెట్ ఆడుతుంటే థ్రిల్లింగ్‌గా ఉంటుంది. – సుజయ్

ఫేవరేట్ గేమ్



ఐపీఎల్‌లో ఈసారి ఆర్సీబీ జట్టు చాలా బాగుంది. అందరూ చాలా బాగా ఆడుతున్నారు. నాకు విరాట్ కోహ్లి అంటే ఇష్టం. మా ఫ్రెండ్స్ అందరికీ కూడా ఇష్టమే. సమ్మర్ హాలీడేస్‌లో క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేస్తాం. నా ఫేవరేట్ గేమ్ క్రికెట్. – అనీష్

ధోనిలా ఆడాలని ఉంది



మహేంద్ర సింగ్ ధోని వరల్డ్ నంబర్ వన్ క్రికెటర్. ధోని ఆడుతున్నంత సేపు చూడాలనిపిస్తుంది. అతనిలా నేను కూడా ఆడాలని ఉంది. సీఎస్కె టీం చాలా బాగా ఆడుతుంది. ఐపీఎల్‌లో ఆ జట్టే ఫేవరేట్. రోజూ ఉదయం, సాయంత్రం స్టేడియంకు వచ్చి క్రికెట్ ఆడుతున్నాం. – ఎస్కె. అజాన్

విరాట్‌లా ఎదగాలని..



విరాట్ కోహ్లిని ఇష్టపడని వారెవరు ఉండరు. నా ఫేవరేట్ క్రికెటర్ కూడా కోహ్లినే. క్రికెట్‌లో కోహ్లి రికార్డ్‌ను ఎవరకు దాటలేరు. ఆర్‌సీబీ జట్టు కూడా నా ఫేవరెట్. విరాట్ కోహ్లిలా క్రికెట్‌లో నేను కూడా ఎదగాలని ఉంది. ఈసారి ఐపీఎల్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగుతున్నాయి. – లోకేశ్

పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక వినోద్ కుమార్

కరీంనగర్: ప్రజాసమస్యలపై అవగాహన ఉన్న బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అవుతాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం గంగుల కమలాకర్ నివాసంలో కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలిస్తే నిత్యం అందుబాటులో ఉంటాడని, కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తీసుకొచ్చే సత్తా వినోద్ కుమార్‌కు ఉందన్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ప్రజలు గోస పడుతున్నారని, బీజేపీకి ఓటేస్తే ప్రజలు ఆగమవుతారని హెచ్చరించారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ప్రజలకు చేసిందేమీ లేదని, కేవలం మతాల పేరిట యువతను రెచ్చగొట్టడం తప్పితే కనీసం ఐదు రూపాయల పని చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీతో కరీంనగర్‌కు ఒరిగేదేమీ లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 11కేవీ మంకమ్మతోట, తెలంగాణచౌక్ ఫీడర్ల పరిధిలోని మంకమ్మతోట, కాశ్మీర్‌గడ్డ, ముకరంపుర, భగత్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బోర్ల మరమ్మతులో అవినీతి

- పాతపైపుల రంధ్రాలకు చుడుతున్న ట్యూబులు
- దుర్శేడ్‌లో వివాదాస్పదమైన మరమ్మతు వ్యవహారం



పాతపైపు రంధ్రానికి ట్యూబు చుడుతున్న మెకానిక్‌లు

కరీంనగర్‌రూరల్: హ్యాండ్‌బోర్ల మరమ్మతు పనులు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పాతపైపులకు రంధ్రాలు పడితే కొత్తవి వేయాల్సి ఉండగా పాతవాటికే ట్యూబులు చుట్టి కొత్తపైపుల పేరిట నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. శనివారం దుర్శేడ్‌లో పాతపైపులకు ట్యూబులు చుట్టి మళ్లీ వేయడం వివాదాస్పదంగా మారింది.

కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు సంబంధించిన రెండు రక్షిత తాగునీటి బావులు ఇరుకుల్లవాగులో ఉన్నాయి. జగిత్యాల–వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంతో బావులు పోతుండటంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గత నెలలో రెండు ప్రాంతాల్లో కొత్త బోర్లను వేసి నీటిని సరఫరా చేశారు. అంతేకాకుండా హ్యాండ్‌బోర్ల మరమ్మతులు చేశారు.అయితే గ్రామంలోని కొన్ని కాలనీల్లో హ్యాండ్‌బోర్లు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మూడు బోర్ల మరమ్మతులు చేపట్టారు. బోర్ల నుంచి పాతపైపులను తీసిన మెకానిక్‌లు పైపులకు రంధ్రాలు పడటంతో సైకిల్‌ట్యూబులు చుట్టారు. మెకానిక్‌లు మళ్లీ పాత పైపులను వేస్తున్నారనే సమాచారంతో మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు మరమ్మతు పనులను అడ్డుకున్నారు. పైపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పైపులు వేయాలని డిమాండ్ చేయగా మెకానిక్‌లు ఒప్పుకోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మెకానిక్‌లు మాత్రం యథావిధిగా మళ్లీ పాతపైపులనే వేయడం వివాదాస్పదంగా మారింది. పాతపైపులకు ట్యూబులు చుట్టి వేశారని మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రావు ఆరోపిస్తుండగా బోర్లనుంచి తీసిన పైపులకు ట్యూబులు చుట్టి ఉన్నాయని గ్రామ ప్రత్యేక అధికారి రామకృష్ణ వివరించారు. చెడిపోయిన పాత పైపుల స్థానంలో కొత్త పైపులు వేసినట్లు తెలిపారు.అయితే గతంలో పాతపైపులకు ట్యూబులు చుట్టి వేసి కొత్తపైపుల బిల్లు పొందారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి వివాదాస్పదంగా మారిన బోర్ల మరమ్మతు వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే పంచాయతీ అధికారుల అవినీతి భాగోతం వెలుగుచూసే అవకాశముంది.



అంజనాద్రి ఆలయంలో స్వామి వారు



గిద్దెపెరుమాండ్ల ఆలయంలో ..

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. అభిషేక, అర్చనలు జరిపారు. అంజనాద్రిగుట్టపై గల లక్ష్మీగణపతి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గిద్దెపెరుమాండ్ల ఆలయంలో వినాయకుడి అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): సంకష్టహర చతుర్థి సందర్భంగా శనివారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలోని లక్ష్మీగణపతికి పూజలు నిర్వహించారు. విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణశర్మ జరిపారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.



దుర్గాభవానీ ఆలయంలో..

పదవులకు వన్నె తెచ్చిన 'ఎమ్మెస్సార్'



ఎమ్మెస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, దివంగత ఎం.సత్యనారాయణరావు పదవులకే వన్నె తెచ్చిన నాయకుడని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఎమ్మెస్సార్ వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎమ్మెస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెస్సార్ ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా ఎన్నో పదవులు అలంకరించారన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్సార్ మనవడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెనేని రోహిత్‌రావు, కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, రహమత్ హుస్సేన్, చర్ల పద్మ, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్ మునిగంటి అనిల్, కొరవి అరుణ్ కుమార్, అబ్దుల్ రెహమాన్, వెన్న రాజమల్లయ్య, మడుపుమోహన్, ఎం రాజేందర్, లింగంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన ఊరేగింపు



కరీంనగర్‌కల్చరల్: క్రీస్తు మరణించి తిరిగి లేచిన తర్వాత జరిగే సిలువ పునరుత్థాన ఊరేగింపును శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్టియన్‌కాలనీలో గల సెంటనరీవెస్లీ చర్చి ప్రాంగణం నుంచి సిలువ ఊరేగింపును కరీంనగర్ అధ్యక్ష మండల పీఠాధిపతి రూబెను మార్చ్ ప్రారంభించగా క్రైస్తవ భక్తిగీతాలు ఆలపిస్తూ భగవంతున్ని కొలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన సిలువ ప్రయాణంలో శాంతి సమాధానాలతో సుఖంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం ఉపాధ్యక్షుడు రెవరెండ్ సుదర్శనమయ్య, సెంటనరీ వెస్లీ చర్చి బోధకులు ఎస్.జాన్ ,కార్యదర్శి నారాయణ ట్రెజరర్ సీహెచ్ సంజయ్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్‌లపై మోదీవి అబద్ధపు మాటలు



మాట్లాడుతున్న తాజొద్దిన్

కరీంనగర్ కార్పొరేషన్: ముస్లిం రిజర్వేషన్‌ల గురించి ప్రధాని నరేంద్రమోదీ అబద్ధాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.తాజొద్దిన్ విమర్శించారు. శనివారం నగరంలోని 54వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా వెనుకబాటును గుర్తించి ముస్లిం తెగలకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ముస్లిం సమాజంలో దాదాపు 60 శాతం వివిధ వృత్తులపై ఆధారపడి ఉన్నారని, 1960 నుంచి వీరిని వెనకబడిన వర్గాల్లో చేర్చాలని డిమాండ్ ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లకు కూడా ముస్లిం రిజర్వేషన్ వల్ల ఇబ్బందులు ఉండవన్నారు. వాస్తవాలను ప్రక్కనపెట్టి మోదీ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ఈ సమావేశంలో సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ షబ్బీర్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ఖలిమోద్దీన్, ప్రధాన కార్యదర్శి నూరొద్దిన్, సంచార ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. దావుద్, ఎండీ.అలీ పాషా, ఇర్ఫాన్, వాజిద్, జమీర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మందికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన 8మందికి శనివారం కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించింది. కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 25 మందిని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా వారిలో ఒకరికి ఏడు రోజులు జైలు, మరొకరికి ఐదు రోజుల జైలు , ఆరుగురికి మూడు రోజుల జైలుశిక్ష, వీరికి రూ. 16,5000ల జరిమానా విధించారన్నారు. మిగితా 17 మందికి రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు తెలిపారు.

పారమిత విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థులకు ప్రతిష్టాత్మక ప్రతిభా అవార్డులను ప్రదానం చేశారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన టాగ్ అవార్డుల ప్రధానోత్సవానికి పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కొత్త విషయాలు తెలుసుకునేందుకు, ఎదుటివారికి సహాయం చేయాలన్న ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు టాగ్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్‌రావు, వీయూఎం.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహత, శ్రీకర్, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ మేనేజ్‌మెంట్ పోటీలో 'ఎస్‌ఆర్‌ఎం' విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలతో ఎస్‌ఆర్‌ఎం ఎంబీఏ విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని ఎస్‌ఆర్‌ఎం ఎంబీఏ విద్యార్థులు హన్మకొండలోని వాగ్దేవి కళాశాలలో మంత్రా– 2024 పేరిట నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జయకేతనం ఎగురవేసినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి ఎంబీఏ విద్యార్థులు పాల్గొనగా మార్కెటింగ్ విజార్డ్, ట్రెజర్ హంట్ లాంటి ఈవెంట్స్‌లో ఎస్‌ఆర్‌ఎం ఎంబీఏ విద్యార్థులు విజేతలుగా నిలిచి నగదు బహుమతులు అందుకున్నారని అన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను వారు అభినందించారు. కళాశాల ఎంబీఏ కరిక్యులంతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన స్కిల్స్‌ను పెంపొందించేందుకు ప్రతీరోజు మేనేజ్‌మెంట్ ఆక్టివిటీస్ నిర్వహిసస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ విభాగ్ ఇన్‌చార్జి ఎండీ.ఖాజామొహినొద్దీన్, ఎంబీఏ, ఎంసీఏ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి మూల్యాంకనం విధుల్లో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి, పునర్నియామకంలో వివక్ష చూపిన జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేశ్, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి సాగర్‌లు జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయగా ఇద్దరు ఉపాధ్యాయులను అదే పాఠశాలకు పునర్నియామకం చేపట్టి దళితుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు పోతన శ్రీనివాసకు నగునూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు కేటాయించకుండా వీణవంక పాఠశాలకు బదిలీ చేశారన్నారు. ఇది హేయమైన చర్య అని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకుందాం




మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకుందామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికి రెడ్డి బుచ్చన్న యాదవ్ అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక హక్కులు కాపాడాలంటే పెట్టుబడిదారుల పాలనను అంతం చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల ఆగయ్య, ఓర్సు కొమురయ్య, కేంసారం శ్రీనివాస్, ఎస్కే సుల్తాన్, దాన వేణి రమేశ్, మేకల కుమార్, సంపత్, సురేందర్‌రెడ్డి, నడిగడ్డ సంపత్, పింగి రవి, అల్లపు బాలయ్య, బొంతల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అందరి దృష్టి చేవెళ్లపైనే ఉంది. పల్లె, పట్టణాల కలబోతతో కూడిన ఈ లోక్‌సభ స్థానంలో మూడు ప్రధాన పార్టీలే కాదు.. ముగ్గురు సంపన్నులు పోటీ పడుతుండటమే ఇందుకు కారణం. గులాబీ కోటలో కమలం పువ్వును వికసింపజేయాలని బీజేపీ.. హస్తం హవా కొనసాగించాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2009లో మినహా ఇప్పటివరకు ఇక్కడ ఏ ఎన్నిక వచ్చినా కారుదే హవా. ఈసారి ఎలాగైనా కారు స్పీడ్‌కు బ్రేకులు వేయాలని బీజేపీ, కాంగ్రెస్ భావిస్తున్నాయి. బలమైన అభ్యర్థులను బరిలోకి దించాయి. అయితే ఒకసారి గెలిచిన వారు రెండోసారి విజయం సాధించిన చరిత్ర లేకపోవడంతో ఈసారి ఇక్కడ ఎవరు గెలుస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.




చేవెళ్ల రణక్షేత్రం.. సంపన్నుల సమరం!

లోక్‌సభ బరిలో 3 ప్రధాన పార్టీల అభ్యర్థులూ కోటీశ్వరులే

- ముస్లిం ఓట్లను నమ్ముకున్న కాంగ్రెస్
- దేశాభివృద్ధి, మోదీ చరిష్మాపై ఆధారపడ్డ బీజేపీ
- బీసీ ఓటర్లపై బీఆర్‌ఎస్ గంపెడాశలు
- త్రిముఖ పోటీలో ఎవరు గెలుస్తారన్న విషయమై అందరిలో ఉత్కంఠ

అంచనాలకు అందవు.. వ్యూహాలకు చిక్కరు

అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, అనుబంధ పరిశ్రమలకు నెలవైన చేవెళ్ల లోక్‌సభ స్థానంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లే కాదు.. ఉత్తరాది ఓటర్లు కూడా ఉన్నారు. వారిలో ముస్లింలు 15 శాతం, ముదిరాజ్‌లు 15 శాతం, మాదిగలు 15.71 శాతం, గౌడ్‌లు 9.50 శాతం, మాలలు 7.86 శాతం, యాదవులు 7.86 శాతం, లంబాడీలు 6.57 శాతం, రెడ్లు 5 శాతం, కమ్మలు 3.43 శాతం, లింగాయత్‌లు 3.36 శాతం, మున్నూరుకాపులు 3 శాతం ఓటర్లు ఉన్నట్లు అంచనా. అభ్యర్థుల గెలుపోటములను ముస్లింలు, ముదిరాజ్‌లే డిసైడ్ చేయనున్నారు. అయితే ఓటర్ల తీరు అంచనాలకు అందడం లేదు. రాజకీయ వ్యూహాలకు కూడా చిక్కడం లేదు. 2009 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఈ మూడు ఎన్నికల్లో ఇదే అంశం స్పష్టమైంది. 2009లో కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి ఇక్కడ గెలవగా ఆ తర్వాత ఆయన మళ్లీ ఈ స్థానం నుంచి పోటీ చేయలేదు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు.



2009 ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ మధ్య ఉత్కంఠ పోరు నెలకొనగా కాంగ్రెస్ అభ్యర్థి ఎస్. జైపాల్‌రెడ్డి 18,532 ఓట్ల ఆధిక్యంతో జితేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇక్కడ 64.5 శాతం పోలింగ్ నమోదైంది. ఇద్దరి అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా 1.7 శాతమే కావడం గమనార్హం.

మొత్తం ఓట్లు: 16,81,664 | పోలైన ఓట్లు: 10,83,490

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	శాతం
ఎస్.జైపాల్‌రెడ్డి	కాంగ్రెస్	4,20,807	38.80
ఏపీ జితేందర్‌రెడ్డి	టీడీపీ	4,02,275	37.10

2014 ఎన్నికల్లో 60.20 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో నోటాకు 10,018 ఓట్లు రాగా టీఆర్‌ఎస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 73,023 ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ అభ్యర్థి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిపై గెలిచారు.

మొత్తం ఓట్లు: 23,02,163 | పోలైన ఓట్లు: 13,00,194


అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	శాతం
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	టీఆర్‌ఎస్	4,35,077	33.10
పి.కార్తీక్‌రెడ్డి	కాంగ్రెస్	3,62,054	27.50

2019 ఎన్నికల్లో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య గెలుపు దోబూచులాడింది. చివరికి అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి 1.1 శాతం ఓట్ల తేడాతో విజయం సాధించారు. నోటాకు 9,244 ఓట్లు పోలయ్యాయి.

మొత్తం ఓట్లు: 21,85,179 | పోలైన ఓట్లు: 13,15,862

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	శాతం
జి.రంజిత్‌రెడ్డి	టీఆర్‌ఎస్	5,28,148	40.60
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	కాంగ్రెస్	5,13,831	39.05

ముగ్గురూ కోటీశ్వరులే..



కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) రూ.4,490 కోట్లు | గడ్డం రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్) రూ.869.77 కోట్లు | కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్‌ఎస్) రూ. 520.70 కోట్లు

అభ్యర్థులు వారే.. పార్టీలే వేరు

ప్రస్తుతం బరిలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గతంలో వేర్వేరు పార్టీల నుంచి తలపడిన వారే. ప్రస్తుతం వారు మళ్లీ తమ అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన సంప్రదాయ కాంగ్రెస్ ఓటు బ్యాంకుతోపాటు రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్ల, శేరిలింగంపల్లి, అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ముస్లిం ఓటర్లపై ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు హామీని ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రధాని మోదీపైనే భారం వేశారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి వంటి అర్బన్ ఏరియాల్లో ఉన్న బీజేపీ కేడర్, మోదీ అభిమానులను ఆయన టార్గెట్‌గా ఎంచుకున్నారు. చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులో వ్యక్తిగత పరిచయాలను నమ్ముకున్నారు. ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, శాసనమండలి సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్ పోటీ పూర్తిగా బీసీ ఓటర్లనే నమ్ముకున్నారు. లోక్‌సభ స్థానంలో 16.50 లక్షల బీసీలు ఉంటారని, వారే తనను గెలిపించనున్నారనే ధీమాతో ఉన్నారు.

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్లు
మహేశ్వరం	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	3,95,460	3,52,069	144
చేవెళ్ల	1,35,261	1,33,820	06
పరిగి	1,33,625	1,32,639	09
వికారాబాద్	1,15,019	1,16,647	13
తాండూరు	1,18,228	1,25,614	07

268 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కృతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల పరిధిలో మొత్తం 893 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 268 మంది అభ్యర్థుల నామినేషన్లను శుక్రవారం నిర్వహించిన పరిశీలనలో తిరస్కరించారు. 625 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం శనివారం వెల్లడించింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు 29తో ముగియనుంది. ఆ తర్వాతే బరిలో ఉండనున్న తుది అభ్యర్థుల జాబితాలపై స్పష్టత రానుంది.

అసెంబ్లీ కోఆర్డినేటర్లను నియమించిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

నిష్పాక్షిక ఎన్నికలకు చర్యలు తీసుకోండి

డీజీపీని కోరిన టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేలా పోలీస్‌శాఖ నుంచి తగిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ (టీపీసీసీ–ఈఎంసీ) డీజీపీ రవి గుప్తాను కోరింది. ఈ మేరకు టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ నాయకత్వంలో టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, మాజీ మంత్రి పుష్పలీల, వినోద్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, సినీతార దివ్యవాణి డీజీపీని శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. అన్ని ప్రాంతాల్లో తగినంత మంది భద్రతా సిబ్బందిని నియమించాలని, సున్నితమైన ప్రాంతాల్లో ఎక్కువ బలగాలను మోహరించి ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మతం పేరుతో రెచ్చగొడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాట్సాప్‌లో దుష్ప్రచారం, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డీజీపీ దృష్టికి తెచ్చారు.

నేటి నుంచి బీజేపీ 'బూత్ విజయ్ అభియాన్'

సాక్షి, హైదరాబాద్: ఇంటింటికీ బీజేపీ రెండో విడతలో కార్యక్రమంలో భాగంగా ఈనెల 28, 29, 30 తేదీల్లో 'బూత్ విజయ్ అభియాన్'పేరుతో ప్రచారం నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లాలని, పీఎం మోదీ విడుదల చేసిన 'సంకల్ప పత్రం'అందజేయాలని వెల్లడించా రు. దీంతో పాటు పార్లమెంట్ అభ్యర్థి కరపత్రం, స్టిక్కర్ ప్రతి ఇంటికి అందజేయాలని సూచించారు. పోలింగ్ బూత్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారిఇంటికి వెళ్లి ఓట్లు కోరాలని పేర్కొన్నారు. పోలింగ్‌కు మూడు రోజుల ముందు ఇంటింటికీ మూడో విడత కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.



డీజీపీ రవిగుప్తాకు ఓటరు స్లిప్పు అందజేస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్

నిర్భయంగా ఓటేయాలి

- సీఈవో వికాస్‌రాజ్
- సీఈవో, డీజీపీలకు ఓటరు స్లిప్పులు అందజేసిన రొనాల్డ్ రోస్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున ఓటు వేసే బాధ్యతను మరచిపోవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ అన్నారు. ఇంటింటికీ ఓటరు స్లిప్పుల పంపిణీలో భాగంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ శనివారం సీఈఓ వికాస్‌రాజ్, డీజీపీ రవి గుప్తాల ఇళ్లకు వెళ్లి వారికి ఓటరు స్లిప్పులు, 'ఓటరుగా గర్వపడుతున్నాను'అనే స్టిక్కర్లను అందజేశారు. అలాగే రవి గుప్తా సతీమణి అంజలిగుప్తా, కుమారుడు అంకుర్ గుప్తాకు కూడా పోల్ చీటీలను అందజేశారు. ఆ తర్వాత ఇంటి బయట 'ఐయామ్ ఏ ప్రౌడ్ ఓటర్'అనే స్టిక్కర్‌ను కమిషనర్ స్వయంగా అతికించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ప్రజాస్వామ్య మనుగడకు, దేశ భవిష్యత్‌కు ఓటు ఒక ఆయుధం లాంటిదని, మే 13ను ప్రజాస్వామ్య పండుగగా భావించాలని పేర్కొన్నారు. ఎపిక్ కార్డు ఉంటే సరిపోదని ఓటర్ జాబితాలో పేరు ఉందో లేదో ప్రజలు సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇంటింటికీ ఓటరు స్లిప్పులు, స్టిక్కర్ల పంపిణీ వివరాలను ఆయనకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డీజీపీ రవి గుప్తా మాట్లాడుతూ పోలింగ్ రోజున రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కమిషనర్ వెంట ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్ రావు, జూబ్లీహిల్స్ సర్కిల్ డీఎంసీ ప్రశాంతి, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ గంగాధర్, స్థానిక బీఎల్‌ఓ మురళి తదితరులున్నారు.

అలాగైతే తప్పుకుంటా

ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లు నిరూపిస్తారా?

- నిరూపించకపోతే కాంగ్రెస్ అభ్యర్థులంతా పోటీ నుంచి తప్పుకుంటారా?
- బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ సవాల్
- కాంగ్రెస్ నేతలూ.. ఎందుకీ డ్రామాలు, మోసాలని మండిపాటు
- వెధవ అన్న మంత్రి పొన్నం తిట్లను దీవెనలుగా భావిస్తా
- సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన పలువురు నేతలు



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, సిరిసిల్ల: రుణమాఫీపై సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల తీరుపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ విరుచుకుపడ్డారు. 6 గ్యారంటీలను అమలు చేసినట్లు నిరూపిస్తే తాను ఎన్నికల్లో పోటీ నుంచే తప్పుకుంటా... నిరూపించకపోతే కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న 17 మంది అభ్యర్థులు ఎన్నికల బరి నుంచి తప్పుకునేందుకు సిద్ధమా?''అంటూ సవాల్ విసిరారు. దమ్ముంటే కాంగ్రెస్ నేతలు తన సవాల్ ను స్వీకరించి డేట్, టైం, వేదిక నిర్ణయిస్తే.. వచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. శనివారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సోదరుడు కోడూరు మహేందర్ గౌడ్‌తోపాటు తెలంగాణ ఉద్యమకారుడు కుమార్ తమ అనుచరులతో కలిసి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ ఏది మాట్లాడినా మతతత్వమని ముద్రవేసే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఇతర మతస్తుల ముందు హిందూ మతాన్ని హేళన చేసేలా మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

కుట్రలతో నన్ను ఓడించాలని చూస్తుండ్రు

కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి చీకటి ఒప్పందాలతో తనను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయని బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు రూ.వెయ్యి పంచి గెలవాలని యత్నిస్తున్నారని నిందించారు. ఓడిపోతామనే భయంతోనే మంత్రి పొన్నం ప్రభాకర్ తనను వెధవ అంటూ దూషిస్తున్నారని, ఆయన తిట్లు దీవెనలుగా భావిస్తున్నానని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. వెధవ అంటే తన దృష్టిలో 'వెయ్యేళ్లు ధనికుడిగా వర్థిల్లు'అని అర్థమన్నారు.

పరారీలో దోచుకున్న కుటుంబం

మొన్నటివరకు బోయినపల్లిలో ఒక కుటుంబం అరాచకంగా వ్యవహరించిందని, కొందరు పోలీసులు వారికి వత్తాసు పలికారని సంజయ్ ఆరోపించారు. ఇప్పుడు ఆ కుటుంబం పరారీలో ఉందని, వత్తాసు పలికిన పోలీసుల పరిస్థితి ఇబ్బందిగా మారిందన్నారు. కేసీఆర్‌కు దోచిపెట్టడం తప్ప.. కుటుంబానికి దాచిపెట్టడం తప్ప వినోద్ కుమార్ సాధించేదేమీ లేదని సంజయ్ విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, 'సెస్'మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి ఓ జోకర్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



కరీంనగర్: సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని, అమలు చేయకుంటే సీఎం రాజీనామాకు సిద్ధమా? అని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోమటిరెడ్డికి మంత్రి కాగానే అహంకారం పెరిగిందని, మంత్రిగా కాకుండా మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. కోమటిరెడ్డి ఒక జోకర్ అని, హవాలా దందాలకు కేరాఫ్ అడ్రస్ అని విరుచుకుపడ్డారు. కోమటిరెడ్డి తనవద్ద 22 మంది ఎమ్మెల్యేలున్నారని, కేసీఆర్‌తో మాట్లాడితే తాను ముఖ్య మంత్రి అవుతానని ఓ వ్యక్తితో స్వయంగా తనకే రాయబారం పంపారని కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎలక్షన్‌లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెడితేనే మిగిలిన గ్యారంటీలు అమలవుతాయన్నారు. హరీశ్‌రావును చూసి కోమటిరెడ్డి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కేడీసీసీ వైస్‌చైర్మన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీజోన్ 1 పరిధిలో ముమ్మరంగా తనిఖీలు

రూ.2 కోట్లకు పైగా నగదు, 4 లక్షల విలువైన మద్యం స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం, గంజాయి రవాణాను నియంత్రించేందుకు మల్టీజోన్ 1 పరిధిలోని 16 జిల్లాల్లో ప్రధాన రోడ్డు మార్గాల్లో వాహన తనిఖీలతో పాటు రైళ్లల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మల్టీ జోన్ 1 పరిధిలోని 16 జిల్లాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో రూ.2,81,36,128 నగదు, రూ.4,05,823 విలువైన మద్యం సీసాలు, రూ.3,15,788 విలువ కలిగిన 15.479 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ రంగనాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిందితులపై 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గంజాయిని తరలిస్తున్న 25 వ్యక్తులతో పాటు, ఎనిమిది వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కంటెంట్ ఉంటేనే 'కిక్కు.. క్లిక్'

ఎన్నికల వేళ వినూత్న ప్రచారం

- ఆకట్టుకునే కంటెంట్‌కే నేతల ప్రాధాన్యం
- కంటెంట్ రైటర్లకు అనుక్షణం చాలెంజ్
- రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది కంటెంట్ రైటర్లు
- ప్రొఫెషనల్ ట్రెనింగ్ ఉన్నవారు 20 వేల మందే

సాక్షి, హైదరాబాద్: కంటెంట్‌లో కిక్కు ఉండాలి...అది ఉంటేనే క్లిక్ అవుతుందనే భావనలో రాజకీయ నాయకులు ఉన్నారు. జనంలోకి దూసుకెళ్లే వీడియోలు.. వినంగానే అర్థమయ్యేలా సోది లేకుండా చెప్పే నైపుణ్యం..నిశితంగా వైరిపక్షాన్ని ఇరుకున పెట్టే వ్యూహం.. లోక్‌సభ ఎన్నికల వేళ నేతలు ఈ తరహా కంటెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన వికీపీడియా కంటెంట్ సొల్యూషన్స్ సమాచారం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది కంటెంట్ రైటర్లు పనిచేస్తున్నారు. అసలు కంటెంట్ రైటింగ్ అంటే ఏంటో? ఎలా ఉంటుందో? ఎలా క్రియేట్ చేయాలో చెప్పేందుకు ప్రత్యేక శిక్షణ సంస్థలూ ఉన్నాయి. ఢిల్లీకి దగ్గర్లోని గుర్గావ్‌లో ఇలాంటి పేరెన్నికగల సంస్థల్లో చాలామంది శిక్షణ పొందుతున్నట్టు వికీపీడియా సంస్థ అధిపతి కుమార్‌జైన్ తెలిపారు. ఇలా శిక్షణ తీసుకున్నవారు కొన్నేళ్లుగా ఎన్నికలు, ఇతర ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరి ఆధ్వర్యంలో పనిచేసిన మరో 80 వేల మంది వరకూ కంటెంట్ రైటర్లుగా మారిపోయారు.

'క్లిక్'మనిపించడమే సవాల్

రాజకీయపార్టీ ఏదైనా సరే ఎన్నికల్లో గెలవాలనే అనుకుంటుంది. ఈ దిశగానే వారి ఆశయాలు, ఆచరణ విధానాలను ప్రజల్లోకి తీసుకెళుతుంది. వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఇలా అన్ని సోషల్ మీడియాల్లోనూ తమ వాదన 'క్లిక్'కావాలనే కోరుకుంటాయి. ఇక్కడే కంటెంట్ రైటర్ ప్రావీణ్యత ముడిపడి ఉంది. నేతను జనంలో నిలబెట్టే మెళకువలు అందిపుచ్చుకోవడంలో దేశవ్యాప్తంగా 60 శాతం కంటెంట్ రైటర్లు విజయం సాధిస్తున్నారని ఢిల్లీకి చెందిన ఇండియా కంటెంట్స్ మేనేజర్ విజయ్‌కుమార్ మల్‌హోత్రా తెలిపారు. పోస్టు పెట్టాక రివ్యూ చేస్తారు. ఎంతమందికి అది రీచ్ అయింది తెలుసుకుని.. సరైన స్పందన లేకపోతే కంటెంట్ మార్చడానికి ప్రయత్నిస్తుంటారు. నాయకుడికి సంబంధిన కంటెంట్ రైటర్ తను పెట్టే వీడియోలు, ఫొటోలు ఓటర్లకు రీచ్ కాకపోతే కంటెంట్ రైటర్ చిక్కుల్లో పడ్డట్టే. దీని కోసం కంటెంట్ రైటర్లు కూడా సొంత ఫాలోవర్స్ ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది.

మంచి గిరాకీనే..

కంటెంట్ రైటర్లకు ఎన్నికల సీజన్‌లో మంచి గిరాకీ ఉంటుంది. ఒక్కో సంస్థ పరిధిలో కనీసం 50 మంది పనిచేస్తుంటారు. నాయకుడి అందించే కాన్సెప్ట్ అర్థం చేసుకొని, అందుకు అనుగుణంగా అవసరమైన డైలాగ్స్, సెటైర్లతో కంటెంట్ ఇవ్వడం వీరి బాధ్యత. దీనిని వీడియో ఎడిటర్ చిత్రీకరణలోకి తీసుకెళతాడు. చిత్రం చాలా తేలికగా ఉండాలంటే, ఈజీగా ఉండే పదాలు, వాడుక భాషను కంటెంట్ రైటర్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. కంటెంట్ అందిచడం అనేక విధాలుగా ఉంటుందని ది రైటర్స్ అనే సంస్థకు చెందిన విఠల్ తెలిపాడు. అధికార పార్టీ నేత పోటీ చేస్తున్నప్పుడు ప్రభుత్వ పథకాలు, జరిగిన లబ్ధిపై ఎక్కువగా ఫోకస్ చేయాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో విపక్షాలు లేవనెత్తే ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు కూడా కంటెంట్ ఇవ్వాలి. దీనిని వీలైనంత తక్కువ నిడివి గల వీడియో చిత్రీకరణకు అనువుగా ఉండాలని నేతలు కోరుతున్నట్టు కంటెంట్ రైటర్లు చెబుతున్నారు. విపక్షమైతే ఎదురుదాడి ప్రధానాస్త్రంగా కిక్ ఎక్కించే కంటెంట్ కోరుకుంటోంది. కంటెంట్ క్లిక్ అయ్యే దాన్ని బట్టి రెమ్యూనరేషన్ డిమాండ్ ఉంటోంది. కొంతమంది ఎన్నికల సమయం వరకూ ప్యాకేజీగా రూ.25 నుంచి రూ.40 లక్షల వరకూ తీసుకుంటున్నారు. మరికొంతమంది నేతలు వారి స్థాయిని బట్టి రెమ్యూనరేషన్ ఇస్తున్నారు. ఇది కూడా రూ.10 లక్షలకు తక్కువ ఉండదు.



జగన్ ఇస్తున్న మాట

ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలన్నీ కొనసాగిస్తామని హామీ
వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో-2024 విడుదల చేసిన సీఎం జగన్

భారీ ప్రాజెక్టులు.. పెద్ద ఎత్తున ఉద్యోగాలు

- ఈ ఐదేళ్లలో రూ.85,543 కోట్ల పెట్టుబడులు, 28.89 లక్షల ఉద్యోగాలు వచ్చాయి
- వచ్చే ఐదేళ్లలో పూర్తయ్యేలా వివిధ దశల్లో భారీ మౌలిక ప్రాజెక్టులు
- ఇవి పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రం మారుతుంది... ఉద్యోగాలూ వస్తాయి
- రూ.24,592 కోట్లతో 4 పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాలు
- రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం
- 2024లో మన ప్రభుత్వం మళ్లీ ఏర్పడగానే పరిపాలన రాజధానిగా విశాఖ
- రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్‌లా పనిచేసేలా విశాఖ అభివృద్ధి
- అమరావతి శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా అభివృద్ధి
- వచ్చే ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు, 17 మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి
- పేదలందరికీ ఇళ్ల స్థలాలు, మొదలుపెట్టిన ఇళ్ల నిర్మాణాలు ఐదేళ్లలో పూర్తి
- కొత్త రోడ్లు, రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ
- రోడ్లు, పార్కులు, డ్రైనేజీలతో స్మార్ట్ సిటీలుగా జిల్లా కేంద్రాలు
- ఇందుకోసం తొలిదశలో రూ.2,000 కోట్లు కేటాయింపు
- ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధ
- వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో-2024లో వెల్లడి

అలవాటైన మోసగాడు బాబు

- సాధ్యం కాదని తెలిసీ అబద్ధాలకు రెక్కలు: సీఎం జగన్
- 2014లోనూ జనసేన, బీజేపీతో కూటమి కట్టి ఎడాపెడా వాగ్దానాలు
- అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కి ప్రజల జీవితాలతో చెలగాట మాడారు.. ఇప్పుడు మళ్లీ అదే కూటమి కట్టి సూపర్ సిక్స్.. సూపర్ టెన్ అంటున్నాడు
- ఆ హామీలకు అయ్యే ఖర్చెంత? అమలు సాధ్యమేనా?.. ఇలా చేయడం దొంగతనం కన్నా దారుణం కాదా? 420.. ఛీటింగ్ కాదా?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చడం.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో అగ్రభాగాన నిలపడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో 2024 రూపొందించామని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. శనివారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎన్నికల మేనిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేశారు. 2019 మేనిఫెస్టో అమలు తీరును వివరిస్తూ.. 2014లో జనసేన–బీజేపీతో జట్టుకట్టి అధికారంలోకి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మేనిఫెస్టోను చెత్తబుట్ట పాలు చేసి దారుణంగా వంచించిన తీరును ఆధారాలతో ఎండగట్టారు. మళ్లీ ఇప్పుడు అదే కూటమి కట్టిన చంద్రబాబు సూపర్ సిక్స్.. సూపర్ టెన్ పేరుతో మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తూ సీఎం జగన్ ఏమన్నారంటే..

వైఎస్సార్ చేయూత..:

వైఎస్సార్ చేయూత. కింద ఇంతకు ముందు రూ.75 వేలు ఇచ్చాం. నాలుగు దఫాలుగా 45 నుంచి 60 సంవత్సరాల వయసు మధ్యలో ఉన్న నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు ఆదాయం ఉండాలని పథకం తెచ్చాం. వైఎస్సార్ చేయూతను కొనసాగిస్తూ నాలుగు దఫాల్లో రూ.1.50 లక్షల దాకా తీసుకుని పోతాం.

వైఎస్సార్ కాపు నేస్తం

వైఎస్సార్ కాపు నేస్తం ఇకపై రూ.1.20 లక్షల వరకు ఇస్తాం. ఇంతకు ముందు నాలుగు దఫాల్లో రూ.60 వేలు ఇచ్చాం. మళ్లీ అధికారంలోకి వచ్చాక నాలుగు దఫాల్లో రూ.1.20 లక్షల వరకు పెంచుతాం.

వైఎస్సార్ ఈబీసీ నేస్తం..

ఈ 58 నెలల కాలంలో మూడు దఫాల్లో రూ.45 వేలు ఇచ్చాం. ఇప్పుడు మరో రూ.60 వేలు జతచేసి రూ.1.05 లక్షల వరకు పెంచి అందిస్తాం.

జగనన్న అమ్మ ఒడి..

జగనన్న అమ్మ ఒడి పిల్లలకు సంబంధించినది కాబట్టి నా మనసుకు చాలా దగ్గర. ఇది ఇంతకు ముందు రూ.15 వేలు ఉంది. రూ.13 వేలు నేరుగా అక్కచెల్లెమ్మల చేతికి ఇవ్వగా మరో రూ.2 వేలు స్కూలు స్కూల్స్ మెయింటెనెన్స్, టాయిలెట్ మెయింటెనెన్స్ కోసం ఇచ్చాం. ఆ అమ్మ ఒడి రూ.15 వేలు కాస్తా రూ.17 వేలకు పెంచుతున్నాం. తల్లి చేతికే నేరుగా రూ.15 వేలు వస్తాయి. టాయిలెట్స్, స్కూల్స్ మెయింటెనెన్స్ కోసం మరో రూ.2 వేలు కేటాయిస్తాం. మొత్తానికి అమ్మ ఒడి రూ.17 వేలు చేసి తల్లి చేతికి రూ.15 వేలు అందచేస్తాం.

వైఎస్సార్ సున్నా వడ్డీ..

వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా కింద రూ.25,571 కోట్లు ఐదేళ్లలో నాలుగు దఫాల్లో అందచేశాం. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలను చేయిపట్టుకుని నడిపించాం. ఆ అక్కచెల్లెమ్మలకు మరింత ప్రోత్సాహం ఇస్తూ రూ.3 లక్షల దాకా రుణాల మీద సున్నా వడ్డీ ఇవ్వడం మరో ఐదేళ్లు కొనసాగుతుంది.

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా..

ఇది కూడా ఐదేళ్లు మళ్లీ కొనసాగుతుంది. గత 58 నెలల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు షాదీ తోఫా ద్వారా 56,000 మందికి ఇచ్చింది రూ.427 కోట్లు. చదువులను ప్రోత్సహిస్తూ ఈ పథకానికి పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి చేశాం. అమ్మ ఒడికి 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. కల్యాణమస్తు, షాదీ తోఫాకు పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు..

ఇప్పటికే 31 లక్షల అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా 22 లక్షల ఇళ్లు కడుతున్నాం. అందులో 9.2 లక్షల ఇళ్లు పూర్తి కూడా అయిపోయాయి. మిగతావి వేగంగా పనులు జరుగుతున్నాయి. ఇది వచ్చే 5 ఏళ్లు కూడా కొనసాగుతుంది. అర్హులై ఉండి ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కూడా ఇళ్ల స్థలాలిచ్చే కార్యక్రమం కొనసాగుతుంది.

పట్టణ గృహనిర్మాణం..

పట్టణ గృహ నిర్మాణానికి సంబంధించి ఎంఐజీ అనే కార్యక్రమాన్ని ఈ 5 ఏళ్లలో పెద్ద ఎత్తున చేపడతాం. పట్టణాల్లో ప్రత్యేకించి మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్ వారి కోసం ఏటా రూ.1,000 కోట్లు చొప్పున రెండేళ్లలో రూ.2 వేల కోట్లు కేటాయిస్తూ ఎంఐజీ లే అవుట్ డెవలప్‌మెంట్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి డెవలప్ చేస్తాం. దీనివల్ల తక్కువ రేటుకే ప్లాట్స్ అందుబాటులోకి వస్తాయి.



శనివారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పెన్షన్లు పెంపు..

అవ్వాతాతల మీద జగన్ చూపించే ప్రేమ బహుశా చరిత్రలో ఎవరూ చూపించలేదు, చూపించబోరు. పెన్షన్లు రూ.3,500కు పెంచుతాం. రూ.250 పెరిగేది జనవరి 2028 అయితే ఇంకో రూ.250 పెరిగేది జనవరి 2029. డేట్లతో సహా ఎందుకు చెబుతున్నానంటే నాలో కల్మషం లేదు. అబద్ధం చెప్పదల్చుకోలేదు. మోసం చేయదల్చుకోలేదు. రాష్ట్ర వనరులు సపోర్టు చేయాలి. సపోర్టు చేయగలిగినప్పుడే పెన్షన్లు మనం ఇవ్వగలుగుతాం. ఇంత సొమ్ము ఖర్చు చేయగలుగుతాం. రూ.250 పెరిగిందంటే దాదాపుగా రూ.2,000 కోట్లు పైచిలుకు భారం పడుతుంది. మరో రూ.250 పెరిగిందంటే రూ.4,000 కోట్లు ప్రతి సంవత్సరం కావాలి. రాష్ట్ర బడ్జెట్ కుదుట పడి మళ్లీ కొద్దోగొప్పో వెసులుబాటు లభించే పరిస్థితి చివరి రెండేళ్లలో మాత్రమే కనిపిస్తోంది. కాబట్టి అప్పుడు ఇస్తాను అని చెబుతున్నా.

వ్యవసాయ రంగం..

2019 మేనిఫెస్టోలో రైతన్నలకు ఐదేళ్లలో రూ.50 వేలు ఇస్తామని చెప్పి అంతకంటే మిన్నగా రూ.67,500 ఇవ్వగలిగాం. రైతు భరోసా కింద ఏటా ఇస్తున్న రూ.13,500ను రూ.16,000కు పెంచి ఐదేళ్లలో రైతన్నకు రూ.80 వేలు ఇవ్వబోతున్నాం. పంట వేసే సమయంలో రూ.8 వేలు ఇస్తాం. కటింగ్ సమయంలో మరో రూ.4 వేలు, సంక్రాంతికి మరో రూ.4 వేలు ఇస్తాం. రైతన్నలకు ఉచిత పంటల బీమా కొనసాగుతుంది. సున్నా వడ్డీ కింద పంట రుణాలు ఇప్పుడు ఇస్తున్నట్టుగానే కొనసాగుతాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు, అటవీ, దేవాదాయ శాఖ భూములు సాగుదారులకు కూడా రైతు భరోసా వస్తుంది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షలు ఇస్తున్నాం. అది కొనసాగుతుంది. అలాగే మత్స్యకార భరోసా కింద మత్స్యకారులకు రూ.50 వేలు ఇచ్చాం. వచ్చే ఐదేళ్లలో మరో రూ.50 వేలు ఇస్తూ మొత్తంగా దాన్ని రూ.లక్ష దాకా తీసుకుని వెళతాం.

వాహన మిత్ర

వాహన మిత్ర కింద సొంత ఆటో, సొంత ట్యాక్సీ నడుపుకుంటున్న వాళ్లకు ఈ 58 నెలల కాలంలో రూ.50 వేలు ఇచ్చాం. వచ్చే ఐదేళ్లలో మరో రూ.50 వేలు ఇస్తాం. మొత్తంగా చూస్తే రూ.1 లక్ష వాళ్ల చేతిలో పెట్టినట్లవుతుంది. ఇదొక్కటే కాకుండా ఆటో, టాక్సీ, స్వయం ఉపాధి రంగాన్ని ప్రోత్సహిస్తూ, సొంత టిప్పర్లు సొంత లారీ నడిపే వారికి కూడా ఈ పథకాన్ని విస్తరింప చేస్తున్నాం. ఆటోకి, టాక్సీకి, మ్యాక్సీ క్యాబ్‌కి మాత్రమే కాకుండా సొంతంగా టిప్పర్లు లారీలు నడిపే డ్రైవర్లకు కూడా వర్తింప చేస్తున్నాం. ఆటో, మ్యాక్సీ క్యాబ్, టాక్సీ, టిప్పర్, లారీ డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా కింద రూ.పది లక్షల దాకా అందచేస్తాం. దీని కోసం రిజిస్టర్ చేసి ఐడీ కార్డులు ఇస్తాం. ఆటో, టాక్సీ, లారీ కొనుగోలు కోసం బ్యాంకులు నుంచి రుణాలు తెచ్చుకుంటే రూ.మూడు లక్షల వరకు అర్ధరూపాయి వడ్డీ భారం మాత్రమే వారికి ఉండేలా, మిగతా వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుంది.

లా నేస్తం..:

న్యాయవాదులకు లా నేస్తం ఇప్పుడు ఇస్తున్న విధంగానే కొనసాగుతుంది. ప్రతీనెల రూ.5,000 చొప్పున ఆరు నెలలకొకమారు రూ.30,000 ఇస్తూ చేయిపట్టి నడిపించే కార్యక్రమం కొనసాగుతుంది.

నేతన్న నేస్తం:

చేనేత కార్మికులకు ఐదేళ్లలో దాదాపు 1,20,000 మందికి మంచి చేస్తూ రూ.1,20,000 చొప్పున ఇవ్వగలిగాం. ఈ పథకాన్ని మళ్లీ ఐదేళ్లు కొనసాగిస్తూ మరో రూ.1,20,000 చొప్పున అందించనున్నాం. మేనిఫెస్టోలో చెప్పకపోయినా చేనేత కార్మికులకు, ఆప్కోకు గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో సహా రూ.468 కోట్లు ఇప్పటికే చెల్లించాం. పద్మశాలీలకు ప్రత్యేక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేశాం.

నైపుణ్యాలపైన మరింత శ్రద్ధ

రాష్ట్రంలో నైపుణ్యాల మీద ప్రత్యేక ధ్యాస, శ్రద్ధ పెట్టబోతున్నాం. ప్రతి నియోజకవర్గం ఒక యూనిట్ కింద తీసుకొని అక్కడ ఒక స్కిల్ హబ్ నెలకొల్పుతాం. దీనిద్వారా ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్ డ్రాపవుట్స్ ముగ్గురిని కలిపి ఒకే ప్లాట్‌ఫాం లోకి తీసుకువచ్చి, దాన్ని ఒక స్కిల్ హబ్‌గా తయారుచేస్తాం. దీనివల్ల వర్క్, వర్క్‌షాప్స్, టీచర్లు, స్టాఫ్ సామర్థ్యాలు పెరుగుతాయి. దీనికి సంబంధించిన అడుగులు ముందుకేస్తూ, రాష్ట్రంలో 175 స్కిల్ హబ్స్, జిల్లా కేంద్రాల్లో 26 స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలు, తిరుపతిలో ఒక స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే కార్యక్రమం కూడా చేస్తున్నాం. స్కిల్ కాలేజీలను నెలకొల్పడమే కాకుండా.. ఇక్కడ సీట్ తెచ్చుకున్నవారికి శిక్షణ, పెయిడ్ ఇంటర్న్‌షిప్ కూడా ఇస్తాం. అబ్బాయిల నెలకు రూ.2,500, అమ్మాయిలకు రూ.3,000 వరకు ఇస్తాం.

విద్యా రంగం మరింత బలోపేతం..

వచ్చే ఐదేళ్లు.. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన ఇవన్నీ కొనసాగుతాయి. అన్ని సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలను కూడా నాడు నేడు కార్యక్రమంలో భాగం చేస్తున్నాం. 2025 నుంచి ఒకటో తరగతికి ఐబీ విద్యా విధానం మొదలవుతుంది. ఇలా ప్రతి ఏడాది ఒక తరగతిని పెంచుకుంటూ 2035 నాటికి పదో తరగతి విద్యార్థులకు ఐబీ, రాష్ట్ర బోర్డుల జాయింట్ సర్టిఫికేషన్ ఇస్తాం. ఇప్పుడు కొనసాగిస్తున్న టోఫెల్ క్లాసులు మూడో తరగతి నుంచి పిల్లలకు కొనసాగుతాయి. ఎనిమిదో తరగతి పిల్లలకు ప్రత్యేక ట్యాబ్లు ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుంది. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను అధిగమించి 18 యూనివర్సిటీల్లో 3,295 అధ్యాపకుల పోస్టుల భర్తీని త్వరితగతిన పూర్తి చేస్తాం.

2019 తరహాలోనే ఈసారి కూడా మనది కేవలం రెండు పేజీల మేనిఫెస్టోనే. నవరత్నాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు తెలియచేస్తా



విద్య. అమ్మఒడి, ట్యాబులు, విద్యాకానుక, గోరుముద్ద, ఇంగ్లీషు మీడియం, డిజిటల్ బోధన.



వైద్యం.. విస్తరించిన ఆరోగ్యశ్రీ ఇంకా విస్తరణ. ఆరోగ్య ఆసరా, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, 17 కొత్త మెడికల్ కాలేజీలు, జగనన్న ఆరోగ్య సురక్ష.

వ్యవసాయం.. రైతు భరోసా, ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు, పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, సమయానికే ఇన్‌పుట్ సబ్సిడీ.





ఉన్నత విద్య.. జగనన్న విద్యాదీవెన పూర్తి ఫీజురీయింబర్స్ మెంట్, జగనన్న వసతి దీవెన, జాబ్ ఓరియంటెడ్ గా కరిక్యులమ్ లో మార్పులు.

నాడు నేడు.. స్కూళ్లు, నాడునేడు ఆస్పత్రులు. పేదలందరికీ ఇళ్లు, అక్కచెల్లెమ్మల పేరిట పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు.





మహిళా సాధికారత.. చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, సున్నా వడ్డీ.

సామాజిక భద్రత.. పెన్షన్ కానుక 2 విడతల్లో రూ.3,500కు పెంపు. ఎప్పటిలాగే ఇంటివద్దే వాలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ.





అభివృద్ధి, మౌలిక వసతులు, సుపరిపాలన.. ప్రస్తుతం నిర్మిస్తున్న 4 పోర్టులు పూర్తి చేస్తాం, ఫిషింగ్ హార్బర్ల పూర్తి, ఎయిర్ పోర్టులు, వాటి విస్తరణ పూర్తి, ఇండస్ట్రియల్ కారిడార్లు పూర్తి, నోడ్స్ పూర్తి, ప్రాధాన్యత క్రమంలో జలయజ్ఞం పూర్తి, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ.

వైద్య రంగంపై మరింత శ్రద్ధ

వైద్య రంగానికి సంబంధించి ఆరోగ్యశ్రీపై రానున్న ఐదేళ్లలో మరింత దృష్టి పెడతాం. ఆరోగ్యశ్రీని 25 లక్షల దాకా విస్తరించాం. ప్రొసీజర్స్‌ను 1,050 నుంచి 3,300కు పెంచాం. నెట్‌వర్క్ ఆస్పత్రులను కూడా బాగా పెంచడం జరిగింది. ఆరోగ్య రంగం మీద ఇంకా ఎక్కువ ధ్యాస పెట్టాలి. ప్రొసీజర్లను ఈసారి ఇంకా పెంచాలి అని అధికారులకు చెప్పాం. స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత దేశంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 61% ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.95% మాత్రమే. ఒక్క వైద్యరంగంలోనే 54 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇప్పటికే 17 కొత్త వైద్య కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో ఐదు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుని ప్రవేశాలు కూడా జరిగాయి. మిగిలిన 12 కళాశాలలను కూడా వేగంగా పూర్తి చేసేలా అడుగులు ముందుకు పడుతున్నాయి. గుండెకి సంబంధించి విశాఖ, గుంటూరు, కర్నూలుల్లో 3 మెడికల్ హబ్‌లు.. గుంటూరు, కర్నూలు, విశాఖ, కడప, కాకినాడ, అనంతపురంల్లో క్యాన్సర్ కేర్ సెంటర్లు.. కొత్తగా 17 నర్సింగ్ కాలేజీలు.. ఇవన్నీ అందుబాటులోకి వస్తాయి.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమం

ఎస్సీలకు డీబీటీ ద్వారా ఈ ఐదేళ్లలో రూ. 45,412 కోట్లు ఇవ్వగలిగాం. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.23,469 కోట్లు ఇవ్వగలిగాం. ఎస్టీలకు డీబీటీ ద్వారా ఈ ఐదేళ్లలో రూ.13,389 కోట్లు ఇవ్వగలిగాం. నాన్ డీబీటీ ద్వారా మరో రూ. 5,963 కోట్లు అందించగలిగాం. మొత్తం జనాభాలో కనీసం 50% దళితులు ఉండి లేదా ఆ దళితుల జనాభా 500కు పైగా ఉన్న ఆవాసాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేస్తాం. దీన్ని కొత్తగా చేయబోతున్నాం.

బీసీ సంక్షేమం

ఇప్పటికే డీబీటీ ద్వారా రూ.1,28,000 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.53,000 కోట్లు బీసీ సంక్షేమం కోసం ఖర్చు చేశాం.

ప్రార్థన మందిరాల నిర్వహణకు ప్రత్యేక నిధి

క్రిస్టియన్ మైనారిటీ, ముస్లిం మైనారిటీలకు, హిందూ దేవాలయాలకు ప్రస్తుతం జరుగుతున్నవి కొనసాగుతూ ఉంటాయి. కొత్తగా హిందూ దేవాలయాల నిర్వహణకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తాం. అన్ని ప్రార్థనాలయాలకు ఇది తీసుకొస్తున్నాం.

జగనన్న తోడు

జననన్న తోడు ద్వారా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారికి, ఫుట్‌పాత్‌ల మీద, తోపుడు బండ్ల మీద అమ్ముకుంటున్న వారు 16 లక్షల మందికి రూ.10 వేల వరకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నాం. రుణాలను సవ్యంగా తిరిగి కట్టడాన్ని ప్రోత్సహిస్తూ, సవ్యంగా కట్టిన వారికి సంవత్సరానికి రూ. 1,000 చొప్పున పెంచుతూ రూ.13,000 దాకా రుణం ఇస్తున్నాం. దాన్ని ఇప్పుడు మనం రూ.15 వేలకు పెంచి, రూ.20,000 దాకా తీసుకెళుతున్నాం. ఈ లక్షల మంది చిరువ్యాపారులకు ఇచ్చే పెట్టుబడి సహాయం రూ. 10,000 మాత్రమే ఉండేది ఇప్పుడు రూ.15,000 అయింది. సకాలంలో చెల్లించిన వారికి ప్రతి ఏడాది రూ.1,000 చొప్పున పెంచుకుంటూ రూ. 20,000 ఇప్పిస్తాం.

జగనన్న చేదోడు

షాపులు ఉన్న నాయీ బ్రాహ్మణులకు, టైలర్లకు, రజకులకు ఏటా రూ. 10 వేలు ఇచ్చే ఈ కార్యక్రమం వచ్చే ఐదేళ్లలో కూడా కొనసాగుతుంది.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం.

ప్రభుత్వ ఉద్యోగులకు ఏమేం చేసాము అనేది వివరంగా వెబ్‌సైట్‌లో ఉంచాం. వచ్చే ఐదేళ్లలో జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపిక కాని ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు, ఈ ఏడాది నుండీ విదేశీ విద్యకు వారు తీసుకున్న రుణంలో రూ. 10 లక్షల వరకు పూర్తి వడ్డీని కోర్స్ పూర్తయ్యే వరకు లేదా గరిష్ఠంగా ఐదేళ్లపాటు ప్రభుత్వమే భరిస్తుంది. అలాగే రూ. 25,000 వరకు జీతం పొందే ఆప్కాస్ అంటే ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వారు.. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు విద్య, వైద్యం, ఇళ్లకు సంబంధించిన అన్ని నవరత్నాల పథకాలు వర్తిస్తాయి.

వైఎస్సార్ జీవన్ బీమా

స్విగ్గి, జొమాటో, అమెజాన్ వంటి సంస్థల్లో డెలివరీ బాయ్స్‌గా పని చేసే వారిని కూడా బీమా పరిధిలోకి తీసుకొస్తాం. వారిలో ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ.5 లక్షలు జీవన బీమా కల్పిస్తాం.

పాదయాత్ర స్ఫూర్తితో పాలన

ఒక హీరోలా ప్రజల వద్దకు వెళుతున్నా: సీఎం వైఎస్ జగన్

మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా అమలు చేయడం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది

సాక్షి, అమరావతి: ''నా 3,648 కి.మీ. ప్రజాసంకల్ప పాదయాత్రలో కళ్లారా చూసిన సమస్యలకు పరిష్కారం వెతుకుతూ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చా. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకూ ప్రతి అడుగులో కూడా నేను చూసిన ఆ సమస్యలను పరిష్కరిస్తూ 58 నెలల పాలన సాగింది'' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. 'మేనిఫెస్టో అంటే ఎంత పవిత్రమైన గ్రంథమో, దానికి ప్రాధాన్యత ఎప్పుడు వచ్చిందంటే ఈ 58 నెలల కాలం లోనే అని చెప్పడానికి గర్వపడుతున్నా. గతంలో మేనిఫెస్టో అని అందరూ చెప్పేవాళ్లు. ఎన్నికలప్పుడు రంగురంగుల కాగితాలతో, అబద్ధాలకు రెక్కలు తొడిగి ఒక డాక్యుమెంట్ చూపించేవాళ్లు. ఎన్నికలు ముగిశాక ఆ డాక్యుమెంట్ ఎక్కడుందో గాలిస్తే ఎవరికీ కానరాని పరిస్థితి. ఎన్నికల తర్వాత మేనిఫెస్టో డాక్యుమెంట్ చెత్తబుట్టలో కూడా దొరకని అధ్వాన్నమైన పరిస్థితిని మనమంతా చూశాం' అని గుర్తు చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో 2024ను విడుదల చేస్తూ సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మేనిఫెస్టో..

మొట్టమొదటిసారిగా మేనిఫెస్టోను బైబిల్‌గా, ఖురాన్, భగవద్గీతలా భావిస్తూ హామీలను 58 నెలలుగా అమలు చేసిన విధానం దేశ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇది 2019 నాటి మన మేనిఫెస్టో (అప్పటి మేనిఫెస్టోను చూపిస్తూ). అప్పుడు ఇచ్చిన వాగ్దానాలన్నీ ఎంతో నిష్టగా అమలు చేశాం. వాటిని ఏ స్థాయిలో అమలు చేశామంటే మేనిఫెస్టో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి ముఖ్యమైన అధికారి దగ్గర ఉంది. మన మేనిఫెస్టో రాష్ట్రంలో ప్రతి ఇంట్లో ఉంది. ఆ మేనిఫెస్టోని ప్రజల ఇళ్లకు పంపించాం. అక్క చెల్లెమ్మలూ ఇదిగో మా మేనిఫెస్టో. మా ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇదీ. చెప్పినవన్నీ నెరవేర్చామో లేదో మీరే టిక్ చేయాలని కోరాం. మొట్టమొదటి సంవత్సరంలో 85 – 88 శాతం టిక్ చేస్తే చివరి ఏడాది నాటికల్లా 99 శాతం పైచిలుకు మేనిఫెస్టో హామీలను అమలు చేసి ప్రజల వద్దకు వెళ్లాం. ఇలా మేనిఫెస్టో హామీలను పూర్తి చేసి ప్రతి ఇంటికీ చేర్చిన పరిస్థితులు ఈ 58 నెలల కాలంలోనే సాకారమయ్యాయని చెప్పడానికి గర్వపడుతున్నా.

సాకులు చూపకుండా.. ప్రజలకు అండగా

ఈరోజు పేదవాళ్ల పరిస్థితి ఏమిటి? ఎలా ఉన్నారు? ఎలా బతుకుతున్నారంటే అద్భుతంగా ఉన్నారు. గతంలో ఎలా బతికారన్నది 3,648 కిలోమీటర్లు సాగిన నా పాదయాత్రలో కళ్లారా చూశా. వాళ్ల దగ్గరకు వెళ్లి పేదవాళ్ల పరిస్థితి ఏమిటని గమనిస్తే ... చదివించాలని ఆరాటం ఉన్నా పిల్లలను చదివించలేని పరిస్థితి ఆ తల్లులది. ఫీజులు కట్టలేక పిల్లలు చదువులు మానేసిన పరిస్థితులు, తల్లితండ్రులు ఫీజులు కట్టలేక పోవడంతో ఇది చూసి పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులను కళ్లారా చూశా. అవ్వాతాతలకు అన్ని అర్హతలు ఉన్నా నాడు పెన్షన్ రాని పరిస్థితి. ఇళ్లు ఇవ్వని పరిస్థితి. రేషన్ కావాలన్నా, మరుగుదొడ్లు కావాలన్నా, సబ్సిడీ మీద లోన్లు రావాలన్నా, ఇచ్చే అరకొర వాటికి కూడా లంచాలు, వివక్ష. రాజకీయ నాయకులు, పార్టీలు సృష్టించిన సమస్యలు, వ్యవస్థల వల్ల పేదవాడి బతుకు ఎలా అతలాకుతలం అయిందో నా కళ్లారా చూశా. 2019లో మన పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి ఈరోజు వరకు ప్రతి అడుగు కూడా నేను చూసిన ఆ సమస్యలకు సొల్యూషన్ వెతుకుతూ, మేనిఫెస్టోలో చేర్చి పరిష్కరించేలా 58 నెలల పాలన సాగింది. కోవిడ్ లాంటి మహమ్మారి వల్ల రెండేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అతలాకుతలం అయినా, రావాల్సిన ఆదాయాలు రాకపోయినా, అనుకోని ఖర్చులు పెరిగినా మేం సాకులు చూపలేదు. మేనిఫెస్టో అమలు చేయకుండా ఉండేందుకు కారణాలు వెతుక్కోలేదు. ఎన్ని సమస్యలున్నా, ఎక్కడా సాకులు చూపకుండా చిరునవ్వుతోనే ప్రజలకు తోడుగా, అండగా ఉన్నాం.



దేశ చరిత్రలో తొలిసారిగా..

ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వేగంగా అడుగులు వేస్తూ ఆగస్టులో వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చాం. అక్టోబర్ రెండో తారీఖు కల్లా సచివాలయ వ్యవస్థను తెచ్చాం. గ్రామ స్వరాజ్యానికి అర్థం చెబుతూ లంచాలు, వివక్ష లేకుండా ప్రతి పథకాన్ని అమలు చేశాం. ఎవరైనా పొరపాటున మిస్ అయితే వారిని జల్లెడ పట్టి వెతికి మరీ మరో అవకాశం కల్పించాం. మొట్టమొదటి సారిగా ఏటా ప్రజల వద్దకు మేనిఫెస్టోను పంపించడమే కాకుండా ఎమ్మెల్యేలు గడప గడపకూ వచ్చి నేరుగా ప్రజలను కలుసుకుని వారి ఆశీర్వాదాలు తీసుకోవడం దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదు.

2014లో బాబు మోసపూరిత హామీలు..

నాకు బాగా గుర్తుంది. 2014లో చంద్రబాబు ఎన్నో మోసపూరిత హామీలిస్తున్నారు. మరి మనం కూడా ఇవ్వకపోతే ఎలా? తరువాత సంగతి తరువాత చూసుకుందాం.. ముందైతే హామీలు ఇచ్చేద్దామని నా శ్రేయోభిలాషులే సలహాలు ఇచ్చారు. కానీ ఆ రోజు నేను అలా చేయలేదు. ఆరోజు కూడా చేయగలిగేవి మాత్రమే చెప్పా. అబద్ధాల్లో చంద్రబాబుతో పోటీ పడలేకపోయా. కానీ ఈరోజు గర్వపడుతున్నా. నాకు 2014లో అధికారం రాలేకపోయినప్పటికీ చరిత్రలో చరిత్ర హీనుడిగా మిగిలిపోకుండా చేయగలిగేవి మాత్రమే చెప్పి, చేసి చూపించి, మళ్లీ ప్రజల దగ్గరికి ఈరోజు ఒక హీరోలా వెళుతున్నా. ఆ ప్రభుత్వానికి – ఈ ప్రభుత్వానికి మధ్య తేడా గమనించండి. రాజకీయాల్లో ఒక నాయకుడు ఏదైనా మాట ఇస్తే ప్రజలు నమ్మి అవన్నీ చేస్తాడనే ఆశతో ఓటు వేస్తారు. ప్రజలు మన మీద అంత నమ్మకం పెట్టుకున్నప్పుడు పెట్టినప్పుడు మనం చేయాల్సిందేమిటి? వాళ్ల నమ్మకంతో ఆడుకోవడమా? వారి మనోభావాలతో ఆడుకోవడమా? వారి జీవితాలతో ఆడుకోవడమా? మనం చేయాల్సింది వాళ్ల ఇంట్లో వాళ్ల బిడ్డగా చెప్పిన ప్రతి మాట అమలు చేస్తూ, వారిని చేయి పట్టుకుని నడిపించగలగడమే లీడర్‌షిప్.

కళింగ యుద్ధం!

బీజేడీ, బీజేపీ హోరాహోరీ


సత్తా చాటే యత్నాల్లో కాంగ్రెస్



ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటైన ఒడిశాలో పాతికేళ్లుగా బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ ఏకఛత్రాధిపత్యం సాగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రతిసారీ మెజారిటీ స్థానాలు బీజేడీకే దక్కుతున్నాయి. గత ఎన్నికల్లో మాత్రం బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. రాష్ట్రంలో పాగా వేసేందుకు బలమైన పునాదులు ఏర్పాటు చేసుకుంది. రాష్ట్రంలో మళ్లీ సత్తా చాటేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. 'కళింగ' యుద్ధంలో ఈసారి మూడు పార్టీలూ హోరాహోరీగా తలపడుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఒడిశాలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో **బీజేడీకి** ఊహించని షాక్ తగిలింది. మొత్తం 21 స్థానాల్లో **ఒంటరిగా పోటీ** చేసి 12 సీట్లకే పరిమితమైంది. 8 సీట్లు కోల్పోయి**ంది. బీజేపీ కూడా** ఒంటరిగా బరిలో నిలిచి 8 స్థానాలు కొల్లగొట్టింది! **2014 ఎన్నికల్లో ఒకే ఒక్క** సీటు గెలుచుకున్న కాషాయ పార్టీ ఏకంగా 7 సీట్ల**ను పెంచుకుంది. కాంగ్రెస్ సార**థ్యంలోని యూపీఏ కూటమి పూర్తిగా చేతులెత్తేసింది. కాంగ్రెస్ 18 చోట్ల పోటీ చేసినా ఒక్క సీటుకే పరిమితమైంది. సీపీఐ, సీపీఎం, జేఎంఎం సున్నా చుట్టాయి.



స్టేట్ స్కాన్

పోలింగ్ తేదీలు: మే 13, 20, 25, జూన్ 1

సర్వేలు ఏం చెబుతున్నాయి...

బీజేడీకి 11, బీజేపీకి 10 లోక్‌సభ స్థానాలు రావొచ్చని సర్వేలు అంచనా వేశాయి. అసెంబ్లీలోనూ బీజేపీ-బీజేడీ మధ్య టఫ్ ఫైట్ ఉండొచ్చని అంచనా. బీజేడీనే అధికారాన్ని నిలబెట్టుకున్నా బీజేపీకి 60 సీట్ల వరకు వస్తాయని సర్వేలు చెబుతున్నాయి.



అభివృద్ధే మా నినాదం, గుర్తింపు. దీనికి ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడుతున్నాయి. ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రాజెక్టులకు మోకాలడ్డుతున్నాయి. అభివృద్ధి నిరోధకులుగా మారాయి. వాటి అసలు రంగేమిటో ఒడిశా ప్రజలకు తెలుసు. వచ్చే పదేళ్లను ఒడిశా దశాబ్దిగా మార్చి చూపిద్దాం. 2036 నాటికి రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా నిలిపేందుకు పునరంకితమవుదాం.

- హింజిలిలో ఎన్నికల ప్రచార ప్రారంభం సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్



ఒడిశాలో రాష్ట్రాన్ని నడుపుతున్నది అధికారులే. బీజేడీ ప్రభుత్వం పూర్తిగా చతికిలపడింది. అపారమైన ఖనిజ వనరులున్నా రాష్ట్ర ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. నవీన్ పట్నాయక్‌కు పాతికేళ్లు అధికారం కట్టబెట్టారు. మాకు ఐదేళ్లు అవకాశమివ్వండి. 20 ఎంపీ స్థానాల్లో గెలిపించండి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం.

- సోనేపూర్ ఎన్నికల సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

నవీన్ మ్యాజిక్...

సీఎంగా, కేంద్ర మంత్రిగా వెలుగు వెలిగిన బిజూ పట్నాయక్ కుమారుడైన నవీన్ 1997లో జనతాదళ్‌ను వీడారు. బిజూ జనతాదళ్ (బీజేడీ) పేరుతో పార్టీ పెట్టి తిరుగులేని శక్తిగా అవతరించారు. ఒడిశా అంటే నవీన్ పట్నాయక్ అనే స్థాయిలో పాతికేళ్లుగా పాతుకుపోయారు. వరుసగా ఐదుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎంగా కొనసాగుతున్న రెండో వ్యక్తిగా (సిక్కింలో పవన్ చామ్లింగ్ తర్వాత) నిలిచారు. తొలుత కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో చేరిన నవీన్ వాజ్‌పేయి ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రిగా చేశారు. 2000 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుతో మెజారిటీ సీట్లను గెల్చుకుని తొలిసారి ఒడిశా సీఎం అయ్యారు. నాటి నుంచి పదవిలో కొనసాగుతున్నారు. 2004లో ఎన్డీఏ కేంద్రంలో అధికారం కోల్పోయినా ఒడిశాలో మాత్రం నవీన్ జోరు తగ్గలేదు. 2008లో కొంధమాల్ జిల్లాలో అల్లర్ల నేపథ్యంలో ఎన్డీఏ కూటమిని వీడారు నాటినుంచీ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు.

లోక్‌సభ పోరులో తడబాటు

2019లోనూ ఒడిశాలో జమిలి ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీలో 147 స్థానాలకు 112 చోట్ల నెగ్గిన బీజేడీ లోక్‌సభ పోరులో 12 సీట్లకు పరిమితమైంది. అనూహ్యంగా 8 సీట్లకు ఎగబాకిన బీజేపీ, అసెంబ్లీలో కూడా బలాన్ని 10 నుంచి 23 సీట్లకు పెంచుకుంది. కాంగ్రెస్ కేవలం 9 అసెంబ్లీ స్థానాలతో సరిపెట్టుకుంది. ఎన్డీఏకు దూరంగా ఉన్నా పార్లమెంట్‌లో పలు కీలక బిల్లులపై ఎన్డీఏకు బీజేడీ మద్దతు కొనసాగిస్తూనే ఉంది! 15 ఏళ్ల తర్వాత నవీన్ మరోసారి ఎన్డీఏలో చేరేలా కన్పించినా చివరికి ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించారు. ప్రధానంగా రాష్ట్రంలో అభివృద్ధి ఎజెండాను నవీన్ ఎన్నికల ప్రచారాస్త్రంగా చేసుకున్నారు.

ఇండియా కూటమి పోటీ ఇచ్చేనా...!

కాంగ్రెస్ పరిస్థితి ఒడిశాలో నానాటికీ తీసికట్టుగా మారుతోంది. నాయకత్వం లేమితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు రెండింట్లోనూ పేలవ ప్రదర్శన చేస్తోంది. ఈసారి కేంద్ర రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవాలని ఆశ పడుతోంది. ఒడిశాలో 93 శాతం హిందువులే. 3 శాతం క్రైస్తవులు, 2.5 శాతం మేర ముస్లింలున్నారు. హిందూ జనాభాలో 40 శాతం ఆదివాసీలు, దళితులు. వీరిలో ఎస్టీలు 23 శాతముంటారు. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ ఓట్లే లక్ష్యంగా చేపట్టిన దేశవ్యాప్త కులగణన అస్త్రం ఒడిశాలో బాగా కలిసొస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో కూడిన మేనిఫెస్టోను కూడా బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఇండియా కూటమిలో భాగంగా జేఎంఎం, సీపీఐ, సీపీఎంతో కలిసి పోటీ చేస్తోంది. మోదీ హయాంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, కార్పొరేట్లతో కుమ్మక్కు అంశాలను కూడా గట్టిగా ప్రచారం చేస్తోంది.

బీజేపీలోకి వలసల జోరు

బీజేపీకి ఒడిశాలో ఒకప్పుడు సరైన ప్రాతినిధ్యమే లేదు. అలాంటిది ఇప్పుడు లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేడీతో నువ్వా నేనా అన్నట్టుగా తలపడే స్థాయికి చేరింది. మోదీ ఫ్యాక్టర్‌తో పాటు అభివృద్ధి ఎజెండా, రామమందిర అంశంతో హిందూ ఓటు బ్యాంకును కొల్లగొట్టేలా ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తోంది. ఈసారి ఎంపీ సీట్లను రెండంకెలకు పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. బీజేడీ నుంచి పలువురు నేతలు కాషాయ తీర్థం పుచ్చుకుంటుండటం విశేషం. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బీజేడీ నేత అరబింద ధాలి బీజేపీలో చేరారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని బల్లగుద్ది చెబుతున్నారు! కటక్ నుంచి వరుసగా 6 సార్లు ఎంపీగా గెలిచిన బీజేడీ నేత భర్తృహరి మహతాబ్ కూడా బీజేపీ గూటికి చేరారు. ఆ పార్టీ టికెట్‌పై అక్కడి నుంచే పోటీ చేస్తున్నారు. ఆయన ఒడిశా తొలి సీఎం కృష్ణహరి మహతాబ్ కుమారుడు. బీజేడీ వ్యవస్థాపక సభ్యుడు కూడా. ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు సిద్ధాంత్ మహాపాత్ర కూడా కాషాయ జెండా కప్పుకున్నారు. ఆయన బరంపురం నుంచి బీజేడీ తరఫున రెండుసార్లు ఎంపీగా గెలిచారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో కీలక నేతగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ ఈసారి సంబాల్‌పూర్ నుంచి బరిలోకి దిగారు. ఆయనను బీజేడీలో నంబర్ టూగా వెలుగుతున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రణబ్ ప్రకాశ్ దాస్ ఢీకొంటున్నారు. దాంతో సంబాల్‌పూర్ హాట్ సీట్‌గా మారింది.

ఓటింగ్ పార్ట్‌నర్ కావాలి?!

tinder

డేటింగ్ పార్ట్‌నర్ కోసం వెళ్తే ఓటింగ్ పార్ట్‌నర్ ఎదురైతే? ప్రముఖ డేటింగ్ యాప్ 'టిండర్' అలాంటి పనే చేస్తోంది! ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వచ్ఛందంగా ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఈ ఎన్నికల్లో 2 కోట్ల మంది యువతీ యువకులకు కొత్తగా ఓటు హక్కు లభించింది. వారిని ఓటేసేలా ప్రోత్సహించేందుకు టిండర్ కృషి చేస్తోంది. 'ఎవ్రీ సింగిల్ ఓట్ కౌంట్స్' (ప్రతి ఓటూ కీలకమే) అంటూ అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఇందుకు యూత్ మీడియా సంస్థ 'యువ', ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ 'మార్క్ యువర్ ప్రెజెన్స్' సాయం తీసుకుంటోంది. టిండర్ యాప్‌లో 'ఓటింగ్ పార్ట్‌నర్ కావాలి', 'ఫస్ట్ టైమ్ ఓటర్', 'ఐ ఓటెడ్' పేరుతో ఓటింగ్ థీమ్డ్ స్టిక్కర్లు పెట్టింది. యూజర్లు తమ ప్రొఫైల్‌లో వాటిని ప్రదర్శించుకోవచ్చు. అలా తమ అభిరుచులను వ్యక్తం చేస్తూ భావ సారూప్యమున్న వ్యక్తులను చేరుకోవచ్చని టిండర్ చెబుతోంది. ఈ నెల 18న మొదలైన ఈ కార్యక్రమం మే 15 దాకా కొనసాగుతుంది.

ఓటేస్తే డేటింగ్!

ఓటేసే వారితో డేటింగ్‌కు ప్రాధాన్యమిస్తామని 60 శాతం జెనరేషన్-జెడ్ యువత ఇటీవలి 'యువ' సర్వేలో చెప్పడం విశేషం! ఎన్నికలను సీరియస్‌గా తీసుకునే వ్యక్తులతో డేటింగ్‌కు ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రాధాన్యమిస్తున్నారు. జెనరేషన్ జెడ్‌కు చెందిన 79 శాతం మంది తమ ఫ్రెండ్ లేదా డేటింగ్ భాగస్వామితో వెళ్లి ఓటేయాలని అనుకుంటున్నట్టు చెప్పారు. ''మా యూజర్లలో సగం మంది 18–25 ఏళ్ల లోపువారే. యువ, తొలిసారి ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు ఈ భాగస్వామ్యం సాయపడుతుందని ఆశిస్తున్నాం'' అంటున్నారు టిండర్ వ్యవస్థాపకుడు చైతన్య ప్రభు.

- సాక్షి, నేషనల్ డెస్క్

యూపీఏకు ప్రజామోదం

వరుసగా రెండోసారి సర్కారు

ఫలించని బీజేపీ 'ఉగ్ర' ప్రచారం

2009 సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారమంతా లౌకికవాదం, ఉగ్రవాదం, మతతత్వం చుట్టూ తిరిగింది. ఐదేళ్లలో అభివృద్ధిని కాంగ్రెస్ ప్రధానంగా నమ్ముకుంది. ఉద్యోగావకాశాల కల్పన, సమాచార హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ వంటి పథకాలను ప్రజలకు గుర్తు చేసింది. మత, భాష, ప్రాంతీయ వాదం, కుల వాదాలకు తాము వ్యతిరేకమంటూ ప్రచారం చేసింది. యూపీఏ హయాంలో ఉగ్రవాదం పెచ్చు మీరిందని బీజేపీ ఎంతగా ప్రచారం చేసినా జనం పట్టించుకోలేదు. మరోవిడత యూపీఏనే ఆశీర్వదించారు... - సాక్షి, నేషనల్ డెస్క్

గతం



2013లో అమెరికా అధ్యక్షుడు ఒబామాతో మన్మోహన్

2009లో 15వ లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 16 నుంచి మే 13 దాకా ఐదు దశల్లో జరిగాయి. 2004లో జనం తన పాలనను తిరస్కరించడంతో నొచ్చుకున్న వాజ్‌పేయి ఇక ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. దాంతో ఎన్డీఏ ప్రధాని అభ్యర్థిగా ఎల్‌కే అద్వానీ తెరపైకి వచ్చారు. కానీ ఆయన పట్ల పలు ప్రాంతీయ పార్టీలు సానుకూలంగా లేవు. యూపీఏలోనూ కాస్త అనిశ్చితి నెలకొంది. మళ్లీ గెలిస్తే రాహుల్‌ను ప్రధాని చేస్తారన్న ప్రచారం సాగినా మన్మోహనే కొనసాగుతారని సోనియా స్పష్టం చేశారు. ఎన్నికలకు 5 నెలల ముందు ముంబై ఉగ్రదాడి 170 మందిని పొట్టన పెట్టుకుంది. ఈ పరిస్థితుల్లో యూపీఏ, ఎన్డీఏ కూటముల్లో దేనికీ మెజారిటీ రాకపోవచ్చని అంతా అంచనా వేశారు. కాంగ్రెస్ బలం 145 నుంచి 206 ఎంపీలకు పెరిగింది. బీజేపీ 22 స్థానాలు కోల్పోయి 116కు పరిమితమైంది. యూపీఏకు 261 స్థానాలు దక్కాయి. మిత్రపక్షాల సాయంతో మొత్తం 322 మంది ఎంపీల మద్దతుతో మన్మోహన్ మరోసారి ప్రధాని అయ్యారు. కాంగ్రెస్‌కు అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 33 స్థానాలు లభించాయి! సీపీఎం సారథ్యంలోని థర్డ్ ఫ్రంట్‌కు 78 సీట్లొచ్చాయి.

15వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	206
బీజేపీ	116
ఎస్పీ	23
బీఎస్పీ	21
జేడీయూ	20
టీఎంసీ	19
డీఎంకే	18
బిజూ జనతాదళ్	14
శివసేన	11
ఇతరులు	86
స్వతంత్రులు	9

నియోజకవర్గాల పునర్విభజన

2001 జనాభా లెక్కల ఆధారంగా 2008లో లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగింది. ఇది కూడా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందంటారు. 499 స్థానాల స్వరూపం మారింది. ఆ మేరకు ఓటర్ల జాబితాల్లోనూ మార్పుచేర్పులు చేయాల్సి వచ్చింది.

కుంభకోణాలతో అప్రతిష్ట

యూపీఏ పాలనలో అతి పెద్ద కుంభకోణాలు వెలుగు చూశాయి. 2జీ స్కాం వీటిలో ముఖ్యమైనది. డీఎంకే నేత ఎ.రాజా టెలికం మంత్రిగా ఉండగా 2008లో 122 కొత్త టెలికం లైసెన్సులు జారీ చేశారు. అనుభవం లేని కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టినట్టు ఆరోపణలొచ్చాయి. దాంతో ఖజానాకు ఏకంగా రూ.1.76 లక్షల కోట్ల నష్టం జరిగిందని కాగ్ పేర్కొంది. 2004–11 మధ్య 194 బొగ్గు గనులను వేలం వేయకుండా కేటాయించడం వల్ల మరో రూ.1.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లినట్టు తేల్చింది!

విశేషాలు

2009 సార్వత్రిక ఎన్నికలు ఇద్దరు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ల సారథ్యంలో జరగడం విశేషం! ఏప్రిల్ 20న తొలి దశ పోలింగ్ ఎన్.గోపాల స్వామి ఆధ్వర్యంలో, మిగతా దశలు నవీన్ చావ్లా పర్యవేక్షణలో జరిగాయి. వీరి విభేదాలు సంచలనంగా మారాయి. ఏప్రిల్ 20న రిటైరైన గోపాలస్వామి, ఆలోగా ఒక విడత పోలింగైనా నిర్వహించాలని భావించారు. దాన్ని ఎన్నికల కమిషనర్‌గా చావ్లా వ్యతిరేకించడం, ఆయన్ను తొలగించాలంటూ రాష్ట్రపతికి గోపాలస్వామి సిఫార్సు చేయడం కలకలం రేపింది.

- 2009 ఎన్నికల్లో ఏకంగా 114 మంది అభ్యర్థులు కేవలం 3 శాతం ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.
- యూపీఏ తొలి ఐదేళ్లలో జీడీపీ వృద్ధి రేటు 9.8 శాతంతో ఆల్‌టైం గరిష్టానికి చేరింది.
- 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని యూపీఏ ప్రభుత్వం విజయవంతంగా అధిగమించింది.

ఫొటో ఓటర్ జాబితాలు

ఎన్నికల సంఘం కొత్తగా ఓటర్ల స్టాంప్ సైజు ఫొటోలతో జాబితాలను ప్రవేశపెట్టింది. దాంతో 2009 లోక్‌సభ ఎన్నికలను ఫొటో ఓటర్ల జాబితాలతో జరిగాయి. అప్పటిదాకా వాటిపై కేవలం పేర్లే ఉండేవి. అయితే అసోం, నాగాలాండ్, జమ్మూ కశ్మీర్‌లో మాత్రం ఫొటోల్లేని జాబితాలనే ఉపయోగించారు.

పరిచయం

డింపుల్ యాదవ్. సైనిక కుటుంబానికి చెందిన సాదాసీదా అమ్మాయి. అఖిలేశ్ యాదవ్‌ను పెళ్లాడి అనూహ్యంగా బడా రాజకీయ కుటుంబంలో అడుగు పెట్టారు. తొలుత తనను అంతగా ఇష్టపడని ములాయం సింగ్ యాదవ్‌కు ప్రియమైన కోడలిగా మారారు. తండ్రీ కొడుకుల రాజకీయ విభేదాలను పరిష్కరించే స్థాయికి ఎదిగారు. అంతే అనూహ్యంగా రాజకీయ అరంగేట్రమూ చేసినా స్వయంకృషితో ఎంపీగానూ రాణించారు. అలా ఇంటా బయటా ఫుల్ మార్కులు కొట్టేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డింపుల్‌కు తొలుత రాజకీయాలు, కులాల గురించి అస్సలు అవగాహన లేదు. ఆమె పుట్టింది పూర్తి భిన్నమైన కుటుంబం కావడమే అందుకు కారణం. అలాంటిది పెళ్లి తర్వాత వాటిపై లోతుగా అవగాహన పెంచుకున్నారు. కుల సమీకరణలకు పుట్టిల్లయిన యూపీ వంటి రాష్ట్రంలో బలమైన నాయకురాలిగా ఎదిగారు. స్వతహాగా మితభాషి అయినా వేదిక ఎక్కితే మాత్రం డింపుల్ అద్భుతమైన వక్త. యూపీలోని మెయిన్‌పురి లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారీ అక్కడి నుంచే సమాజ్‌వాదీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

డింపుల్ యాదవ్

సింపుల్ పొలిటీషియన్



అనూహ్యంగా రాజకీయాల్లోకి...


రాజకీయాల్లోకి రావాలని డింపుల్ ఎప్పుడూ అనుకోలేదు. భర్త అఖిలేశ్ యాదవ్ 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఫిరోజాబాద్, కన్నౌజ్ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసి రెండింట్లోనూ విజయం సాధించారు. కన్నౌజ్‌ను అట్టిపెట్టుకోవడంతో ఫిరోజాబాద్‌కు ఉప ఎన్నిక జరిగింది. దాంతో అక్కడ డింపుల్ బరిలో దిగాల్సి వచ్చింది. కానీ బాలీవుడ్ నటుడు రాజ్‌బబ్బర్ చేతిలో ఓడిపోయారు. 2012లో అఖిలేశ్ యూపీ సీఎం కావడంతో కన్నౌజ్ లోక్‌సభ స్థానమూ ఖాళీ అయింది. అక్కడి నుంచి డింపుల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్నౌజ్‌కు ప్రాతినిధ్యం వహించిన రెండో మహిళగా, యూపీ చరిత్రలో ఏకగ్రీవంగా ఎంపికైన తొలి మహిళా ఎంపీగా రికార్డు నెలకొల్పారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కన్నౌజ్ స్థానం నుంచి మళ్లీ గెలుపొందారు. 2019లో బీజేపీ నేత సుబ్రతా పాఠక్ చేతిలో ఓడిపోయారు. 2022లో మామ ములాయం సింగ్ యాదవ్ మరణంతో మెయిన్‌పురి లోక్‌సభ స్థానం ఖాళీ అయింది. ఉప ఎన్నికలో డింపుల్ భారీ విజయం సాధించారు. ఎక్కువగా మాట్లాడటానికి ఇష్టపడని డింపుల్ 2017 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఒంటరిగా ప్రచారం చేశారు. భర్తకు మద్దతుగా 20 ర్యాలీల్లో ప్రసంగించారు. అంతకుముందు కుటుంబ కలహాల వేళ తండ్రీ కొడుకుల మధ్య సఖ్యత నెలకొల్పారు.

ప్రేమ, పెళ్లి, పిల్లలు..

డింపుల్ మహారాష్ట్రలోని పుణెలో 1978 జనవరి 15న జన్మించారు. తండ్రి ఆర్మీ కల్నల్ రామ్‌చంద్ర సింగ్ రావత్. వారిది ఉత్తరాఖండ్. తండ్రి ఉద్యోగరీత్యా పుణె, భటిండా, అండమాన్, నికోబార్ దీవుల్లోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లలో చదివారు డింపుల్. లక్నో యూనివర్సిటీ నుంచి కామర్స్ డిగ్రీ పొందారు. అఖిలేశ్‌ను తొలిసారి చూసినప్పుడు డింపుల్ ప్లస్ టూ చదువుతున్నారు. ఆమెకు 17 ఏళ్లు, అఖిలేశ్‌కు అప్పుడు 21 ఏళ్లు. ఇంజనీరింగ్ చేస్తున్నారు. కామన్ ఫ్రెండ్ పార్టీలో పరిచయమైంది. తొలి భేటీలోనే మంచి స్నేహితులయ్యారు. పై చదువులకు అఖిలేశ్ ఆస్ట్రేలియా వెళ్లారు. అప్పుడు ఇద్దరూ ఉత్తరాలు రాసుకునేవారు. అలా ప్రేమ చిగురించింది. తిరిగొచ్చాక అఖిలేశ్‌పై పెళ్లి ఒత్తిడి పెరగడంతో డింపుల్ గురించి అమ్మమ్మకు చెప్పారు. కుటుంబ నేపథ్యాలు వేర్వేరు కావడంతో వారు పెళ్లికి అంగీకరించలేదు. అఖిలేశ్ పట్టుదల చూసి తండ్రి ములాయం సింగ్ చివరికి పెళ్లికి అంగీకరించారు. అలా 1999న వారు ఒకటయ్యారు. వారికి ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి అదితి. అర్జున్, టీనా కవలలు. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం, పెయింటింగ్ వేయడానికి ఇష్టపడతారు డింపుల్. ''పిల్లలే దేశ భవిష్యత్తు. రాజకీయాలతోపాటు పిల్లలకు సమయమివ్వడానికి ఇష్టపడతా'' అంటారు.

వైరల్

నయన సజనిక్రిష్ణ తార




మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారట. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పుణ్యమా అని అది ఇప్పుడు కోట్లకు చేరింది. ఎందుకంటే ఇద్దరి మధ్య ఏ కాస్త పోలిక ఉన్నా 'అచ్చం అలాగే' అనే భ్రమ కల్పిస్తున్నారు. తాజా విషయానికి వస్తే... నయనతారలా కనిపిస్తున్న సజనిక్రిష్ణ వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో నయనతారలాగే ఒక పాటకు లిప్-సింక్ చేసింది సజనిక్రిష్ణ. ఎక్స్‌ప్రెషన్స్ అచ్చం నయనతార లాగే ఉన్నాయి. 'నెక్స్ట్ నయనతార' 'మీకు సినిమా అవకాశాలు రావడం ఖాయం' అంటూ నెటిజనులు సజనిక్రిష్ణకు కితాబు ఇచ్చారు. కొందరు మాత్రం 'ఈ ఏఐ కలికాలంలో ఏది నిజమో? ఏది అబద్ధమో తెలియకుండా ఉంది!' అని కామెంట్ సెక్షన్‌లో సందేహాన్ని వెలిబుచ్చారు.

ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేయడం సజనిక్రిష్ణకు ఇదే మొదటిసారి కాదు.

కొన్ని రోజుల క్రితం ఒక సినిమాలోని డైలాగ్‌ను మిమిక్ చేస్తున్న వీడియో వైరల్ అయింది.

మండే ఎండల్లో చల్లని మానవత్వం




ఎండలు మండిపోయే ఈ కాలంలో కాసేపు బయటికి పోవాలంటేనే భయపడే పరిస్థితి. అయినప్పటికీ రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు ఎండ బాధలు తప్పవు. ఎండలో రోడ్డు పక్కన పువ్వులు అమ్ముకుంటున్న ఒక వృద్ధురాలిని చూసి చలించిపోయిన ఒక వ్యక్తి తన కుమారుడితో కలిసి ఆమెకు కొన్ని గిఫ్ట్స్‌తో పాటు గొడుగు ఇచ్చాడు. తరువాత పిల్లాడు ఆ బామ్మ కాళ్లకు నమస్కరించాడు. సంబరంతో తబ్బిబ్బైపోయిన బామ్మ పిల్లాడిని 'చల్లగా ఉండు నాయనా' అని అశీర్వదించి అరటిపండు ఇచ్చింది. మానవత్వానికి అద్దం పట్టే ఈ వీడియో వైరల్ అయింది.

ఉద్యోగ రాజీనామా సంబరం

ఉద్యోగం వస్తే సంబరాలు జరుపుకోవడం వింతేమీ కాదు. ఉద్యోగానికి రాజీనామా చేసి 'నా సామిరంగ' అంటూ సంబరాలు చేసుకోవడమే వింత. ఈ వింతే ఈ వీడియోను వైరల్ చేసింది. విషయంలోకి వస్తే...

పుణెకు చెందిన అంకిత్ మూడు సంవత్సరాలు ఒక కంపెనీలో సేల్స్ అసోసియేట్‌గా ఉద్యోగం చేశాడు. గొర్రె తోకే కాదు తన



జీతం కూడా బెత్తెడే, అది ఎప్పటికీ పెరగదు... అనే సత్యం అతడికి బోధపడింది.

దీంతో ఉద్యోగానికి రాజీనామా చేయడమే కాదు తన రాజీనామా పర్వాన్ని మేళతాళాలతో వేడుక చేసుకున్నాడు.

క్షణాలలో యుగాల సంతోషం

ఒకోసారి చిన్న చిన్న అంశాలు కూడా వీడియో వైరల్ కావడానికి కారణం అవుతాయి అని చెప్పే వీడియో ఇది. ముంబైలో 'లతా దీనానాథ్ మంగేష్కర్' పురస్కారాన్ని ఉషా మంగేష్కర్ ద్వారా అందుకున్నాడు బిగ్ బి అమితాబ్. స్టేజీపై ఉన్న అమితాబ్ దివ్యాంగురాలైన ఒక అమ్మాయి తన దగ్గరకు వస్తుండడాన్ని గమనించి తనే ఎదురువెళ్లి ఆమెను ప్రేమగా పలకరించాడు. ఆమె అమితాబ్ కాళ్లకు నమస్కరించగా, రెండు చేతులు జోడిస్తూ చిరునవ్వుతో బిగ్ బి ప్రతి నమస్కారం చేశాడు. బిగ్ బితో మాట్లాడిన క్షణాల వ్యవధి ఆ అమ్మాయి ముఖంలో యుగాల సంతోషాన్ని తీసుకువచ్చింది.



జైల్ మేన్ జైల్ ఉమన్




ఇన్‌స్టాలో ఫాలోయెర్స్‌ను పెంచుకోవడానికి ఇన్‌ఫ్లూయెన్సర్లు తలతిక్క వేషాలేస్తున్నారు. ఢిల్లీకి చెందిన ఒక ఇన్‌ఫ్లూయెన్సర్ల జంట స్పైడర్ మేన్, స్పైడర్ ఉమన్ పేరుతో ఢిల్లీలో చక్కర్లు కొట్టింది. పోలీసులు వారికి ఫైన్ వేశారు. నెక్స్ట్ జైలే అంటున్నారు.

ఆదిత్యా అనే కుర్రాడికి గట్టిగా చూస్తే 9 వేల మంది ఫాలోయెర్స్ ఉన్నారు ఇన్‌స్టాలో. దానిని పెంచుకోవడానికి స్పైడర్ మేన్ వేషం వేసుకుని ఢిల్లీలో బైక్ ఎక్కి తిరుగుతుంటాడు. ఒక్కోసారి ఆ వేషంలోనే ఉల్లిపాయలు అమ్మి కొంత వినోదం సృష్టించాడు. అక్కడికి పర్లేదు కాని తాజాగా మరో అమ్మాయిని స్పైడర్ ఉమన్‌గా తయారు చేసి బైక్ వెనుక కూచోబెట్టుకుని ద్వారకా (సౌత్‌వెస్ట్ ఢిల్లీ) రోడ్ల మీద చక్కర్లు కొట్టాడు. ఈ వీడియో వైరల్ అయ్యింది. పోలీసులు వెంటనే లెక్క చూశారు. వాళ్లతో వ్యవహారం మామూలుగా ఉండదుగా. బైక్‌కు నంబర్ ప్లేట్ లేదు, రియర్ మిర్రర్ లేదు. డ్రైవింగ్ లైసెన్స్ లేదు. హెల్మెట్లు లేవు. వెంటనే పోలీసులు బైక్ మీద ఉన్న ఇద్దరినీ, ఈ తతంగం షూట్ చేసిన మరో వ్యక్తిని స్టేషన్‌కు పట్టుకు వచ్చారు. మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ మీద విడిచి పెట్టారు. అంతే కాదు భారీ ఫైన్ కూడా వేశారు. రేపు జడ్జిగారికి తిక్క పుడితే స్పైడర్ మేన్ కాస్త జైల్ మేన్ కాకతప్పదు.

హాయ్... నా పేరు లయన్ కుమారి




పిల్లల్లో ఉండే సహజమైన క్రియేటివిటీకి అద్దం పట్టే ఈ వీడియో క్లిప్ ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. రిలే కే స్కాట్ అనే చిన్నారి సింహగర్జనను పర్‌ఫెక్ట్‌గా ఇమిటేట్ చేసి నెటిజనుల చేత జేజేలు అందుకుంటోంది.

'మా ఇంట్లోకి సింహం దూరిందని భయపడ్డాను' అంటుంది రిలే తల్లి చమత్కారంగా. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కొద్ది కాలంలోనే ఈ వీడియో క్లిప్ 2 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

అమ్మా.. నాన్న వచ్చారు!




సినిమాలను తలపించే సూపర్ వైరల్ సీన్ ఇది. మధ్యప్రదేశ్‌లోని రంజ్రా గ్రామంలో జరుగుతున్న ఒక వివాహ వేడుకలోకి ఒక డేగ వచ్చింది. విశేషం ఏమిటంటే పెళ్లితంతు పూర్తయ్యే వరకు ఈ డేగ ఒక కుర్చీలో కూర్చొని ఉంది. చనిపోయిన వధువు తండ్రి డేగ రూపంలో వచ్చి కుమార్తెను ఆశీర్వదించాడని స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు.

పెళ్లికి ముందు వధువు తండ్రి జలమ్‌సింగ్ ఒక యాక్సిడెంట్‌లో చనిపోయాడు. పెళ్లి డేట్ ఫిక్స్ చేసి, శుభలేఖలు పంచిన తరువాత... పెళ్లి వాయిదా వేయడం బాగుండదని భావించారు బంధుమిత్రులు.

దీంతో సింపుల్‌గా పెళ్లి జరిపించారు.

'జలమ్‌సింగ్ తన కుమార్తె పెళ్లి వేడుకను చూడడానికి డేగ రూపంలో వచ్చాడు' అనేది మూఢనమ్మకమా, ఆధారం లేని ఊహా అనే విషయం పక్కన పెడితే పెళ్లిలో కనిపించిన డేగ ఫొటోలు చాలామందికి కళ్లలో నీళ్లు తెప్పిస్తున్నాయి.

హెల్త్

ఈ ఎండల్లో కిడ్నీ ఎమర్జెన్సీల నివారణ ఇలా..!



ఈ ఎండలతో దేహానికి వడదెబ్బ లాంటి ప్రమాదాలు పొంచి ఉన్నట్టే మూత్రపిండాల (కిడ్నీల)కు సంబంధించి కూడా కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. 'అక్యూట్ కిడ్నీ ఇంజ్యూరీ' (ఏకేఐ), మూత్రవ్యవస్థలో రాళ్లు ఏర్పడే 'యూరోలిథియాసిస్', కొన్నిరకాల మూత్రసంబంధమైన ఇన్ఫెక్షన్లు, వడదెబ్బ కారణంగా ఏర్పడే కిడ్నీ సమస్యలు ఇందులో కొన్ని. ఈ మెడికల్ ఎమర్జెన్సీ సమయాల్లో ఏం చేయాలి, ఎలా ఎదుర్కోవాలి వంటి వాటి గురించి తెలిపే కథనమిది.

ఏప్రిల్ నెల ఇంకా ముగియక ముందే... నమోదవుతున్న ఉష్ణోగ్రతల తీవ్రత 40 డిగ్రీలకు పైమాటే. దాంతో డీహైడ్రేషన్ వల్ల సమస్యలకు గురయ్యే కీలక అవయవాల్లో కిడ్నీలు ముఖ్యమైనవి.

కిడ్నీపై దుష్ప్రభావాలిలా...

● **అక్యూట్ కిడ్నీ ఇంజ్యూరీ (ఏకేఐ):** దేహంలో నీరు తగ్గినప్పుడు రక్తం చిక్కబడి, రక్తప్రవాహ వేగమూ మందగిస్తుంది. ఫలితంగా అన్ని అవయవాలకు లాగే కిడ్నీకి అందే రక్త పరిమాణం కూడా తగ్గుతుంది. దాంతో దేహంలో పేరుకుపోయే వ్యర్థాలను బయటకు పంపే వేగమూ తగ్గుతుంది. దాంతో కిడ్నీల పనితీరులో అకస్మికంగా మార్పులు వచ్చి, అస్తవ్యస్తంగా పని చేస్తాయి. ఈ కండిషన్ పేరే 'అక్యూట్ కిడ్నీ ఇంజ్యూరీ'. దీని దశలు:



ఆలిగ్యూరిక్ ఫేజ్: ఈ దశలో యూరిన్ ఔట్‌పుట్ బాగా తగ్గి, కిడ్నీల్లోని రీనల్ ట్యూబ్యూల్స్ అనే సన్నటి నాళాలు దెబ్బతింటాయి.

డైయూరెటిక్ ఫేజ్: ఈ దశలో కిడ్నీ తనను తాను రిపేర్ చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది.

రికవరీ ఫేజ్: ఒకవేళ తగినన్ని నీళ్లు, ద్రవాహారం అంది రీ-హైడ్రేషన్ జరిగితే...కిడ్నీల పనితీరు మెరుగయ్యే అవకాశం ఉంది.

ఏకేఐ లక్షణాలు...

● మూత్రం తక్కువగా రావడం. ● ఒంట్లో వాపు ● వికారం ● తీవ్రమైన నిస్సత్తువ, అలసట ● శ్వాస వేగంగా తీసుకుంటూ ఉండటం... సరిగా అందకపోవడం.

చికిత్స... ఇది పరిస్థితి తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా సెలైన్ పెట్టి, దేహానికి తగినంత రీహైడ్రేషన్ జరిగేలా చూడటం. ● అవసరాన్ని బట్టి యాంటిబయాటిక్స్ వాడటం. ● కిడ్నీలు తాత్కాలికంగా పనిచేయక దేహంలో బాగా వ్యర్థాలు పేరుకుపోయినప్పుడు అవసరాన్ని బట్టి డయాలసిస్ చేయాల్సి రావడం.

కిడ్నీలో రాళ్లు (యూరోలిథియాసిస్): మూత్ర వ్యవస్థలో లవణాల స్ఫటికాలతో రాళ్లు ఏర్పడటాన్ని 'యూరోలిథియాసిస్' అంటారు. దీన్నే వాడుక భాషలో మూత్రపిండాల్లో రాళ్లు రావడంగా చెబుతారు. తీవ్రమైన నడుము నొప్పి, మూత్రంలో రక్తం వంటి లక్షణాలతో వ్యక్తమయ్యే ఈ సమస్యలో రాళ్లు చిన్నగా ఉంటే మందులతో పాటు, తగినన్ని నీళ్లు, ద్రవాహారం తీసుకోవడం, రాళ్లు ఏర్పడేందుకు అవకాశం ఉండే కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలను సూచిస్తారు. రాయి పరిమాణాన్ని బట్టి కొన్ని ప్రక్రియలతో చూర్ణమయ్యేలా చేసి, మూత్రంతో పాటు పోయేలా చూస్తారు. కుదరనప్పుడు శస్త్రచికిత్స చేస్తారు.

మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు: వ్యర్థాలు బయటకు పోని సందర్భాల్లో... అవి దేహంలో పేరుకుపోయి, బ్యాక్టీరియా పెరిగిపోయి, మూత్రవ్యవస్థలో ఇన్ఫెక్షన్లు వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మూత్ర విసర్జనలో తీవ్ర ఇబ్బంది, నొప్పి, మూత్రం బొట్లు బొట్లుగా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనికి యాంటీబయాటిక్స్‌తో చికిత్స అందిస్తారు.

నివారణ కోసం...

● సాధ్యమైనంతవరకు నీడపట్టునే ఉండటం. ● తేలికపాటి రంగులతో కూడిన, గాలి తగిలేలా సౌకర్యవంతమైన దుస్తులు ధరించడం, ఎండలోకి వెళ్లేటప్పుడు గొడుగు, బ్రిమ్ హ్యాట్, స్కార్ఫ్ వంటివి వాడటం. ● తగినన్ని నీళ్లు తాగుతూ, లవణాలు (ఎలక్ట్రోలైట్స్) అందేలా చూసుకోవడం. ● డాక్టర్ సూచన లేకుండా డై-యూరెటిక్స్, నొప్పి నివారణ మందుల్ని వాడకపోవడం.





డా. జి. రవీంద్రవర్మ,
సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్
విశాఖపట్నం

వేసవిలో ఒంటి దుర్వాసన తగ్గాలంటే...



ఈ సీజన్‌లో తీవ్రమైన ఉక్కపోత వల్ల చెమట పట్టడం సాధారణం. అయితే చెమట మూలంగా, కొన్ని ఇతర సమస్యల వల్ల కొందరి ఒంటి నుంచి దుర్వాసన వస్తుంటుంది. వైద్యపరిభాషలో 'బ్రామ్ హిడరోసిస్' అనే ఈ సమస్య ఎందుకు వస్తుంది, దీన్ని అధిగమించడం ఎలాగో తెలుసుకుందాం.

నిజానికి చాలామంది చెమట నుంచి దుర్వాసన వస్తుందనుకుంటారు. కానీ చెమటలో ఎలాంటి దుర్వాసనా ఉండదు. చెమటలో పెరిగే బ్యాక్టీరియా వల్లనే ఈ దుర్వాసన. అదెలాగంటే...

రెండు రకాల గ్రంథులతో చెమట...

మొదటివి ఎక్రైన్ గ్లాండ్స్: చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకూ అందరిలోనూ ఉండే ఈ గ్రంథులు జన్యుస్వభావాన్ని అనుసరించి శరీరమంతటా వ్యాపించి ఉంటాయి.

రెండోరకం అపోక్రైన్ గ్లాండ్స్: బాహుమూలాలతో పాటు దేహంలోని కొన్ని ఇతర ప్రదేశాలలో ఉండే ఈ గ్రంథులు చిన్నప్పటినుంచి ఉన్నప్పటికీ, యుక్తవయసు తర్వాతే పనిచేయడం మొదలుపెడతాయి.

దుర్వాసన ఎందుకంటే...

యుక్తవయస్కులైన నాటి నుంచి ఎక్రైన్ గ్రంథులతో పాటు కొత్తగా క్రియాశీలమైన అపోక్రైన్ గ్రంథుల నుంచి స్రవించే చెమటలో ప్రొపినీ అనే బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది చెమటను ఇతర రసాయన పదార్థాలుగా మార్చే ప్రక్రియలో దుర్వాసననిచ్చే పదార్థాలు ఉత్పన్నం కావడంతో శరీరం నుంచి దుర్వాసన వస్తుంది.

దుర్వాసనకు కారణమయ్యే మరికొన్ని అంశాలు...

జన్యుపరమైనవి: సాధారణంగా పేరెంట్స్‌లో ఎవరికైనా ఆ సమస్య ఉంటే వారి నుంచి అది పిల్లలకూ వచ్చే అవకాశం ఉంది.

ఊబకాయం: స్థూలకాయంతో ఉన్నవారి నుంచి ఇంటర్‌ట్రిగో, ట్రైకోమైసోసిస్ ఆగ్జిలరీస్, ఎరిత్మా వంటి కొన్ని చర్మ సమస్యలు / స్కిన్ ఇన్ఫెక్షన్లతో బాధపడేవారిలోనూ దుర్వాసన సమస్య ఎక్కువే.

కొన్ని దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారిలో: డయాబెటిస్, గౌట్, కిడ్నీ జబ్బులు, కాలేయ సమస్యలు, టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నవారి నుంచి కూడా చెడువాసన వస్తుంటుంది.

అలాగే... పర్సనల్ హైజీన్ అంతగా పాటించని వారిలో, మద్యం తాగే వారి నుంచి, పెన్సిలిన్, బ్రోమైడ్స్ వంటి మందులు వాడే వారి శరీరం నుంచి దుర్గంధం వెలువడుతుంది

కొన్ని ఆహారాలతో: మేపుళ్లు ఎక్కువగా తినే వారి నుంచి, ఉల్లి, వెల్లుల్లి, మాంసం, కెఫిన్ ఉన్న పానీయాలు ఎక్కువగా తీసుకునేవారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది.

మేనేజ్‌మెంట్: వాటిని పూర్తిస్థాయి ఔషధాలుగా పేర్కొనడం సబబు కాకపోయినా... వాటినే పూతమందుల్లా ఉపయోగిస్తూ, తమ సమస్యనుంచి చాలావరకు విముక్తం కావచ్చు. ఇవి డియోడరెంట్స్, యాంటీ పెర్‌స్పిరెంట్స్ అని రెండు రకాలు. ఇందులో యాంటీ పెర్‌స్పిరెంట్స్‌ను చెమట ఎక్కువగా వచ్చేచోట పూస్తారు.

డియోడరెంట్స్: డియోడరెంట్స్‌ను చర్మంపై ఎక్కడైనా పూయవచ్చు. వీటిల్లో ఉండే అమోనియమ్ అలమ్, పొటాషియమ్ అలమ్ చెమటలోని వాసన కలిగించే బ్యాక్టీరియాను తాత్కాలికంగా నశింపజేస్తాయి.



యాంటీపెర్‌స్పిరెంట్స్: పేరును బట్టి ఇవి చెమటను తగ్గిస్తాయనే అపోహ కలుగుతుంది గానీ అది వాస్తవం కాదు. ఇందులోని అల్యూమినియమ్ క్లోరోహైడ్రేట్, అల్యూమినియం క్లోరైడ్, అల్యూమినియమ్ ఫీనాల్ సల్ఫొనేట్, అల్యూమినియమ్ సల్ఫేట్, జిర్కోనియమ్ క్లోరో హైడ్రేట్స్ వంటి లవణాలు చెమట గ్రంథుల్ని తాత్కాలికంగా మూసివేసి, చెమటలు చాలా తక్కువగా పట్టేలా చేస్తాయి. దాంతో ప్రొపినీ పెరుగుదల పరిమితంగా ఉండి, దుర్వాసన తగ్గుతుంది. వీటిని దేహంలో చెమట ఎక్కువగా వచ్చే చోట్ల మాత్రమే వాడతారు.

యాంటీ బ్యాక్టీరియల్ వాషెస్: ఇవి కూడా దేహ దుర్వాసనను దూరం చేసేందుకు ఉపయోగపడతాయి.

ఇలా వాడాలి...

● **డియోడరెంట్స్‌**ను రోజూ స్నానం చేశాక బయటికి వెళ్లే ముందు రాసుకోవాలి. చర్మతత్వానికి సరిపడే వాటిని మాత్రమే వాడాలి.

● **యాంటీపెర్‌స్పిరెంట్స్‌**ను రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు, స్నానం చేశాక, ఒంటిని పొడిగా తుడుచుకున్న తర్వాత వాడాలి. నిద్ర లేవగానే శుభ్రం చేసుకోవాలి. ఇలా ఓ 15 రోజులు చేయాలి. ఆ తర్వాత రోజు విడిచి రోజు చొప్పున మరో నెలరోజులు వాడాలి. యాంటీ పెర్‌స్పిరెంట్స్‌ను నోరు, ముక్కు, కనురెప్పలు, మర్మావయవాల వద్ద వాడకూడదు.

యాంటీ బ్యాక్టీరియల్ వాషెస్‌ను స్నానం చేసేటప్పుడు వాడాలి.

నివారణ ఇలా...

● రోజూ రెండుసార్లు స్నానం చేయడం. ● బాహుమూలాలనూ, చెమట బాగా పట్టే ప్రాంతాల్లో సబ్బుతో శుభ్రం చేసుకోవడం. ● చెమట ఎక్కువగా పట్టే ప్రాంతాలను పొడిగా ఉంచుకోవడం. ● దేహ దుర్వాసనను పెంచే ఉల్లి, వెల్లుల్లి వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం లేదా పరిమితంగా తీసుకోవడం. ● మంచినీళ్లు ఎక్కువగా తాగడం. వ్యాయామం చేయడం.



డా. స్వప్నప్రియ,
సీనియర్ డర్మటాలజిస్ట్
హైదరాబాద్

మెడి టిప్

వేసవిలో దాహం తీర్చుకునే ప్రయత్నంలో అనారోగ్యకరమైన పానీయాలు తాగడం లేదా ఆకలి తీరడానికి బయటి పదార్థాలు తీసుకోవడం వల్ల విరేచనాలు, కడుపునొప్పివంటి ఇబ్బందులు రావచ్చు. అసలే డీ-హైడ్రేషన్ ప్రమాదం ఎక్కువ. దీనికి తోడు నీళ్ల విరేచనాల వంటి అనర్థాలు చోటు చేసుకుంటే దేహం వేగంగా ద్రవాలను కోల్పోయి ప్రమాదకరమైన స్థితికి చేరుకోవచ్చు. ఈ సమస్యలు

వేసవిలో జీర్ణ వ్యవస్థ సమస్యల నివారణకు...

రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలివి... ● చిన్న చిన్న మోతాదుల్లో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవాలి. ● మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి. ● ఆకుకూరలు, తాజాపండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ● శీతల పానీయాల కంటే పండ్ల రసాలకే ప్రాధాన్యమివ్వాలి. ● అపరిశుభ్రమైన ప్రదేశాల్లో అమ్మే చెరుకురసం వంటి వాటికి దూరంగా ఉండాలి. ● వంటల్లో కొత్తిమీర, అల్లం వంటివాటిని ఎక్కువగా వాడాలి.



‘ఫిడే’ మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌కు సిద్ధం

2024–25 ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్‌లో పాల్గొనే 14 మంది గ్రాండ్‌మాస్టర్లను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, తమిళనాడు క్రీడాకారిణి ఆర్‌.వైశాలి భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో మొత్తం 20 మంది ప్లేయర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఫిడే నిర్దేశించిన అర్హత (ర్యాంకింగ్‌) ప్రకారం 14 మందికి నేరుగా చోటు దక్కగా... మిగతా ఆరుగురిని నిర్వాహకులు నామినేట్‌ చేస్తారు. ముగ్గురు మాజీ ప్రపంచ చాంపియన్లు (క్లాసికల్‌) టాన్‌ జోంగ్యి, అలెగ్జాండ్రా కోస్టెనిక్‌, మారియా ముజీచుక్‌ కూడా టోర్నీ బరిలో నిలిచారు. ప్రస్తుత చాంపియన్‌ జు వెన్‌జున్‌ ఈ ఈవెంట్‌నుంచి తప్పుకుంది. మహిళల చెస్‌ను మరింత ఆదరణ పెంచే క్రమంలో పలు మార్పులతో గ్రాండ్‌ప్రి సిరీస్‌ను ఈ సారి కొత్తగా నిర్వహించనున్నట్లు ఫిడే సీఈఓ ఎమిల్‌ సుటోవ్‌స్కీ వెల్లడించారు. ఇటీవల జరిగిన క్యాండిడేట్స్‌ టోర్నీలో హంపి రెండో స్థానంలో నిలిచింది.

ముంబైపై ఢిల్లీ పైచేయి

- 10 పరుగులతో క్యాపిటల్స్‌ గెలుపు
- చెలరేగిన ఫ్రేజర్‌, హోప్‌
- తిలక్‌ మెరుపులు వృథా


జేక్‌ ఫ్రేజర్‌ మెక్‌గుర్క్‌

న్యూఢిల్లీ: సీజన్‌లో ఢిల్లీ లెక్క సరిచేసింది... గత మ్యాచ్‌లో ముంబై చేతిలో ఓటమికి సొంతగడ్డపై ప్రతీకారం తీర్చుకుంది... 10 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. మొదట ఢిల్లీ క్యాపిటల్స్‌ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు చేసింది. ‘ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌’ జేక్‌ ఫ్రేజర్‌ మెక్‌గుర్క్‌ (27 బంతుల్లో 84; 11 ఫోర్లు, 6 సిక్స్‌లు), ట్రిస్టన్‌ స్టబ్స్‌ (25 బంతుల్లో 48నాటౌట్‌; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్‌ (17 బంతుల్లో 41; 5 సిక్స్‌లు) చెలరేగిపోయారు. తర్వాత ముంబై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసి ఓడింది. తిలక్‌ వర్మ (32 బంతుల్లో 63; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్‌ పాండ్యా (24 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు.

మెరుపు బ్యాటింగ్‌...

అభిషేక్‌ పొరేల్‌ (27 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్‌)తో ఇన్నింగ్స్‌ ఓపెన్‌ చేసిన ఫ్రేజర్‌ తొలి ఓవర్లోనే 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 19 పరుగులు, బుమ్రా వేసిన రెండో ఓవర్లోనూ 18 పరుగులు రాబట్టడం విశేషం. దీంతో 2.4 ఓవర్లలో జట్టు స్కోరు 50కి చేరగా, ఇందులో ఫ్రేజర్‌ ఒక్కడివే 42 పరుగులున్నాయి! ఇదే దూకుడుతో అతను ఈ సీజన్‌లో తన ఫాస్టెస్ట్‌ ఫిఫ్టీ (15 బంతుల్లో) రికార్డును మళ్లీ సమం చేశాడు. ఓపెనింగ్‌ జోరులో ఢిల్లీ పవర్‌ప్లేలో 92/0 స్కోరు చేసింది. మరుసటి ఓవర్లోనే స్కోరు 100 పరుగులకు చేరుకోగా, కాసేపటికే ఫ్రేజర్‌, పొరెల్‌ నిష్క్రమించారు. కానీ ఆ తర్వాత కూడా షై హోప్‌, రిషభ్‌ పంత్‌ (19 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టబ్స్‌ల వీరబాదుడు వల్ల స్కోరు–హోరు ఏమాత్రం తగ్గలేదు. ల్యూక్‌ వుడ్‌ వేసిన 18వ ఓవర్లో స్టబ్స్‌ 4, 4, 6, 4, 4, 4లతో 26 పరుగుల్ని పిండుకున్నాడు.

టాప్‌–3 వైఫల్యంతో...

భారీ లక్ష్యం ఎదురైనప్పుడు కచ్చితంగా టాపార్డర్‌ గట్టి పునాది వేయాలి. కానీ రోహిత్‌ శర్మ (8), ఇషాన్‌ కిషన్‌ (20), సూర్యకుమార్‌ (26) విఫలమవడంతో 65/3 స్కోరు వద్దే పరాజయానికి బాట పడినట్లయింది. ఆపై తిలక్‌ వర్మ, కెప్టెన్‌ హార్దిక్‌ పాండ్యాలిద్దరు ధాటిగా ఆడారు. స్వల్ప వ్యవధిలో పాండ్యా, నేహల్‌ (4) వికెట్లు పారేసుకోగా... క్రీజులో పోరాడుతున్న తిలక్‌కు జతయిన టిమ్‌ డేవిడ్‌ (17 బంతుల్లో 37; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కొత్త ఆశలు రేపారు. ముకేశ్‌ 18వ ఓవర్లో డేవిడ్‌ను ఎల్బీగా పంపడంతో ముంబైకి దారులు మూసుకుపోయాయి. ఆఖరి ఓవర్లో 25 పరుగుల కావాల్సి వుండగా... తిలక్‌, చావ్లా (10) వికెట్లు కోల్పోయిన ముంబై 14 పరుగులే చేసింది.


తిలక్‌

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్‌ ఇన్నింగ్స్‌: ఫ్రేజర్‌ (సి) నబీ (బి) చావ్లా 84; పొరేల్‌ (సి) ఇషాన్‌ (బి) నబి 36; హోప్‌ (సి) తిలక్‌ (బి) వుడ్‌ 41; పంత్‌ (సి) రోహిత్‌ (బి) బుమ్రా 29; స్టబ్స్‌ నాటౌట్‌ 48; అక్షర్‌ నాటౌట్‌ 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు)** 257. **వికెట్ల పతనం:** 1–114, 2–127, 3–180, 4–235. **బౌలింగ్‌:** వుడ్‌ 4–0–68–1, బుమ్రా 4–0–35–1, తుషార 4–0–56–0, చావ్లా 4–0–36–1, హార్దిక్‌ 2–0–41–0, నబీ 2–0–20–1.

ముంబై ఇండియన్స్‌ ఇన్నింగ్స్‌: ఇషాన్‌ కిషన్‌ (సి) అక్షర్‌ (బి) ముకేశ్‌ 20; రోహిత్‌ (సి) హోప్‌ (బి) ఖలీల్‌ 8; సూర్య (సి) విలియమ్స్‌ (బి) ఖలీల్‌ 26; తిలక్‌ రనౌట్‌ 63; హార్దిక్‌ (సి) ముకేశ్‌ (బి) రసిఖ్‌ 46; నేహల్‌ (సి) పంత్‌ (బి) రసిఖ్‌ 4; డేవిడ్‌ (ఎల్బీ) (బి) ముకేశ్‌ 37; నబీ (సి) హోప్‌ (బి) రసిఖ్‌ 7; చావ్లా (సి) హోప్‌ (బి) ముకేశ్‌ 10; వుడ్‌ నాటౌట్‌ 9; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 247. **వికెట్ల పతనం:** 1–35, 2–45, 3–65, 4–136, 5–140, 6–210, 7–223, 8–234, 9–247. **బౌలింగ్‌:** విలియమ్స్‌ 3–0–34–0, ఖలీల్‌ 4–0–45–2, ముకేశ్‌ 4–0–59–3, కుల్దీప్‌ 3–0–47–0, అక్షర్‌ 2–0–24–0, రసిఖ్‌ 4–0–34–3.

ఐపీఎల్‌ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్‌	9	8	1	16	0.694
కోల్‌కతా	8	5	3	10	0.972
హైదరాబాద్‌	8	5	3	10	0.577
లక్నో	9	5	4	10	0.059
ఢిల్లీ	10	5	5	10	-0.276
చెన్నై	8	4	4	8	0.415
గుజరాత్‌	9	4	5	8	-0.974
పంజాబ్‌	9	3	6	6	-0.187
ముంబై	9	3	6	6	-0.261
బెంగళూరు	9	2	7	4	-0.721

నోట్‌: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్‌ రన్‌రేట్‌

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్‌ × బెంగళూరు
వేదిక: అహ్మదాబాద్‌
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

చెన్నై × హైదరాబాద్‌
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

జ్యోతి సురేఖ స్వర్ణాల ‘హ్యాట్రిక్‌’

- మూడు విభాగాల్లో మెరిసిన ఆర్చర్‌
- భారత్‌ ఖాతాలో 4 స్వర్ణాలు, 1 రజతం
- వరల్డ్‌ కప్‌ స్టేజ్‌ 1 టోర్నీ కాంపౌండ్‌



షాంఘై (చైనా): ప్రపంచ ఆర్చరీ కాంపౌండ్‌ విభాగంలో భారత్‌కు చెందిన వెన్నం జ్యోతిసురేఖ మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వరల్డ్‌ కప్‌ స్టేజ్‌ 1 టోర్నీలో శనివారం జ్యోతి సురేఖ 3 స్వర్ణ పతకాలతో మెరిసింది. దీపికా కుమారి (2021) తర్వాత వరల్డ్‌ కప్‌లో 3 పసిడి పతకాలు గెలిచిన రెండో భారత ఆర్చర్‌గా సురేఖ నిలిచింది. మహిళల, మిక్స్‌డ్‌, టీమ్‌ ఈవెంట్లలో ఆమె అగ్రస్థానాన్ని సాధించడం విశేషం. మహిళల ఈవెంట్‌ ఫైనల్లో టాప్‌ సీడ్‌ ఆంద్రియా బెకెరా (మెక్సికో)ను ఓడించింది. ఇద్దరి స్కోర్లు 146–146తో సమం కాగా...షూటాఫ్‌ ఫినిష్‌తో సురేఖ పైచేయి సాధించింది. మిక్స్‌డ్‌ ఈవెంట్‌ ఫైనల్లో జ్యోతిసురేఖ – అభిషేక్‌ వర్మ ద్వయం 158–157 స్కోరుతో లిసెల్‌ జాత్మా – రాబిన్‌ జాత్మా (ఎస్తోనియా)పై విజయం సాధించింది. మహిళల టీమ్‌ ఈవెంట్‌ తుది పోరులోలో సురేఖ, అదితి స్వామి, పర్ణీత్‌ కౌర్‌లతో కూడిన భారత జట్టు 236–225 తేడాతో ఇటలీ జట్టుపై గెలుపొందింది. పురుషుల విభాగంలో మరో 2 పతకాలు కూడా భారత్‌ ఖాతాలో చేరాయి. పురుషుల వ్యక్తిగత విభాగంలో ప్రియాన్ష్‌ రజతం గెలుచుకున్నాడు. ఫైనల్లో అతను 147–150 తేడాతో నికో వీనర్‌ (ఆస్ట్రియా) చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే పురుషుల టీమ్‌ ఈవెంట్‌లో భారత్‌కు బంగారం లభించింది. ఫైనల్‌ అభిషేక్‌ వర్మ, ప్రియాన్ష్‌, ప్రథమేశ్‌లతో కూడిన భారత జట్టు 238–231తో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఈ టోర్నీ రికర్వ్‌ విభాగం ఫైనల్‌ మ్యాచ్‌లు ఆదివారం జరుగుతాయి.

భారత జట్ల శుభారంభం

చెంగ్డు (చైనా): ప్రతిష్టాత్మక టీమ్‌ ఈవెంట్లు థామస్‌ కప్‌, ఉబెర్‌ కప్‌ బ్యాడ్మింటన్‌ టోర్నీల్లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. థామస్‌ కప్‌లో భాగంగా గ్రూప్‌ ‘సి’లో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల టీమ్‌ 4–1 తేడాతో థాయిలాండ్‌పై విజయం సాధించింది. మహిళల టోర్నీ ఉబెర్‌ కప్‌ గ్రూప్‌ ‘ఎ’లో భారత్‌ 4–1 స్కోరుతోనే కెనడాను ఓడించింది. తొలి సింగిల్స్‌లో భారత ఆటగాడు హెచ్‌ఎస్‌ ప్రణయ్‌పై కున్లావట్‌ వితిడ్‌సన్‌ గెలుపొందాడు. అయితే ఆ తర్వాత వరుసగా నాలుగు విజయాలు భారత్‌ ఖాతాలో చేరాయి. తీరారట్‌సకుల్‌పై లక్ష్యసేన్‌, సరన్‌జమ్‌శ్రీపై కిడాంబి శ్రీకాంత్‌ విజయం సాధించారు. తొలి డబుల్స్‌లో సుక్‌ఫున్‌ – తీరారట్‌సకుల్‌ జంటపై సాత్విక్‌ సాయిరాజ్‌ – చిరాగ్‌శెట్టి జోడి... పన్‌పనిచ్‌ – సాథోన్‌పై ఎంఆర్‌ అర్జున్‌ – ధ్రువ్‌ కపిల గెలిచారు. ఉబెర్‌ కప్‌లో తొలి సింగిల్స్‌లో మిచెల్‌ లిపై అస్మిత చాలిహ, కేథరీన్‌ – జెస్లీన్‌పై ప్రియ – శ్రుతి, వెన్‌ జాంగ్‌పై ఇషారాణి బారువా గెలుపొందారు. అయితే రెండో డబుల్స్‌లో జాకీ డెంట్‌ – క్రిస్టల్‌ లాయ్‌ చేతిలో సిమ్రన్‌ సింఘీ – రితిక ఠాకర్‌ ఓడిపోగా...చివరి మ్యాచ్‌లో ఎలియానా జాంగ్‌పై అన్మోల్‌ ఖర్బ్‌ విజయం సాధించింది.

రాజస్తాన్‌ దర్జాగా...

- ప్లేఆఫ్స్‌ దిశగా మరో అడుగు
- 7 వికెట్లతో లక్నోపై గెలుపు
- రాణించిన సామ్సన్‌, జురేల్‌


సామ్సన్‌ విజయానందం

లక్నో: ఈ సీజన్‌లో తిరుగులేని విజయాలతో దూసుకెళ్తున్న రాజస్తాన్‌ రాయల్స్‌ అందరికంటే ముందుగా ప్లేఆఫ్స్‌ చేరేందుకు మరింత చేరువైంది. శనివారం జరిగిన ఐపీఎల్‌ మ్యాచ్‌లో రాజస్తాన్‌ 7 వికెట్ల తేడాతో లక్నోపై గెలిచింది. తొలుత లక్నో సూపర్‌జెయింట్స్‌ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఓపెనర్‌ డికాక్‌ (8), హిట్టర్‌ స్టొయినిస్‌ (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో ఉన్న సూపర్‌జెయింట్స్‌ను కేఎల్‌ రాహుల్‌ (48 బంతుల్లో 76; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీపక్‌ హుడా (31 బంతుల్లో 51; 7 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 115 పరుగులు జోడించారు. మిగతావారిలో పూరన్‌ (11), బదోని (18 నాటౌట్‌), కృనాల్‌ పాండ్యా (15 నాటౌట్‌) పెద్ద స్కోర్లేమీ చేయలేదు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్‌ రాయల్స్‌ 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసింది. కెప్టెన్‌ సంజు సామ్సన్‌ (33 బంతుల్లో 71 నాటౌట్‌; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), ధ్రువ్‌ జురేల్‌ (34 బంతుల్లో 52 నాటౌట్‌; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించి మరో ఆరు బంతులు మిగిలి ఉండగానే గెలిపించారు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్‌ ఇన్నింగ్స్‌: డికాక్‌ (బి) బౌల్ట్‌ 8; రాహుల్‌ (సి) బౌల్ట్‌ (బి) అవేశ్‌ ఖాన్‌ 76; స్టొయినిస్‌ (బి) సందీప్‌ 0; దీపక్‌ హుడా (సి) పావెల్‌ (బి) అశ్విన్‌ 50; పూరన్‌ (సి) బౌల్ట్‌ (బి) సందీప్‌ 11; బదోని నాటౌట్‌ 18; కృనాల్‌ నాటౌట్‌ 15; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 196. **వికెట్ల పతనం:** 1–8, 2–11, 3–126, 4–150, 5–173. **బౌలింగ్‌:** బౌల్ట్‌ 4–0–41–1, సందీప్‌ 4–0–31–2, అవేశ్‌ ఖాన్‌ 4–0–42–1, అశ్విన్‌ 4–0–39–1, చహల్‌ 4–0–41–0.

రాజస్తాన్‌ రాయల్స్‌ ఇన్నింగ్స్‌: యశస్వి (సి) బిష్ణోయ్‌ (బి) స్టొయినిస్‌ 24; బట్లర్‌ (బి) యశ్‌ ఠాకూర్‌ 34; సామ్సన్‌ నాటౌట్‌ 71; పరాగ్‌ (సి) బదోని (బి) అమిత్‌ 14; జురేల్‌ నాటౌట్‌ 52; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19 ఓవర్లలో 3 వికెట్లకు)** 199. **వికెట్ల పతనం:** 1–60, 2–60, 3–78. **బౌలింగ్‌:** హెన్రీ 3–0–32–0, మొహసిన్‌ 4–0–52–0, యశ్‌ ఠాకూర్‌ 4–0–50–1, స్టొయినిస్‌ 1–0–3–1, కృనాల్‌ 4–0–24–0, అమిత్‌ మిశ్రా 2–0–20–1, రవి బిష్ణోయ్‌ 1–0–16–0.

శక్తులన్నీ ఏకమయ్యాయి


దీపికా పదుకోన్‌, ప్రభాస్‌, అమితాబ్‌

థియేటర్స్‌లో ‘కల్కి’ రాక ఖరారైంది. ప్రభాస్‌ హీరోగా నటిస్తున్న ఫ్యూచరిస్ట్‌ సైన్స్‌ ఫిక్షన్‌ ఫిల్మ్‌ ‘కల్కి 2898 ఏడీ’ ఈ ఏడాది జూన్‌ 27న విడుదల కానుంది. ‘‘మెరుగైన భవిష్యత్‌ కోసం అన్ని శక్తులు ఏకమయ్యాయి’’ అనే క్యాప్షన్‌తో ‘కల్కి 2898 ఏడీ’ రిలీజ్‌ డేట్‌ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్‌. మహాభారతం కాలంలో ఆరంభమై 2898 ఏడీలో ఈ సినిమా ముగుస్తుందనీ, ఆరువేల ఏళ్ల కాలమానంలో ఈ కథ సాగుతుందనీ సమాచారం. నాగ్‌ అశ్విన్‌ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అమితాబ్‌ బచ్చన్‌, కమల్‌హాసన్‌, దీపికా పదుకోన్‌, దిశా పటానీ లీడ్‌ రోల్స్‌లో నటిస్తున్నారు. సి. అశ్వనీదత్‌ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్‌ నారాయణన్‌.

మంచోడనే చెడ్డపేరు నాకొద్దు


విశ్వక్‌ సేన్‌

‘‘గ్యాంగ్స్‌ ఆఫ్‌ గోదావరి’ సినిమాని ఎంతో ఇష్టపడి, కష్టపడి చేశాను. అందుకేనేమో భయంతో పెద్దగా మాటలు రావడం లేదు. ఈ సినిమా అద్భుతంగా వచ్చింది’’ అని విశ్వక్‌ సేన్‌ అన్నారు. విశ్వక్‌ సేన్‌ హీరోగా నటించిన చిత్రం ‘గ్యాంగ్స్‌ ఆఫ్‌ గోదావరి’. ఇందులో అంజలి, నేహా శెట్టి హీరోయిన్లు. కృష్ణచైతన్య దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్‌ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మే 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా రిలీజ్‌ చేసిన ఈ సినిమా టీజర్‌లో ‘నేను మంచోడినో చెడ్డోడినో నాకు తెలియదు.. కానీ మంచోడనే చెడ్డ పేరు మాత్రం నాకొద్దు’’ అనే డైలాగ్స్‌ ఉన్నాయి. ‘‘టీజర్‌లో చూసింది ఒక్క శాతమే. ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలకు మించి ఉంటుంది’’ అన్నారు విశ్వక్‌ సేన్‌. ‘‘ఈ మూవీలో విశ్వక్‌ విశ్వరూపం చూస్తారు’’ అన్నారు కృష్ణచైతన్య. ‘‘చాలా రోజుల తర్వాత విశ్వక్‌ సేన్‌ నటించిన మాస్‌ మూవీ ఇది’’ అన్నారు నాగవంశీ. ‘‘ఈ సినిమాలో రత్నమాల పాత్ర చేశాను’’ అన్నారు అంజలి. ‘‘ఇప్పట్నుంచి నేను రాధిక (‘డీజేటిల్లు’లోని పాత్ర పేరు)ను కాదు.. బుజ్జిని (‘గ్యాంగ్స్‌..’ సినిమాలోని పాత్ర)’’ అన్నారు నెహా శెట్టి.

ఆ రోజే హరోం హర


సుధీర్‌బాబు

సూపర్‌ స్టార్‌ కృష్ణ జయంతి మే 31న. కృష్ణ అల్లుడు, హీరో సుధీర్‌బాబు నటించిన ‘హరోం హర’ చిత్రం ఆ రోజే థియేటర్లలోకి రానుంది. 1989లో చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో సాగే పీరియాడికల్‌ ఫిల్మ్‌గా ‘హరోం హర’ రూపొందింది. ఈ చిత్రాన్ని మే 31న రిలీజ్‌ చేయనున్నట్లు చిత్రబృందం శనివారం ప్రకటించింది. జ్ఞానసాగర్‌ ద్వారక దర్శకత్వంలో సుమంత్‌ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రంలో మాళవికా శర్మ కథానాయికగా నటించగా, సునీల్‌ కీలక పాత్రలో కనిపించనున్నారు. ‘‘ఈ సినిమా కోసం సుధీర్‌ బాగా మేకోవర్‌ అయ్యారు. కథానుసారం కుప్పం స్లాంగ్‌లో డైలాగులు చెప్పారు. ఈ వేసవి సెలవుల్లో మంచి యాక్షన్‌ థ్రిల్లర్‌గా ఈ చిత్రం అన్ని వర్గాలవారినీ ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది’’ అన్నారు దర్శక–నిర్మాతలు.

సినిమా చూసి ఏ కరెక్షనూ చెప్పలేకపోయాను
- దర్శకుడు సుకుమార్‌


సుకుమార్‌, సుహాస్‌, మణికంఠ

సుహాస్‌ హీరోగా, రాశీ సింగ్‌, పాయల్‌ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘ప్రసన్న వదనం’. అర్జున్‌ వైకే దర్శకత్వంలో జేఎస్‌ మణికంఠ, టీఆర్‌ ప్రసాద్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మే 3న రిలీజ్‌ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ లాంచ్‌ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు సుకుమార్‌ మాట్లాడుతూ– ‘‘సుహాస్‌ నాకు ఫ్యూచర్‌ నానీలా అనిపిస్తున్నాడు. తన నటన ఆర్గానిక్‌గా ఉంటుంది. నా దగ్గర అసోసియేట్‌గా చేసిన అర్జున్‌ చాలా లాజికల్‌గా ఆలోచిస్తాడు. అర్జున్‌, మరో అసిస్టెంట్‌ తోట శ్రీనుతో కలిసి 23 రోజుల్లో ‘100% లవ్‌’ స్టోరీ రాశాను. అప్పటినుంచి నా ప్రతి సినిమాకి వీరిద్దరూ పని చేశారు. అర్జున్‌ డైరెక్ట్‌ చేసిన ‘ప్రసన్నవదనం’ సినిమా చూశాను. ఏ కరెక్షనూ చెప్పలేకపోయాను. అంత బాగా తీశాడు’’ అన్నారు. సుహాస్‌ మాట్లాడుతూ– ‘‘కలర్‌ ఫోటో, రైటర్‌ పద్మ భూషణ్‌, అంబాజీ పేట...’ ఇలా నా సినిమాలన్నీ ప్రేక్షకులను అలరించాయి. ‘ప్రసన్న వదనం’ కూడా తప్పక అలరిస్తుంది’’ అన్నారు. ‘‘సుహాస్‌ ఈజీగా పాత్రలోకి వెళ్లిపోతాడు. సుకుమార్‌గారు ఈ సినిమా చూసి ‘శెబాష్‌’ అన్నారు’’ అని అన్నారు అర్జున్‌. ‘‘మా సినిమా వంద శాతం బ్లాక్‌బస్టర్‌ అవుతుంది’’ అన్నారు మణికంఠ. రాశీ సింగ్‌, పాయల్‌ రాధాకృష్ణ కూడా మాట్లాడారు.

పద్దెనిమిదేళ్లు ఎలా గడిచాయో తెలియలేదు
- బెక్కం వేణుగోపాల్‌


తరుణ్‌, సృజన్‌, బెక్కం వేణుగోపాల్‌, విక్రమ్‌

హర్ష నర్రా, సందీప్‌ సరోజ్‌, తరుణ్‌ పొనుగోటి, సుప్రజ్‌ రంగా హీరోలుగా, సోనూ ఠాకూర్‌, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి, నువేక్ష హీరోయిన్లుగా నటించిన యూత్‌ఫుల్‌ ఎంటర్‌టైనర్‌ ‘రోటి కపడా రొమాన్స్‌’. విక్రమ్‌ రెడ్డి దర్శకత్వంలో బెక్కం వేణుగోపాల్‌, సృజన్‌ కుమార్‌ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఏప్రిల్‌ 27న బెక్కం వేణుగోపాల్‌ బర్త్‌ డే. అలాగే ఆయన నిర్మాణ సంస్థ లక్కీ మీడియా పద్దెనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ‘రోటి కపడా రొమాన్స్‌’ యూనిట్‌ బెక్కం వేణుగోపాల్‌ పుట్టినరోజు వేడుకను నిర్వహించింది. ఈ వేడుకలో బెక్కం వేణుగోపాల్‌ మాట్లాడుతూ– ‘‘ఒక్కో సినిమా నిర్మించుకుంటూ వచ్చాను. 18 ఏళ్లు ఎలా గడిచాయో తెలియడం లేదు. ‘రోటి కపడా రొమాన్స్‌’ రూపంలో ఓ మంచి సినిమా తీశామనే సంతృప్తి కలిగింది. ఈ సినిమా విజయం సాధిస్తుంది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ మా చిత్రాన్ని కొనుగోలు చేసింది’’ అని చెప్పుకొచ్చారు.

కార్మికుల దినోత్సవానికి ప్రేమికుడు


ప్రభుదేవా, నగ్మా

గవర్నర్‌ కూతురు, ఓ మధ్య తరగతి యువకుడు ప్రేమలో పడితే ఏమవుతుంది? గవర్నర్‌ ఆగ్రహానికి గురై, ఆ యువకుడు జైల్లో చిత్రహింసలకు గురవుతాడు. అయితే అతను నిజాయతీ ఉన్న ప్రేమికుడు. అందుకే అన్నింటినీ భరిస్తాడు. ఫైనల్‌గా ప్రేమికులు ఒకటవుతారు. ఈ ప్రేమకథతో ప్రభుదేవా, నగ్మా జంటగా శంకర్‌ దర్శకత్వంలో కేటీ కుంజుమోన్‌ నిర్మించిన చిత్రం ‘ప్రేమికుడు’. 1994లో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఈ చిత్రం రీ రిలీజ్‌ కానుంది. ఈ కార్మికుల దినోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా మే 1న నిర్మాతలు రమణ, మురళీధర్‌ రెడ్డి విడుదల చేస్తున్నారు. ‘‘300 థియేటర్లలో విడుదల చేస్తున్నాం. బుకింగ్స్‌ ఓపెన్‌ చేసిన వెంటనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్‌ వస్తోంది’’ అన్నారు మురళీధర్‌ రెడ్డి. ‘‘ఈ చిత్రాన్ని 4కె క్వాలిటీలో విడుదల చేస్తున్నాం’’ అన్నారు శోభారాణి.

నాన్నతో కలిసి చూడాలి


ధనరాజ్‌, సముద్ర ఖని

ధనరాజ్‌ కొరనాని, సముద్ర ఖని తండ్రీకొడుకులుగా నటించిన చిత్రం ‘రామం రాఘవం’. ధనరాజ్‌ దర్శకత్వం కూడా వహించారు. తెలుగు, తమిళ భాషల్లో ప్రభాకర్‌ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరపు నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ విడుదలైంది. ‘‘ఎమోషనల్‌ జర్నీగా సాగే ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది’’ అన్నారు పృథ్వీ పోలవరపు. ‘‘రచయిత శివప్రసాద్‌ ఇచ్చిన కథ ఇది. ఇప్పటివరకూ వంద సినిమాల్లో నటించాను. ఆ చిత్రదర్శకుల నుండి నేర్చుకున్న విషయాలతో ఈ సినిమాకి దర్శకత్వం వహించాను. అందరూ వాళ్ల నాన్నతో కలిసి ఈ సినిమా చూడాలి’’ అన్నారు ధనరాజ్‌.

ఒంటరిగా ఉండటం హానికరం


ఫరియా అబ్దుల్లా

‘‘ఫ్యామిలీ, యాక్షన్‌, కామెడీ, లవ్‌, హారర్‌.. ఇలా అన్ని తరహా జానర్‌ సినిమాల్లో నటించాలని ఉంది’’ అన్నారు ఫరియా అబ్దుల్లా. ‘అల్లరి’ నరేశ్‌, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం ‘ఆ ఒక్కటీ అడక్కు’. మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్‌ చిలక నిర్మించిన ఈ చిత్రం మే 3న రిలీజ్‌ కానుంది. ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ – ‘‘ఈ సినిమాలో లైఫ్‌ను ఏమాత్రం ప్లాన్‌ చేసుకోకుండా ఓ ఫ్లో ప్రకారం వెళ్లే సిద్ధి అనే అమ్మాయి పాత్ర చేశాను. ప్రతి విషయానికి ప్రణాళిక వేసుకునే వ్యక్తి పాత్ర హీరోది. ఇలా విభిన్న మనస్తత్వాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రకథ. ప్రస్తుతం తెలుగులో ‘మత్తు వదలరా 2’, ‘భగవంతుడు’ అనే సినిమాలు చేస్తున్నాను. తమిళంలో ఓ సినిమా చేశా’’ అన్నారు. పెళ్లి గురించి మాట్లాడుతూ– ‘‘నా జీవిత భాగస్వామి గురించి కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఒంటరిగా ఉండటం హానికరం అని కోవిడ్‌ తర్వాత అనిపించింది. కానీ నటిగా ఇప్పుడే బిజీ అవుతున్నాను. అందుకే ఇప్పట్లో పెళ్లి ప్లాన్‌ లేదు’’ అన్నారు ఫరియా అబ్దుల్లా.

ఏదో జరుగుతోంది!


అదా శర్మ

చీకటి, వెలుతురు మధ్య కనిపించని శత్రువు ఎవరో ఉన్నారు.. ఎవరు చేస్తున్నారు ఇదంతా? నా చుట్టూ ఏదో జరుగుతోంది.. నాతో పాటు ఇంట్లో ఉంటున్నది దెయ్యమా? నన్ను చంపడానికి వచ్చింది ఎవరు? క్రిమినల్‌ ఆర్‌ డెవిల్‌?’ అంటూ హీరో విశ్వంత్‌ వాయిస్‌ ఓవర్‌తో ‘సి.డి (క్రిమినల్‌ ఆర్‌ డెవిల్‌) ట్రైలర్‌ రిలీజైంది. అదా శర్మ కీలక పాత్రలో విశ్వంత్‌, జబర్దస్త్‌ రోహిణి, భరణి శంకర్‌ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం ‘సి.డి’. విడుదలైన ట్రైలర్‌లో అదా చేసిన రిస్కీ యాక్షన్‌ సీక్వెన్స్‌, భయపెట్టేలా చూడటం వంటివి ఉన్నాయి. కృష్ణ అన్నం దర్శకత్వంలో ఎస్‌ఎస్‌సీఎం ప్రొడక్షన్స్‌ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రం మే 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌: గిరిధర్‌.

నా జీవితంలో అవి చీకటి రోజులు


ప్రియాంకా చోప్రా

బాలీవుడ్‌లో స్టార్‌ హీరోయిన్‌గా పేరు సంపాదించుకున్న ప్రియాంకా చోప్రా ఇప్పుడు హాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ రాణిస్తున్నారు. హాలీవుడ్‌ నటుడు, గాయకుడు నిక్‌ జోనస్‌ని ఆమె వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా ఓ పాడ్‌ కాస్ట్‌ ఇంటర్వ్యూలో తొలి నాళ్లల్లో హాలీవుడ్‌లో తన ప్రయాణం గురించి ప్రియాంకా చోప్రా మాట్లాడుతూ – ‘‘హాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత నా కెరీర్‌ మళ్లీ మొదట్నుంచి మొదలైందా? అనే భావన కలిగింది. హాలీవుడ్‌లో నాకు తెలిసిన వారు ఎవరూ లేరు. ఒంటరిగా ఫీలయ్యాను. చాలా భయం వేసింది. కొన్ని తిరస్కరణలూ ఎదురయ్యాయి. ఇలా హాలీవుడ్‌లో నా కెరీర్‌ తొలి రోజులు ఓ చీకటి అధ్యాయంలా గడిచాయి. ఇండియాలో నేనో స్టార్‌ హీరోయిన్‌ని అనే భావనను పక్కన పెట్టి హాలీవుడ్‌లో నా పని చేసుకుంటూ వెళ్లాను. అందుకే ఇప్పుడు హాలీవుడ్‌లో మంచి స్థాయిలో ఉండగలిగానని నా నమ్మకం’’ అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ప్రియాంక హాలీవుడ్‌లో ‘హెడ్స్‌ ఆఫ్‌ స్టేట్‌’ ఫిల్మ్‌లో నటిస్తున్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించిన ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల/ కట్న ప్రసక్తిలేదు / B.Tech / C. Govt. గ్రూప్-I ఆఫీసర్/ ACTO/ 80,000/- pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8341650195 [HA-14303]

2వ, మొదటి, వివాహం/Govt. Emp/ 3,00,000/-PM/ కోట్ల ప్రాపర్టీ కలిగిన అబ్బాయికి అమ్మాయి కావలెను. No Fees కుల ప్రసక్తి లేదు. Ph: 9182213897 [H-800477]

కమ్మ, AGE: 50, ఆస్తి 5 కోట్లు, పెళ్లి లేక స్నేహపూర్వకంగా కలసి ఉండుటకు వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ సంప్ర: 9346025488 [H-778766]

యాదవ/B.Tech, IIT/ ECE/ C. Govt. సైంటిస్ట్/ DRDO/ 20 Lakhs PA/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14303]

క్రిస్టియన్ మాదిగ/ M.Tech / Govt. గ్రూప్-2 ఆఫీసర్/ రెవెన్యూ Dept./ 65,000/- pm/ 5'10" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14303]

వడ్డెర/B.Tech/ Govt. డిప్యూటీ తహసీల్దార్/ గ్రూప్-2 ఆఫీసర్/ 1 Lakh pm/ 5'9" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. Ph: 9618579861 [HA-14303]

కాపు/ 61Yrs / బిజినెస్ / Hyd / వెల్ సెటిల్డ్ వరుడికి 40-50 సం॥ లోపు వధువు కావలెను. Ph: 6281550588 [HA-14306]

క్రిస్టియన్ మాల/ కట్న ప్రసక్తి లేదు/28/ 5'9"/B.Tech/C.Govt.Asst.మేనేజర్/SBI/1 Lakh. PM/అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14306]

క్రిస్టియన్ /2వ పెళ్లి/కుల పట్టింపు లేదు / B.Tech/సివిల్ ఇంజినీర్/1 Lakh. PM/ 5'8"ఎత్తు/36 సం॥ల పిల్లలు లేని వరునికి తగిన వధువు కావలెను. Ph: 9550650024 [HA-14306]

SC మాల వయస్సు 31, Hight 5.7, Qualification B.Tech, Job SWE, Salary 27 lac Per Annum వరుడుకి వధువు కావలెను. సంప్ర: 93984 50329. [P-507]

★

రెడ్డి/Govt.Ph.D. టీచర్ జాబ్ /38 Years/ వెల్ సెటిల్, బి.టెక్ చేసిన అందమైన అమ్మాయి కావాలి. హైదరాబాద్ పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత. Ph: 6300255702 [HA-13659]

వెలమ / 5'8"/ 33/ Diploma/ Fair/ తల్లి, తండ్రిలేని ఏకైక వరునికి OC లేక BC వధువు కావలెను. డైరెక్ట్ వాట్సప్ సెల్ : 8331961507 [K- 1185979]

రెడ్డి/లేట్ మ్యారేజ్/34yసలు లక్ష రూపాయల ఆదాయం. Hyd లో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓట్టి తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ /విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801605]

ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., M.Ed. ప్రైవేట్ లెక్చరర్ 30 వేలు ఆస్తి 50 లక్షలు M9 HB మునుగోడ్ రోడ్, నల్లగొండ. వీరయ్య సంప్ర॥ 9121325068 [Y-798321]

వరుడు కావలెను



రెండవ పెళ్ళి: డైవర్సీ/35yrs Govt ఎంప్లాయ్ 1,30,000/- (PM), కుల ప్రసక్తిలేని వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర: 9032445378 [H-778766]

రెడ్డి: 35yr/ కులపట్టింపు లేదు/ ఫెయిర్/ Govt ఎంప్లాయ్ 2 లక్షలు (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & 3 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ok, 1st& 2nd మ్యాచ్ ok) సంప్ర: 8374802603 [H-778766]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 5' 11", Engineer, 170 K, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 5'9", SWE, 175 K, 8 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', Engineer, 300 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Sr Cloud Engineer, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 25, 5'6", Analyst, 80 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 5", Software Developer, H1, 130 K, 2 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", 129 K, 4 Crores, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5'6", Manager, 50 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 350 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", Data Engineer, 13 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, MCH, 26, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి B Arch, M Arch, 27, 5'4", Team Leader, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 24, 5' 5", SWE, 100 K, 20 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 3", PG Doctor, 15 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBBS, MD, 32, 5'2", PG Doctor, 40 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కుల పట్టింపు లేదు: 42yr 5'3" Govt ఎంప్లాయ్ 1 లక్ష (PM), డైవర్సీ పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ గల వధువుకి 2వ, లేట్ వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా ok) సంప్ర: 7286031653 [H-778766]

రెడ్డి: 32yr/5'4" ఫెయిర్/ కులపట్టింపు లేదు/ PG/ Govt ఎంప్లాయ్ 70k (PM), వెల్ సెటిల్డ్ సొంత ఇల్లు & అగ్రికల్చర్ ల్యాండ్స్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-778766]

పద్మశాలి/విడో/58y/LIC Job/ Own House గల ఒంటరి వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. Ph: 7893664129 [H-800477]

రెడ్డి/విడో/60y/5'5"/V.Fair/Govt (H.M)/ రిటైర్డ్/ పెన్షన్/సొంత ఇల్లు/ఆంధ్రాలో/ 28 ఎకరాల పండ్ల తోటలు/3L PM/పిల్లలు లేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7095001526 [H-800477]

కమ్మ/29yrs/5'4"/Un Married/ Cardiologist / కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. 9676585199 [H-800477]

హిందూ మాదిగ/C.A/ చార్టెడ్ అకౌంట్/65,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6305007091 [HA-14303]

రజక/M.Sc/ Govt. A.E.O/ అగ్రికల్చర్ Dept./ 50,000/-pm/ 5'5" ఎత్తు / 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14303]

క్రిస్టియన్ మాల/B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ కెనరా బ్యాంక్/ 8 Lakhs PA/ 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14303]

గౌడ/B.Tech/ Govt. Asst. Exq. ఇంజినీర్/ RWS/ 50,000/-pm/ 5'5" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7032058965 [HA-14303]

2వ పెళ్లి/B.Tech/ Govt. ఎలక్ట్రిసిటీ బోర్డు/1 Lakh pm/ 5'4" ఎత్తు / 35 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9963757612 [HA-14303]

SC మాల/B.Tech/ C.Govt. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్/ 70,000/- pm/ 5'3" ఎత్తు / 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-14303]

కుల పట్టింపు లేదు/22y & 24y & 26y & 28y & 29y & 31y & 33y & 34y & 35y & 37y & 39y & 40y & 41y & 43y & 45y & 47y & 49y & 51y & 53y & 54y & 55y & 57y & 58y & 59y "మా సేవ" (Since 1998): PH/ WA: 9291503849 [H-14307]

కుల పట్టింపు లేదు/రెడ్డి/26y Btech/5'4"/పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 9885463158 [H-14307]

రెడ్డి 2nd మ్యారేజ్: కుల, మత ఆస్తి ప్రసక్తి లేదు/Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికము ok) Ph: 9515673252. [H-14307]

రెడ్డి/ కుల, ఆస్తి పట్టింపు లేదు / వయస్సు: 30, కలరు: ఎరుపు/ ట్రావెల్స్ & అగ్రికల్చర్ ల్యాండ్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. Ph: 9666327616. [H-14307]

మాల /25/5'4" / M.Sc / Govt. A.E.O/ అగ్రికల్చర్ Dept / 50,000/-PM/ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14306]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/ 5'3"/B.Sc "27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14306]

యాదవ /B.Tech/MBA/IIT/C. Govt. కస్టమ్స్ ఆఫీసర్/65000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14306]

SC మాల & క్రిస్టియన్/B.Tech/IIT/ C. Govt. సైంటిస్ట్ ఇస్రో/14 Lakhs. PA/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14306]

SC మాదిగ/ఏకైక కుమార్తె/B.Tech/ MBA/ C.Govt.Asst. మేనేజర్/ SBI/ 45000/- PM/5'4"ఎత్తు/25 సం॥ల వధువుకు వరుడు కావలెను. Ph: 6304407230, 9676995093 [HA-14306]

మున్నూరు కాపు/M.Tech/Govt. AE/ ఇరిగేషన్ Dept./65000/-PM/5'4" ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9912280929 [HA-14306]

వేదికలు



రజక వివాహవేదిక: (Estd-1994) డాక్టర్స్, ఇంజినీర్స్, Govt Jobs ABROAD సంబంధాలకై సంప్ర॥ కోట్లశ్రీనివాస్ Ph: 8106303155, 9391265304 [H-800477]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-32115]

శాలివాహన వధూవరుల పరిచయ వేదిక తేదీ: 19-05-2024 వేదిక: శిల్పారామం, తిరుపతి, AP. రిజిస్ట్రేషన్ చివరితేది: 10-05-2024. www.shalivahanamatrimony.com వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోండి. 8978845656 [HA-14307]

మాల, మాదిగ స్పెషల్, IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. బ్యాంక్ ఆఫీసర్స్, USA, UK. Ph : 7396915712 [HA-14306]

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd: 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1st/2nd, దేశ/విదేశీ సంబంధాలకై సం॥ లింగాల కాంప్లెక్స్ DSNR, HYD వ్యవస్థాపకురాలు : Late S.శారదా గౌడ్. సం॥ S.రాములు గౌడ్. 8790690309 [H-800467]

తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో క్రిస్టియన్ హెవెన్ మాట్రిమోనికి కోఆర్డినేటర్లు (ఫ్రాంచైజీలు) కావలెను. బయోడేటాను 7330957771 కు వాట్సాప్ చేయండి. ఆకర్షణీయమైన వేతనం. [HA-97068]

పద్మశాలి వెల్‌ఫేర్ సొసైటీ.తెనాలి (గుంటూరు జిల్లా) వారి 13వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమము 28.04.2024 ఆదివారము ఉ.9 గం.ల నుండి.. 9963924665, 9849851322. [T-244]

Personal Service- అన్ని కులాలు, అన్ని జిల్లాలు సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్,అబ్రాడ్ మొదటి, రెండవ, లేట్ మ్యాచ్‌లు తొందరగా చూడబడును. పూర్ణ మాట్రిమని, తిరుపతి, 7093722724. [T-2925]

SC మాల, మాదిగ, క్రిస్టియన్స్ మాత్రమే, 1st మ్యారేజ్ పెళ్లి సంబంధాలకై సంప్రదించండి, సత్యనారాయణ. Verified All Govt Jobs Profiles కలవు. ఫ్రీ రిజిస్ట్రేషన్ వాట్సాప్ - 7989021063. B-1251791]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-759]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennia + Bengaluru + Delhi + Mumbai) 485/- Extra Line
Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
హైదరాబాద్ : 99122 25453 వరంగల్ : 99516 02872
మెదక్ : 99122 25456 నల్గొండ : 95055 08382
నిజామాబాద్ : 99122 20764 మహబూబ్‌నగర్ : 99516 02829
కరీంనగర్ : 97059 33396 ఖమ్మం : 99516 02868
సాక్షి టవర్స్, రోడ్ నం.1, బంజారాహిల్స్, Hyd ✆ 040-23256000 Ext: 6235/6230
Cell : 9912225453, umail2sakshi.ads@sakshi.com

సాయిచరణ్‌కు సీఎం రేవంత్ అభినందన



సాయిచరణ్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్

నందిగామ: రంగారెడ్డి జిల్లా నందిగామలోని అల్లెన్ హెర్బల్స్ కంపెనీలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న ఆరుగురు బాధితులను కాపాడిన బాలుడు సాయిచరణ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. బాలుడి ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని శనివారం సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఈ మెస్సేజ్ సోషల్ మీడియాలో శనివారం బాగా వైరల్ అయ్యింది. మరోవైపు స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్ సాయిచరణ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ లక్ష్మయ్య, ఆర్ఐలు రోజా, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంకేర్ ఎన్‌కౌంటర్ బూటకం

- కో-ఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్-నారాయణపూర్ సరిహద్దులో ఈనెల 16న భద్రతా బలగాలు 29 మంది మావోయిస్టులను చంపాయని కో-ఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ ఆర్గనైజేషన్ (సీడీఆర్వో) ఆరోపించింది. ఇది ఏకపక్షదాడి అని, పెద్ద సంఖ్యలో మావోయిస్టులను మట్టుబెట్టారని సీడీఆర్వో సమన్వయకర్తలు ఆశిష్ గుప్తా, తపస్ చక్రవర్తి, క్రాంతి చైతన్య శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎన్‌కౌంటర్‌గా పేర్కొన్నప్పటికీ, భద్రతా దళాలకు ఎలాంటి నష్టం లేదా తీవ్రమైన గాయాలు కూడా లేకపోవడం, మరోవైపు 29 మంది మరణించడం చూస్తే ఇది ఏకపక్ష దాడి అని ఎవరికైనా అనుమానం కలుగుతుందని స్పష్టం చేశారు. సామాజిక-ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం సాయుధ బలగాలను ఉపయోగించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సాయుధ బలగాలను వెంటనే బ్యారక్‌లకు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అమిత్ షా వ్యాఖ్యలు మార్ఫింగ్

- చర్యకు బీజేపీ నేతల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల మెదక్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రసంగాన్ని మార్ఫింగ్ చేశారని రాష్ట్ర బీజేపీ నేతలు ఆరోపించారు, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమమని స్పష్టం చేశారు. ఇందుకు బాధ్యులైన టీపీసీసీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్, కార్యదర్శి కొల్లి మాధవి, లీగల్ సెల్ కన్వీనర్ రామారావు తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

డబుల్ డెక్కర్ వద్దే వద్దు!

కొనుగోలు ఆలోచన విరమించుకున్న ఆర్టీసీ?

- గత బీఆర్‌ఎస్ హయాంలో కేటీఆర్ సూచన మేరకు వాటిని తిరిగి ప్రవేశపెట్టాలని యోచన
- ఇప్పుడు ప్రభుత్వం మారటంతో నిర్ణయం మార్చుకున్న ఆర్టీసీ
- గతంలో తీవ్ర నష్టాలు రావటంతో వాటిని వదిలించుకున్న సంస్థ
- మళ్లీ ప్రారంభిస్తే నష్టాలని అంచనా



సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు హైదరాబాద్ రోడ్లపై గంభీరంగా విహరించిన ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్సులు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితి కనిపించటం లేదు. గతంలో తీవ్ర నష్టాలు రావటంతో వాటిని క్రమంగా వదిలించుకున్న ఆర్టీసీ, ఇక డబుల్ డెక్కర్ బస్సుల ఊసును పూర్తిగా తెరమరుగు చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అశోక్‌లేలాండ్ అనుబంధ సంస్థ స్విచ్ మొబిలిటీతో ఉన్న టెండర్ ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకుంటున్నట్టు తెలిసింది.

అప్పట్లో.. కేటీఆర్ కోరిక మేరకు

నగరంలో 2004 చివరి వరకు డబుల్ డెక్కర్ బస్సులు నడిచాయి. నిర్వహణలో నష్టాలు పెరుగుతుండటంతో వాటిని ఆర్టీసీ పక్కన పెట్టేసింది. మూడేళ్ల క్రితం నగరవాసి ఒకరు పాత డబుల్ డెక్కర్ ఫొటోను షేర్ చేస్తూ, నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు నడిపితే బాగుంటుందని సామాజిక మాధ్యమం ద్వారా కోరారు. దీనికి నాటి మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించి, ఆ బస్సులు నడిపే అవకాశాన్ని పరిశీలించాలని రవాణా శాఖను కోరారు. దీనికి రవాణాశాఖ సై అనటంతో ప్రయోగాత్మకంగా కొన్ని డబుల్ డెక్కర్ బస్సులు కొని నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. చాలా రోడ్లపై ఫ్లైఓవర్లు, ఫుట్ ఓవర్ వంతెనలు ఏర్పడటంతో, వాటిని నడిపేందుకు ఇబ్బంది లేని కొన్ని మార్గాలను ఎంపిక చేసింది. సుచిత్ర మీదుగా సికింద్రాబాద్-మేడ్చల్ మధ్య, బాలానగర్ మీదుగా సికింద్రాబాద్-పటాన్‌చెరు, అమీర్‌పేట మీదుగా కోటి-పటాన్‌చెరు, సీబీఎస్-జీడిమెట్ల, దుర్గం చెరువు కేబుల్ వంతెన మీదుగా నడపాలని నిర్ణయించింది. ఇక దేశంలోని పలు నగరాలకు డబుల్ డెక్కర్ బస్సులను సరఫరా చేస్తున్న స్విచ్ మొబిలిటీ సంస్థ టెండర్లు దక్కించుకుంది. ధర విషయంలోనూ ఆర్టీసీతో చర్చలు జరిపి ఖరారు చేసింది.

సర్కారు మార్పుతో మారిన సీన్

అంతా.. ఓకే అనుకుని బస్సులు సరఫరా చేసే వేళ రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. ఫ్లైఓవర్లు, పాదచారుల వంతెనలతో డబుల్ డెక్కర్ బస్సుల నిర్వహణ ఇబ్బందే కాకుండా నష్టాలు రావటం తథ్యమన్న భావనతో ఉన్న ఆర్టీసీ నాటి మంత్రి కేటీఆర్ కోరిక మేరకు అయిష్టంగానే వాటి కొనుగోలుకు ఒప్పుకుంది. ఇప్పుడు ప్రభుత్వం మారిపోవటంతో ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని ఆర్టీసీ నిర్ణయించినట్టు తెలిసింది. ఓల్వో లాంటి విదేశీ బ్రాండ్ బస్సుల నిర్వహణనే భారంగా భావిస్తున్న ఆర్టీసీ.. ఏకంగా ఒక్కో బస్సు కొనుగోలుకు రూ.2 కోట్లయ్యే డబుల్ డెక్కర్ బస్సుల జోలికి పోవద్దని నిర్ణయించుకుంది. స్విచ్ మొబిలిటీ సంస్థకు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్టు సమాచారం. దీంతో హైదరాబాద్ కోసం డబుల్ డెక్కర్ బస్సుల తయారీ ప్రయత్నాన్ని విరమించుకుందని తెలుస్తోంది.

ఆ బస్సులను ఆర్టీసీకి ఇవ్వొచ్చు కదా..

ప్రస్తుతం నగరంలో హెచ్‌ఎండీఏ 6 డబుల్ డెక్కర్ బస్సులు తిప్పుతోంది. వాస్తవానికి పర్యాటకుల పేరుతో అవి రోడ్ల మీద ఖాళీగా తిరుగుతున్నాయి. అంత ఖరీదైన బస్సులను ఇలా వృథాగా తిప్పే బదులు.. వాటిని సాధారణ ప్రయాణికుల సర్వీసులుగా వినియోగిస్తే, ప్రయాణికులకు వెసులుబాటుగా ఉంటుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించి ఆ బస్సులను హెచ్‌ఎండీఏ నుంచి ఆర్టీసీకి స్వాధీనం చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్‌కు 14 సీట్లు వస్తే.. రాజకీయ సన్యాసం

రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ ఆగస్టు 15లోగా అమలు చేస్తే నేను రాజీనామా చేస్తా

- ఖాళీ లెటర్ హెడ్ ఇస్తా.. స్పీకర్ ఫార్మాట్‌లో రాసుకో...
- సీఎం రేవంత్‌కు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 14 సీట్లు వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, ఆగస్టు 15లోగా హామీలను అమలు చేస్తే తాను రాజీనామా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. 'నేను ఖాళీ లెటర్‌హెడ్‌పై సంతకం చేసి ఇస్తా. స్పీకర్ ఫార్మాట్‌లో ఏదైనా రాసుకో. నా రాజీనామా లేఖతోపాటు మీ రాజీనామా లేఖ కూడా పంపండి' అని చెప్పారు. ఒకవేళ ఆగస్టు 15లోగా ఇచ్చిన హామీలన్నీ అమలుచేయకపోతే నీవు రాజీనామా చేస్తావా అని రేవంత్‌ను నిలదీశారు. శనివారం ఏలేటి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ మినహా మరే హామీలు సీఎంకు గుర్తురావడం లేదా అని మండిపడ్డారు. ఏక్‌నాథ్ షిండేను తయారు చేసుకోవడానికే ఈ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. హామీల అమలుకు సంబంధించి తేదీలను మారుస్తూ.. వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. హరీశ్‌రావు ఒక్క రుణమాఫీ గురించి మాట్లాడి రాజీనామా లేఖ డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. దీనిపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి ఆడుతున్న నాటకమని దుయ్యబట్టారు. ఆ రెండు పార్టీలు మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నాయన్నారు. అసెంబ్లీ వేదికగా తాను హామీల గురించి ప్రశ్నించానని, ఈనెల 22న కూడా లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి నటుడు బాలకృష్ణ డైలాగ్‌లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఒక్క రుణమాఫీ మినహా మిగిలిన 419 హామీల సంగతేమిటని ప్రశ్నించారు. రాజకీయ ఫిరాయింపులపై ఉన్న ప్రేమ.. హామీల అమలుపై ఎందుకు లేదని అడిగారు. లోక్‌సభ ఎన్నికలు రేవంత్ ప్రభుత్వం వందరోజుల పాలనకు రెఫరెండమేనా..? అందుకు సీఎం సిద్ధమేనా అని ఏలేటి ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

'గండ్ర' పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భూ కబ్జా కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పుల్లూరి రామయ్యపల్లి సర్వే నంబర్ 209లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్న ఫిర్యాదు మేరకు వెంకటరమణారెడ్డితో పాటు జ్యోతి, గౌతమ్‌రెడ్డిలపై జనవరిలో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు తమను అరెస్టు చేయకుండా ఆదేశించడంతో పాటు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయమంటూ, విచారణ వాయిదా వేశారు.

శవరాజకీయాలు చేస్తున్నారు

బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై దీపాదాస్ మున్షీ మండిపాటు

- పదేళ్లలో వస్త్రపరిశ్రమకు ఏం చేశారు?
- సిరిసిల్లలో నేత కార్మికులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది
- ఆత్మహత్యలకు పాల్పడిన నేతన్నల కుటుంబాలకు పరామర్శ



తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ అంకారపు మల్లేశం భార్యను ఓదారుస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

సిరిసిల్ల: పదేళ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలపై శవరాజకీయాలు చేస్తున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మండిపడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన నేత కార్మికులు అంకారపు మల్లేశం, అడిచర్ల సాయి కుటుంబాలను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్‌చౌదరి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లతో కలిసి శనివారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ పదేళ్లు సిరిసిల్ల ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఉన్న కేటీఆర్ నేతన్నలకు ఏం చేశారని ప్రశ్నించారు. బతుకమ్మ చీరల బకాయిలు రూ.275 కోట్లు పెట్టి పోయారని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీలు సిరిసిల్లలో పద్మశాలీలకు ఏం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో కాలంచెల్లిన మగ్గాలు ఉన్నాయని, వాటిని ఆధునీకరిస్తేనే నేతన్నలకు శాశ్వత ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. మగ్గాలను ఆధునీకరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేనేత వస్త్రాలపై 12 శాతం జీఎస్టీ వేసిందని ధ్వజమెత్తారు. గత నాలుగు నెలల్లో ఐదుగురు నేత కార్మికులు చనిపోవడం బాధాకరమని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం నేతకార్మికుల కోసం కొత్త విధానం తీసుకొస్తుందని ప్రకటించారు. నేతకార్మిక కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నేతన్నలూ ఆత్మహత్యలు వద్దు: మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్లలో నేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని చేతులు జోడించి వేడుకుంటున్నానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన బకాయిలను తీర్చే పనిలో ఉన్నామని, వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. సిరిసిల్ల నేతన్నల ఉత్పత్తులకు మైసూర్‌లో మాదిరి హైదరాబాద్‌లో మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మూసీ పునరుద్ధరణలో అందరూ పాల్గొనాలి

నది నడక కార్యక్రమంలో పలువురు ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: మూసీ నదికి, నగరవాసులకు భావోద్వేగభరితమైన అనుబంధం ముడిపడి ఉందని ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ హైదర్ తెలిపారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సహకారంతో ఐకోమోస్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం మూసీ రివర్ అండ్ హెరిటేజ్ ఇంటర్ ఫేస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ నేతృత్వంలో 60 మందితో కూడిన బృందం ఈ 'నది నడక' కార్యక్రమం చేపట్టింది. మూసీకి పూర్వ వైభవాన్ని తీసుకురావలసిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ హైదర్ మాట్లాడుతూ.. పౌరసమాజం కూడా మూసీ నది పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులూ అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ లక్ష్యంతోనే ఈ నడకను సాగించారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ప్రకృతి వారసత్వ సంపదను పరిరక్షించాలని వేదకుమార్ కోరారు. ఐకోమోస్ ఇండియా కార్యదర్శి నితిన్ సిన్హా మాట్లాడుతూ, ప్రకృతికి, సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న కీలకమైన సంబంధాన్ని వివరించారు. హెరిటేజ్ జోన్‌లో మూసీ నది ప్రాముఖ్యత, నిర్మాణ పరిణామంలో దాని పాత్రపై డాక్టర్ వసంత శోభ అవగాహన కల్పించారు. అంతరించిపోతున్న మన వారసత్వాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇందిరా కొల్లి చెప్పారు. జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ప్రగతి, బిందు భార్గవి, ఖైజర్, రఘు, ఇబ్రహీం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సూదిరంధ్రంలో నటరాజస్వామి సూక్ష్మశిల్పం..

మైక్రో ఆర్టిస్ట్ అజయ్‌కుమార్ అరుదైన సృష్టి



మైక్రో ఆర్టిస్ట్ అజయ్‌కుమార్

హనుమకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన స్వర్ణకారుడు, మైక్రో ఆర్టిస్ట్ మట్టెవాడ అజయ్‌కుమార్ అరుదైన అద్భుతం సృష్టించారు. సూది రంధ్రంలో ఇమిడేలా 700 మైక్రాన్ల ఎత్తు (0.70 ఎంఎం), 550 మైక్రాన్ల వెడల్పు (0.55 ఎంఎం) కొలతలతో అతి చిన్న నటరాజస్వామి బంగారు శిల్పాన్ని తయారుచేశారు. ప్లాస్టిక్ పౌడర్, నైలాన్ ముక్కలు, మృదువైన మైనం, రంగులు వేయడానికి గొంగళి పురుగు వెంట్రుకను వాడారు. నటరాజస్వామి జటాఝూటం (వెంట్రుకలను) చేయడానికి చాలా శ్రమించాల్సి వచ్చిందని, శిల్పం పూర్తి చేసేందుకు 3 నెలల్లో 145 గంటల సమయం పట్టిందని అజయ్‌కుమార్ తెలిపారు. ఇది మైక్రోస్కోప్ ద్వారా చూస్తేనే కనిపిస్తుందన్నారు. మే 2 నుంచి దుబాయ్‌లో జరగనున్న ఎగ్జిబిషన్‌లో ఈ సూక్ష్మశిల్పంతోపాటు మరికొన్నింటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అధిక ధరకు విక్రయిస్తున్న మందుల సీజ్

డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అధిక ధరలకు మందులు విక్రయిస్తున్న మందుల దుకాణాలపై రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో సోదాలు చేపట్టినట్లు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని ఓ మందుల దుకాణంలో స్పూర్‌లాక్స్ సిరప్ ఎమ్మార్పీ కంటే 10% ఎక్కువకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. సంగారెడ్డి పరిధిలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పలు మందులను సీజ్ చేశామన్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

నాగోల్‌లో 2 మెట్రో స్టేషన్లు

- కొత్తగా నిర్మించనున్న ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్
- రెండు స్టేషన్‌ల మధ్య విశాలమైన స్కైవాక్
- నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు స్టేషన్‌ల అలైన్‌మెంట్
- కాలినడకన వెళ్లి పరిశీలించిన మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నాగోల్‌లో కొత్తగా ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఇప్పుడున్న స్టేషన్‌కు సమీపంలో ఎడమవైపున (ఎల్‌బీ నగర్ వైపు) ఉంటుంది. ఈ రెండు స్టేషన్‌ల మధ్య ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు విశాలమైన స్కైవాక్‌ను నిర్మిస్తారు. రాయదుర్గం, అమీర్‌పేట కారిడార్‌లో నాగోల్‌కు చేరుకున్న ప్రయాణికులు అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఈ స్కైవాక్ మార్గంలో కొత్తగా నిర్మించే నాగోల్ ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఎల్‌బీ నగర్, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు కొత్త కారిడార్ నిర్మాణం జరగనుంది. ఎయిర్‌పోర్టు మెట్రో రెండో దశలో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు కారిడార్ మార్గంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పర్యటించారు. నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 14 కిలోమీటర్ల దూరం ఆయన ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ అయిన సిస్ట్రా ఇంజనీరింగ్, సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి కాలినడకన వెళ్లి పరిశీలించారు. ఈ అలైన్‌మెంట్‌లో నిర్మించనున్న మెట్రోస్టేషన్లు, అలైన్‌మెంట్‌పై అధికారులకు, ఇంజనీరింగ్ నిపుణులకు దిశానిర్దేశం చేశారు.



అలైన్‌మెంట్ ఇలా...

- నాగోల్ స్టేషన్ తర్వాత మూసీ నది బ్రిడ్జిని ఆనుకొని పెద్ద మంచినీటి పైపులు, భూగర్భ హైటెన్షన్ విద్యుత్ కేబుళ్లు ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో మెట్రో అలైన్‌మెంట్‌ను మరో 10 మీటర్లు ఎడమ వైపునకు జరపనున్నారు. మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందించిన దృష్ట్యా మూసీ నదిపై మెట్రో బ్రిడ్జిని పొడవైన స్పాన్‌లతో నిర్మించనున్నారు.
- మూసీ దాటిన తరువాత కొత్తపేట వైపున్న రోడ్డుకు కనెక్టివిటీని ఇస్తూ చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులకు సదుపాయంగా ఉండేలా మరో స్టేషన్‌ను నిర్మించనున్నారు. నాగోల్ ఆర్టీఓ కార్యాలయం వద్ద అల్కాపురి జంక్షన్ (లక్కీ రెస్టారెంట్)కు సమీపంలో ఈ స్టేషన్ ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రయాణికులు ఔటర్‌రింగ్‌రోడ్డుకు రాకపోకలు సాగించేలా కనెక్టివిటీ ఇవ్వనున్నారు.

చాంద్రాయణగుట్ట ఇంటర్‌చేంజ్ స్టేషన్

- చాంద్రాయణగుట్ట వద్ద విశాలమైన ఇంటర్‌చేంజ్ స్టేషన్ నిర్మించనున్నారు. ఈ రూట్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం దృష్ట్యా చాంద్రాయణగుట్ట వరకు చేపట్టనున్న పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు, కొత్త టెర్మినల్ స్టేషన్ పనులు ఇంజనీరింగ్ సవాలుగా ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. రెండు కారిడార్‌లను అనుసంధానిస్తూ నిర్మించనున్న ఈ ఇంటర్‌చేంజ్ స్టేషన్లో కాంకోర్స్, ప్లాట్‌ఫాంల ఎత్తును సరిచేయాల్సి ఉంటుందన్నారు.

- కామినేని ఆసుపత్రి వద్ద ఒక స్టేషన్ నిర్మించనున్నారు. ఆ తర్వాత ఎల్‌బీనగర్ జంక్షన్‌లో కొత్తగా ఎల్‌బీనగర్ ఎయిర్‌పోర్టు స్టేషన్ రానుంది. ఈ మార్గంలో అండర్‌పాస్‌తోపాటు, రెండు ఫ్లైఓవర్‌లతో మెట్రో కారిడార్ నిర్మాణంలో ఇంజనీరింగ్ సవాళ్లు ఉన్నట్లు నిపుణులు గుర్తించారు.
- ఎల్‌బీనగర్ జంక్షన్‌కు కుడి వైపున కొత్తగా నిర్మించనున్న మెట్రోస్టేషన్ నుంచి ఎడమవైపున ఉన్న మరో స్టేషన్ (మియాపూర్-ఎల్‌బీనగర్ కారిడార్)కు మరో విశాలమైన స్కైవాక్‌తో అనుసంధానం చేయనున్నారు. మియాపూర్, అమీర్‌పేట మీదుగా ఎల్‌బీ నగర్‌కు వచ్చే ప్రయాణికులు ఇక్కడి నుంచి స్కైవాక్ మార్గంలో ఎల్‌బీనగర్ కొత్త ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్‌కు చేరుకుంటారు.

ఎల్‌బీనగర్‌లో మరో స్కైవాక్..



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

- బైరామల్‌గూడ, సాగర్‌రింగ్ రోడ్డు కూడలిలో ఇప్పటికే ఎత్తయిన ఫ్లైఓవర్లు ఉన్నందున ఈ రూట్‌లో ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్ ఎత్తును మరింత పెంచాల్సి ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరోవైపు ఈ జంక్షన్‌లో మెట్రో స్టేషన్ ఎత్తును తగ్గించడానికి, అలైన్‌మెంట్‌ను ఫ్లైఓవర్లకు కుడి వైపునకు మార్చాల్సి ఉంటుందన్నారు. అలాగే పక్కనే ఉన్న బహిరంగ ప్రదేశంలో మెట్రో స్టేషన్‌ను నిర్మించనున్నారు.
- మైత్రీ నగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట జంక్షన్, ఒవైసీ హాస్పిటల్, డీఆర్డీఓ, హాఫీజ్ బాబానగర్ తదితర ప్రాంతాల్లో ప్రతిపాదించిన మెట్రో స్టేషన్‌లను చుట్టుపక్కల ఉన్న కాలనీలకు అందుబాటులో ఉండేలా కూడళ్లకు సమీపంలో నిర్మించనున్నారు.



జగన్ పథకాలు కాపీ కొడుతున్న టీడీపీ

ఆయన పథకాలే వారి మేనిఫెస్టోలోనూ పెట్టారు

- వలంటీర్ల వ్యవస్థ కొనసాగించి... ఎక్కువ వేతనం ఇస్తామంటున్నారు
- అంటే అవన్నీ బాగున్నాయని చెబుతున్నట్టే కదా.. ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ బాగా నచ్చింది
- మహిళలైతే ఎక్కువ మంది వైసీపీ వైపే..
- సాక్షి ఇంటర్వ్యూలో సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

తెలుగు రాష్ట్రాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి ప్రయత్నాలు విద్య, వైద్య రంగంలో ప్రారంభమయ్యాయి. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం అంత పెద్ద ఆస్పత్రిని ఈ ప్రభుత్వ కట్టించింది. ఈ పని ఇంత కాలంగా ఎవ్వరూ చేయలేదు. పెద్ద సంఖ్యలో మెడికల్ కాలేజీలు వస్తున్నాయి. మరోవైపు నిన్న, మొన్నటి వరకూ ఎవరూ పట్టించుకోని గవర్నమెంట్ స్కూల్స్‌లో చాలా అద్భుతమైన మార్పులు తెచ్చారు. ఇంటింటికీ వచ్చి హెల్త్ చెకప్స్, మందులు పంపిణీ చేసే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కూడా నాకు చాలా నచ్చింది. మొత్తంగా చూస్తే ప్రజలకు అత్యంత ప్రధానమైన ఈ రెండు రంగాలకు జగన్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఎవ్వరైనా ఒప్పుకుని తీరాల్సిందే.

లంచాలకు బ్రేక్ పడింది..

ఈ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ కూడా చాలా బాగుంది. ప్రజల ఇళ్ల దగ్గరకు వెళ్లి లబ్ధిదారులకు పథకాలు అందించడం వినూత్న ప్రయత్నం. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు అందుకోవాలంటే చాలా కష్టమయ్యేది. లంచాలతో తప్ప పనయ్యేది కాదు. వలంటీర్ వ్యవస్థ అలాంటి సమస్యలకు పరిష్కారం చూపింది. గ్రామ సెక్రటేరియట్స్‌లోనూ చాలా వరకూ పనులు సులభంగా అవుతున్నాయంటున్నారు. అక్కడక్కడా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయంటున్నా.. కొత్త వ్యవస్థ కాబట్టి బాలారిష్టాలు తప్పవు. అయితే వీటి ప్రభావం వల్ల ఇప్పటికే ఉన్న రెవెన్యూ, పంచాయతీ రాజ్ వ్యవస్థ లాంటివి వృథాగా మారకుండా చూడాల్సిన అవసరం ఉంది.

చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయారు

మెడికల్ కాలేజీలు, బందరు పోర్ట్‌తో సహా 4 పోర్టులు కడుతున్నారు. షిప్పింగ్ హార్బ ర్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఇలాంటివన్నీ చెప్పుకోవడంలో ఈ ప్రభుత్వం వెనుకబడిందని నా అభిప్రాయం. ఇప్పుడు చెబుతున్నారు కానీ తాము చేసిన అభివృద్ధి గురించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి నుంచీ చెప్పుకుని ఉండాల్సింది.

మద్యం రేట్లపై విపక్షాల హామీ దురదృష్టకరం

మద్యపాన నిషేధంలో భాగంగా చాలా వరకూ బెల్ట్‌షాపులు తగ్గించారు. వినియోగం తగ్గించడానికి రేట్లు కూడా పెంచారు. ఈ చర్యలు తాగుబోతులకు నచ్చకపోవచ్చు. అందుకనే ఈ ఎన్నికలు తాగుబోతులకు నాన్ తాగుబోతులకు మధ్య అన్నట్టు మారాయి. ఎన్నికల ప్రచారంలో 'నాణ్యమైన మద్యం ఇస్తాం... మ ద్యం రేట్లు తగ్గిస్తాం' అంటూ ప్రతిపక్ష పార్టీలు ప్రచా రం చేయడం చాలా దురదృష్టకరం. మద్యపాన నిషే ధం చేయలేదని విమర్శిస్తున్న వారు తాము చేస్తామని ధైర్యంగా చెప్పాలి గానీ... నాణ్యమైన మద్యం ఇస్తాం అనడం ఏమిటి? మొత్తంగా చూస్తే అత్యధిక సంఖ్యలో మహిళలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. తాగుబోతు భర్తల్ని మహిళలు అదుపు చేయగలిగితే మ రోసారి వైఎస్సార్‌సీపీ బంపర్ మెజార్టీతో వస్తుంది.

పోలవరం పూర్తయితే బాగుంటుంది

పోలవరం వచ్చే ఐదేళ్లలో పూర్తయితే బాగుంటుందని ఆశిస్తున్నా. అలాగే విభజన హామీలు కూ డా పూర్తిగా సాధించాల్సి ఉంది. మరోవైపు అధికార ప్రతిపక్షాలు ఇకనైనా వ్యక్తిగత దూషణలు వదిలేసి రాష్ట్రం, రాష్ట్ర ప్రజల అభివృద్ధి గురించి మాత్రమే ఎక్కువగా మాట్లాడితే బాగుంటుంది.

– సత్యార్థ

నవరత్నాలపై రాష్ట్ర నాశనం అన్నవారే ఫాలో అవుతున్నారు

- మొన్నటి దాకా నవరత్నాలు వృథా.. అవి ఇవ్వడం వల్ల రాష్ట్రం నాశనం అయిపోతోంది అన్నారు. ఇప్పుడు పన్నెండున్నర రత్నాలు ఇస్తామంటున్నారు. వలంటీర్ల వల్ల నేరాలు ఘోరాలు అన్నారు. కానీ జీతాలు పెంచి మరీ కొనసాగిస్తామంటున్నారు. వీళ్ల అవన్నీ అనేసి నాబోటి వాళ్లని వైఎస్సార్‌సీపీ సపోర్ట్ అంటున్నారు. నిజానికి నేను బాగుందని మాత్రమే అంటున్నా 'జగన్ పథకాలన్నీ తిరిగి తెస్తాం, జీతాలు పెంచి మరీ వలంటీర్లను కొనసాగిస్తాం.. గ్రామ సెక్రటేరియట్, నాడు నేడు వంటివన్నీ మేమూ అమలు చేస్తాం' అంటున్నారంటే తమకు కూడా ఈ పథకాలన్నీ నచ్చాయని చెబుతున్నట్టే కదా.. అంటే తెలుగుదేశం వాళ్లు కూడా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులన్నట్టే కదా.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.